## ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి - కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శన



09

సంపుటి 09, సంచిక: 296 | శనివారం | 26-09-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# వెళ్లి మళ్లీ రా!

- గంగమ్మ ఒడికి గణపతులు
- వైభవంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు
- 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' నినాదాలతో హోరెత్తిన హుస్సేన్ సాగర్ పరిసరాలు

కన్నుల పండువగా సాగిన ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

భాగ్యనగరాన్ని 11 రోజుల పాటు భక్తి పారవశ్యంలో ముంచెత్తిన వినాయక నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి, బాలాపూర్, నగర వ్యాప్తంగా మంటపాల్లో నెలకొల్పిన గణేశుల నిమజ్జనంతో అత్యంత వైభవంగా, ప్రశాంతంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాలు, డప్పుల మోతలు, 'గణపతి బప్పా మోరియా', 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' నినాదాలతో హుస్సేన్ సాగర్ పరిసరాలు హోరెత్తాయి. శోభాయాత్రగా సాగిన ఖైరతాబాద్ బడా గణేశుడు ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తుతో భక్తులకు దర్శనమిచ్చిన ఖైరతాబాద్ 'పంచముఖ సంకటహర మహాగణపతి' శోభాయాత్ర ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైంది. బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రారంభంలో మూడు గంటలు ఆలస్యమైనప్పటికీ, అధికారుల సమన్వయంతో ఊరేగింపు వేగంగా కొనసాగింది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ నృత్యం చేసి భక్తులలో ఉత్సాహాన్ని నింపారు. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్‌టిఆర్ మార్గ్‌కు చేరుకుంది. మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో ఎన్‌టిఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్



నంబర్4 వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భారీ క్రేన్‌ల సహాయంతో మహాగణపతిని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. అశేష భక్తజనం భావోద్వేగాల నడుమ స్వామివారికి వీడ్కోలు పలికారు. ఈ శోభాయాత్రలో మహారాష్ట్ర సంస్కృతికి చెందిన 'మిత్రాంగన్ ఢోల్ తాషా పథక్' ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. వనస్థలిపురం సాహెబ్ నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు దక్కించుకున్నారు. వేలం ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రారంభమైన 16 కిలోమీటర్ల బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర తరువాయి 12లో

## బాలాపూర్ లడ్డూ @ రూ.39 లక్షలు

ప్రజాపక్షం/రంగారెడ్డి

ఉత్కంఠగా సాగిన వేలంపాటలో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గణేష్ లడ్డు ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో హైదరాబాద్ వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన "అర్బన్ గ్రూప్స్ "అధినేతి సామ ప్రణీత్ రెడ్డి అత్యంత పోటీ మధ్య రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది బాలాపూర్ లడ్డూ పాట రూ.35 లక్షలకు ముగిసింది. ఈసారి ఆ రికార్డును చెరిపివేస్తూ మరో రూ.4 లక్షలు అధికంగా పలికింది. బాలాపూర్ లడ్డూ వేలం పాటకు సుదీర్ఘ చరిత్ర,ప్రత్యేక విశిష్టత ఉంది. 1994లో కేవలం రూ.450 తో ప్రారంభమైన ఈ లడ్డూ వేలం సంప్రదాయం, తరువాయి 12లో

## సిఇసి జ్ఞానేశ్‌కుమార్ తీరుపై సుప్రీంకోర్టులో పిటిషన్

ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని ప్రకటించాలని అభ్యర్థన



**న్యూఢిల్లీ :** ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఇటువంటి చర్యలు సామూహిక నిర్ణయం తీసుకోవాలనే చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయవాది తరువాయి 8లో

## పార్టీ ఫిరాయించిన వారిపై ఆంక్షలు విధించాలి

- తిరిగి ఎన్నికయ్యేంత వరకూ ప్రభుత్వ పదవుల్లో కొనసాగనీయొద్దు
- అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారాన్ని ఎంపిలైతే రాష్ట్రపతికి, ఎమ్మెల్యేలైతే గవర్నర్‌కు బదిలీ చేయాలి
- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ సూచన
- 2022-26 మధ్య 111 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఎడిఆర్ విశ్లేషణలో వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో పార్టీ ఫిరాయింపుల సంస్కృతి కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ఒక పార్టీ నుంచి పోటీ చేయడం, గెలిచిన తరువాత మరొక పార్టీలోకి దూకే విష సంస్కృతికి ప్రజాప్రతినిధులు తెరలేపారు. తమ పార్టీలో సరైన స్థానం దక్కలేదనో, నియోజకవర్గ అభివృద్ధి పేరిటనో పార్టీ ఫిరాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2022 నుండి 2026 మధ్య పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో గెలిచిన తర్వాత ఏకంగా 111 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. వీరిలో అత్యధిక సంఖ్యలో నాగాలాండ్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటువంటి పార్టీ మార్పులు నమోదయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఎడిఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషించింది. ఎన్నికల సంఘం సలహా ఆధారంగా, ఫిరాయింపుల నిరోధక చట్రంలో తరువాయి 8లో

## దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

- సిఇఒ కార్యాలయాల ముట్టడి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్



అసోంలో..

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిరసనలను చేపట్టింది. ఎన్నికల సంఘం కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలను నిర్వహించింది. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినదించింది. దీంతో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. అసోంలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గగోయ్ సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిహార్ రాజధాని పాట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు తరువాయి 8లో

## 'ముడి పామాయిల్ ' దిగుమతి సుంకం పునరుద్ధరించాలి

- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల డిమాండ్
- రైతుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

'ముడి పామాయిల్' దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునః సమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు తగిన రక్షణ కల్పించేలా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును కాపాడాల్సిన కేంద్రం, అందుకు భిన్నంగా దిగుమతి దారుల ప్రయోజనాలకు పెద్దపీట వేయడం సరికాదన్నారు. రైతుల భవిష్యత్తుతో ఆటలాడే దిగుమతి విధానాలను కేంద్రం వెంటనే పునః సమీక్షించాలని, ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల తరువాయి 8లో

## నైపుణ్య శిక్షణలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

- పిఎం సేతు అమలులో అగ్రస్థానంలో రాష్ట్రం
- నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్టేట్స్, యుటిస్ స్కిల్ సెక్రటరీస్ ఫర్ ప్రగతి రివ్యూలో వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్




పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేస్తున్న తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పిఎం సేతు అమలు, అప్రెంటిస్‌షిప్, ఆన్‌దిజాబ్ శిక్షణ, ప్లేస్‌మెంట్‌లలో రాష్ట్రం అగ్రస్థానాల్లో ఉన్నట్లు న్యూఢిల్లీలో జరిగిన తరువాయి 12లో






## చైనా ఎదుగుదలను ప్రతిబింబిస్తున్న జిన్‌పింగ్–ట్రంప్ శిఖరాగ్ర భేటీ

**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాషింగ్టన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఇచ్చిన ఘన స్వాగతంపై ఇప్పుడు జోరుగా చర్చ జరుగుతున్నది. ట్రంప్ ఆతిథ్యం జిన్‌పింగ్‌ను ఎంతగా ఆకట్టుకుందో స్పష్టంగా తెలియదుగానీ, చైనా ప్రజలపై మాత్రం గణనీయమైన ప్రభావం చూపింది. జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియువాన్‌కు విమానాశ్రయంలో ట్రంప్ స్వయంగా స్వాగతం పలకడం అందరినీ ఆశ్చర్యపరచింది. ట్రంప్ చాలా అరుదుగా ఈ విధంగా స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి, అతిథులకు ఆహ్వానం పలుకుతారు. కాగా, ఇరువురు నేతలు పాల్గొన్న ద్వైపాక్షిక, సాంస్కృతిక కార్యక్రమాలను చైనా ప్రభుత్వ మీడియా విస్తృతంగా ప్రసారం చేసింది. వాటిని ప్రశంసించింది కూడా. స్వదేశంలో ఈ దృశ్యాలను చూసిన చైనా ప్రజలకు తమ దేశానికి పెరిగిన ప్రాధాన్యం స్పష్టంగా కనిపించింది. 'అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అమెరికా అత్యంత ఘనమైన ఆతిథ్యాన్ని ఇస్తోందని వార్తల్లో చదివాను. ఇది నన్ను బాగా ఆకట్టుకుంది. మన దేశం నిజంగా శక్తిమంతంగా మారిందని తరువాయి 8లో





# జ్ఞానేష్ కుమార్‌కు పదవిలో కొనసాగే నైతికత ఉందా?

భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగం ద్వారా వ్యవస్థాపితమైన ఒక వ్యవస్థ తప్ప ఏ వ్యక్తికీ సంబంధించిన నిరంకుశాధికార కేంద్రం కాదు. అటువంటి ప్రమాదం నివారించేందుకు ఏకవ్యక్తి ఎన్నికల కమిషన్ త్రిసభ్య కమిషన్‌గా చట్టరీత్యా విస్తరించబడింది. ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాకచక్యంగా కమిషనర్‌ల నియామకాన్ని తన చెప్పుచేతల్లోకి తీసుకున్నారు. తమ నమ్మినబంటు జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. చట్టం, సాంప్రదాయం ప్రకారం ఆయన ముగ్గురు కమిషనర్‌లలో ప్రథముడు తప్ప సర్వాధికారి కాదు. కాని ఆయన తన యజమానుల ఆదేశాలను పాటిస్తూ సహ కమిషనర్‌ల అభిప్రాయాలను ఖాతరు చేయకుండా ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు సహజమని, చివరకు నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకుంటున్నట్లు ఆయన తరఫున కమిషన్ అధికారులు ఇచ్చిన వివరణ, ఓటరు జాబితాల క్షాళనకోసం 'ప్రత్యేక ముమ్మర సవరణ'కు సంబంధించి గత 10 మాసాల్లో 14 సార్లు సహ కమిషనర్‌లు తెలియజేసిన అభ్యంతరాలను సిఇసి త్రోసిపుచ్చి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న వాస్తవం ముందు వీగిపోయింది.

బిహార్‌లో 'సర్'తో మొదలుపెట్టి, ఆ తర్వాత పశ్చిమ బెంగాల్, హర్యానాలతో యావద్దేశానికి విస్తరించిన 'సర్' ప్రక్రియలో 13 కోట్లమంది ఓటర్లు జాబితాలనుంచి తొలగించబడ్డారు. ప్రతి వయోజనుడికీ ఓటు హక్కు కల్పించటం, ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా నిర్వహించటం, తద్వారా ప్రజల ప్రజాస్వామిక తీర్పు ప్రకారం మెజారిటీ సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారం చేబట్టే క్రమానికి చట్టబద్ధ ప్రాతిపదిక కల్పించటం ఎన్నికల కమిషన్ విధి. అంతేకాని జ్ఞానేశ్‌కుమార్ ఎదుర్కొంటున్న ఆరోపణల్లాగా పాలక బిజెపిని లేదా మరోపార్టీని అధికారంలో కూర్చోబెట్టటం ఎన్నికల కమిషన్ పనికాదు. అది దానికున్న రాజ్యాంగ ఆదేశానికి ద్రోహం, ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు. ఏకాభిప్రాయం ప్రకారం లేదా మెజారిటీతో కమిషన్ నిర్ణయాలు తీసుకోవాల్సిన పనితీరును కాదని తోటి కమిషనర్‌ల అభ్యంతరాలు తెలిపిన అంశాల్లో ఏకపక్షంగా ఎందుకు నిర్ణయాలు తీసుకున్నారు, ఎవరికోసం తీసుకున్నారు అనే ప్రశ్నకు, సూటి జవాబు కావాలి. చాలా విషయాల్లో ఏకగ్రీవంగానే నిర్ణయాలు తీసుకున్నామనే సమాధానం మౌలిక ప్రశ్నను దాటవేసే లక్షణం.

ఎన్నికల కమిషనర్‌లు ఏ పార్టీకీ – కనీసం ఆ పదవిలో నియామకం తదుపరి – చెందరు. కాని జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషన్ పాలక బిజెపి ఓట్ల చోరీకి సహకరిస్తోందని, పూర్తి పక్షపాతంతో పనిచేస్తోందని సంవత్సరం పైబడి ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నప్పుడు, ఆయన్ను పదవినుంచి తొలగించాలని అభిశంసన నోటీసు సమర్పించినపుడు సైతం ఆయన తన వైఖరిని సరిదిద్దుకోలేదు. కేవలం పాలక పార్టీయే ఆయన్ను సమర్థిస్తున్నదంటే ఆయన పక్షపాతంతో ఆ పార్టీకి మేలు చేస్తున్నారని అర్థం కావటం లేదా? తాజా బట్టబయలుతో జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. అభిశంసన నోటీసు మళ్లీ ఇచ్చే ఆలోచన చేస్తున్నాయి. అవి అట్టి నోటీసు ఇస్తే అది మూడవ నోటీసు అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఆత్మాభిమానం కలిగిన ఏ అధికారీ పదవిని అంటిపెట్టుకోరు. 63 మంది రాజ్యసభ సభ్యులు, 130మంది లోక్‌సభ సభ్యుల సంతకాలతో కుమార్ తొలగింపును కోరుతూ 2026 మార్చి 12న 7ఆరోపణలతో తొలిసారి అభిశంసన నోటీసు అందజేయబడింది. అది ఏప్రిల్ 17న తిరస్కరణకు గురైంది. ఏప్రిల్ 24న ప్రతిపక్షం 73 సంతకాలతో రాజ్యసభలో మళ్లీ నోటీసు ఇచ్చింది. పాలక ఎన్‌డిఎ జ్ఞానేశ్‌కుమార్‌కు మద్దతుగా ఉంది కాబట్టి తిరిగి మరో అభిశంసన నోటీసు ఇచ్చినా అది తిరస్కరణకు గురవుతుంది. కాని ఆ ప్రయత్నం ప్రజాస్వామిక పోరాటంలో భాగమవుతుంది, జ్ఞానేశ్‌కుమార్, మోదీ, అమిత్‌షా అప్రతిష్ట మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే, ఎన్నికల కమిషనర్‌ల నియామక చట్టాన్ని సవరించి, అందులోని ముగ్గురు సభ్యుల్లో (ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, తటస్థునిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి) ప్రధాన న్యాయమూర్తిని తొలగించి క్యాబినెట్ మంత్రిని చేర్చింది ప్రధాని మోదీయే. ఆ చట్టం సుప్రీంకోర్టులో సవాలు చేయబడి ఉండగానే క్యాబినెట్ మంత్రి స్థానాన్ని అమిత్ షాతో భర్తీ చేసిందీ, ఆ కమిటీ సమావేశాన్ని రాహుల్‌గాంధి బహిష్కరించగా, రిటైర్డ్ అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసిగా నియమించిందీ మోదీ, అమిత్ షా లే. ఆ చట్టం ఇప్పటికీ సుప్రీంకోర్టు ముందుంది. ఈ లోపు ఓటర్ల జాబితాల్లో తారుమార్లు, 30 రాష్ట్రాలు, యుటిల్లో సర్ ప్రక్రియ అమలు, 13 కోట్లమంది ఓట్లు తొలగింపు జరిగిపోయాయి. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం కోట్లమంది ఓటర్లు అవస్థలు పడుతున్నారు. వారిలో అత్యధికులు ఏ డాక్యుమెంట్లూ లేని దళితులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులని వేరుగా చెప్పనవసరం లేదు.


"స్వరాజ్‌లోని బహుముఖ అంశాల్లో కీలకమైనది వయోజన ఓటింగ్. అది అధికారంలోని వారికి వ్యతిరేకంగా ప్రజల ప్రత్యక్ష కార్యాచరణ".

*– మహాత్మాగాంధి (యంగ్ ఇండియా) 1931 జూన్ 18.*

"ఎన్నికల సూపరింటెండెన్స్, డైరెక్షన్, కంట్రోలు ఎన్నికల కమిషన్‌కు దఖలు అవుతాయి. ఎన్నికల జాబితాలు తయారు చేయటంలో ఎన్నికల కమిషన్ ఎటువంటి అన్యాయం చేయరాదు. తద్భిన్నమైన చర్య ఏదైనా ప్రజాస్వామిక ప్రభుత్వ మూల వేరునే కత్తిరిస్తుంది".

*–డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, 1949 జూన్ 15. రాజ్యాంగ సభలో ఆర్టికల్ 289(ఇప్పుడు ఆర్టికల్ 324)ప్రతిపాదిస్తూ చెప్పిన మాట.*

సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష, రాజ్యాంగ విరుద్ధ చర్యలను పై ఇద్దరు మహానుభావుల అభిప్రాయాలతో పోల్చి చూస్తే మన ప్రజాస్వామ్యం విలువలు ఎంత దిగజారాయో విదితమవుతుంది. అందువల్ల జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలన్న ప్రతిపక్ష పార్టీల డిమాండ్ ఎంతో సమంజసం, న్యాయబద్ధం. తనుగా రాజీనామా చేయటం నైతిక ధర్మం!



## ఎంత మంది బంగ్లాదేశీయులను గుర్తించారు?

భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ అమలు చేశారనే మాటలు నేను వింటూనే ఉన్నాను. ఇప్పటి వరకు సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా ఎంతమంది అక్రమ బంగ్లాదేశీయులను గుర్తించారో ఎన్నికల కమిషన్ చెప్పగలదా? సమాధానం లేదు. విదేశీయుల చట్టం కింద ఎంతమందిని వెనక్కి పంపారో చెప్పగలదా? సమాధానం లేదు! దయచేసి ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయండి, కానీ అది పారదర్శకంగా చేయాలి. అర్హులైన పౌరుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కాదు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, ప్రముఖ జర్నలిస్టు





## పర్యావరణ ఆరోగ్యమే జీవకోటి సౌభాగ్యం

ఐరాస లాంటి పలు అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే అతి పెద్ద కార్యక్రమాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ యజ్ఞాన్ని నిరంతరం కొనసాగుతూ మనకు హెచ్చరికలు చేస్తూ వస్తున్నది. పర్యావరణ ఆరోగ్యమే సకల జీవకోటిని సౌభాగ్యమని తెలుసుకొని మన జీవనశైలిని 'హరిత ఆలోచన'ల వైపు మళ్లిస్తేనే పర్యావరణ కాలుష్యం తగ్గిపోయి మనకే కాకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్య గొడుగులు పడతాయని తెలుసుకుందాం. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా అనాలోచిత సాగు పద్ధతులు, మైనింగ్, ఆటోమొబాల్ ఉద్గారాలు, శిలాజ ఇంధనాల ఉద్గారాలు, అటవీ కార్చిచ్చులు, రేడియోధార్మిక పదార్థాలు, మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామికీకరణ, రవాణా, పట్టణీకరణ, భూతా పం, అడవుల నరికి వేత, నిర్మాణ రంగం లాంటి అవాంఛనీయ అంశాలు నిలుస్తున్నాయి. పర్యావరణ కాలుష్యం ఫలితంగా మానవాళి/ప్రాణికోటి అనారోగ్యాలు, జీవ వైవిధ్యానికి విఘాతాలు, వాతావరణ మార్పులు, ఆర్థిక ప్రతికూలతలు, సామాజిక ప్రభావాలు లాంటి పలు దుష్ప్రభాలు కలుగుతున్నాయి. వివిధ రకాల కాలుష్యాల్లో గాలి, నేల, నీటి, శబ్ద, రేడియోధార్మిక, దుమ్ము, ఉష్ణ, విష వాయు, సముద్ర, కాంతి కాలుష్యాలు ప్రధానమైనవని మనకు తెలుసు. పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం:

26 సెప్టెంబర్ 2026న ప్రపంచవ్యాప్తంగా 2011 నుంచి మానవాళి ఘనంగా నిర్వహించుకునే ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం (వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ డే) నిర్వహించుకునే వేళ 2025 ఇతివృత్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం సామాజిక ఆరోగ్య సాధనలో వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానం (ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ : స్టాండింగ్ విత్ సైన్స్ టు ప్రొటెక్ట్ కమ్యూనిటీస్) అనబడే అంశాన్ని తీసుకున్నారు. మానవాళి ఆరోగ్య పరిరక్షణతో పాటు శ్రేయస్సు కల్పనకు గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, వాతావరణ ప్రతికూల మార్పులను తగ్గించడం, శ్వాసకోశ సంబంధ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండడం కొనసాగాలి. గాలి, నేల, జల కాలుష్యాలకు ప్రధాన ప్రమాదకర కారణంగా నిలుస్తున్న ప్లాస్టిక్ కాలుష్యంతో భూమాత ఊపిరి పీల్చడం కష్టంగా తోస్తున్నది. ప్లాస్టిక్ కాలుష్య కోరల్ని పెకిలించడానికి రీయూజ్, రీసైకిల్, రెఫ్యూజ్, రెడ్యూస్, రీథింక్ అనే నినాదాలకు కార్యరూపం దాల్చడం మాత్రమే మన ముందున్న ఉత్తమ కర్తవ్యం. ప్లాస్టిక్ కాలుష్య దుష్ప్రభావంతో వాతావరణ ప్రతికూల మార్పులు, నేల/ప్రకృతి/జల/జీవ వైవిధ్య సంక్షోభాలు, వ్యర్థాల కాలుష్యం లాంటి ప్రమాదకర సమస్యలు ప్రాణికోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేడు ధరణిలో నెలకొన్న జల నెలవులు, నేలలు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం కావడం జరుగుతోంది. నేల లేదా జలాల్లోకి చేరిన ప్లాస్టిక్ జీవ విచ్ఛిన్నం లేదా డీగ్రేడేషన్ కావడానికి వంద ఏండ్లు కూడా పట్టవచ్చని నిపుణులు హెచ్చరించడం గమనార్హం. మన జీవన విధానంలో ప్రతి క్షణం పర్యావరణ హితాన్ని కోరుతూ మన జీవన పయనం కొనసాగించాలి. పర్యావరణ కాలుష్యానికి కారణం కాకుండా మన జీవనశైలిని మార్చుకుంటూనే పౌర సమాజంలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచడం మన కనీస కర్తవ్యంగా భావించాలి. విద్యార్థులు, పాలసీ మేకర్స్, తల్లిదండ్రులు, పౌర సమాజం కలిసి పర్యావరణాన్ని కాపాడే మహాయజ్ఞంలో భాగం కావాలి. వాతావరణ పరిశుభ్రతను పాటించి, జల వనరులను వ్యర్థాల నుంచి రక్షించి, మన ఏకైక భూగ్రహాన్ని కాపాడుకుందాం. మనకు మేలు చేస్తున్న పర్యావరణానికి కీడు తలపెట్టవద్దు. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు.

# అంగరంగ వైభవంగా ఫ్రెంచి కమ్యూనిస్టు పత్రిక 'లీమ్యానిటే' ఉత్సవం

## అధ్యక్ష ఎన్నికలకు ముందు వామపక్షాల్లో ఉత్తేజం నింపిన వేడుక

**ల్యూక్ రొటెల్లో, మాత్ విస్‌న్యూస్కీ**

'నేను ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటాను. తమ జీవనోపాధిని రక్షించుకునేందుకు పోరాడేవారి పక్షాన, తమ పిల్లలకు తిండి పెట్టటానికి, బిల్లులు చెల్లించటానికి గౌరవం కోసం పోరాడేవారి పక్షాన ఉంటాను,' అని గత వారాంతంలో వేలాది మంది ప్రజల సమక్షంలో ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్)జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ ప్రకటించారు. 'అడ్డంకులు ఉన్నప్పుడు నేను ఏ పక్షాన ఉన్నానో నాకు తెలుసు.'

సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరిగిన పిసిఎఫ్ అనుబంధ దినపత్రిక ' లీమ్యానిటే'(L'HUMANIT) 91వ 'ఫెట్ డి లీమ్యానిటే' ఉత్సవంలో రౌసెల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్ నలుమూలలతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 5 లక్షల మందికి పైగా ప్రజలు ఉత్సవాలు, సంగీతం రాజకీయ చర్చల కోసం హాజరయ్యారు. 2027లో జరగబోయే ఫ్రెంచ్ అధ్యక్ష పదవికి తన అభ్యర్థిత్వాన్ని రౌసెల్ అధికారికంగా ప్రకటించిన వేదిక కూడా ఇదే.

ఈ ఉత్సవం ఇతివృత్తం, 1936లో పాపులర్ ఫ్రంట్ చేసిన ప్రకటనను గుర్తు చేసింది. అది ఐరోపాలో ఫాసిజం పెరుగుదలకు వ్యతిరేకంగా ఏకమైన కమ్యూనిస్టు, సోషలిస్టు, ప్రజాస్వామ్య శక్తుల ఒక విస్తృత ఫాసిస్టు వ్యతిరేక కూటమి. కార్మిక సంఘాల సమీకరణ, భారీ ప్రదర్శనలు, ఎన్నికల పోరాటం ద్వారా తిరుగుబాటు చేసిన పాపులర్ ఫ్రంట్ పచ్చి మితవాద ఉద్యమాన్ని ఓడించింది.

ప్రభుత్వాన్ని దాని ఎన్నికల వాగ్దానాలకు జవాబుదారీగా ఉంచుతూ, కార్మిక సంఘాలు, కార్మికులు తమ డిమాండ్ల కోసం సమీకరణ, ఆందోళనను కొనసాగించారు. తద్వారా ఫ్రాన్స్‌లో ఆధునిక కార్మిక, ప్రజాస్వామ్య హక్కులకు మూల స్తంభాలను సాధించారు. 2024లో జరగబోయే ఆకస్మిక (స్నాప్) ఎన్నికలలో పార్లమెంటులో పచ్చి మితవాద పార్టీలకు మెజారిటీ వచ్చే ప్రమాదం మళ్లీ తలెత్తడంతో, ఫ్రాన్స్‌లోని ప్రధాన కార్మిక సంఘాల సమాఖ్యలు ఏకమై 'న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్ఎఫ్‌పి)' ఏర్పాటుకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా మధ్యేవాద వామపక్ష శక్తులు ఏకమై ఒకే పార్లమెంటరీ అభ్యర్థుల జాబితాను, ఉమ్మడి రాజకీయ కార్యక్రమాన్ని ప్రకటించాలి. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో గత కూటమి విచ్ఛిన్నమైంది. దీంతో, పచ్చి మితవాద పార్టీలు అధికారాన్ని చేజిక్కించుకునే ప్రమాదం ఉన్నప్పటికీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ పార్లమెంటును రద్దు చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్), సోషలిస్ట్ పార్టీ (పిఎస్), పాపులిస్ట్ ఫ్రాన్స్ ఇన్సౌమిస్ (ఎల్ఎఫ్ఐ), గ్రీన్స్ (ఇఇఎల్‌వి), ఇతర చిన్న పార్టీలతో కూడిన ఎన్ఎఫ్‌పి అనూహ్య విజయాన్ని సాధించి, నేషనల్ అసెంబ్లీలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. తద్వారా ఫాసిస్ట్ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్)కి, మ్యాక్రాన్ నయా ఉదారవాద మిత్రపక్షాలకు మెజారిటీ రాకుండా అడ్డుకుంది.

అయితే, ఈ కూటమి ప్రధానమంత్రి పదవికి తమ తరఫున ఏకాభిప్రాయ అభ్యర్థిని నియమించలేకపోయింది. అలాగే ఫ్రెంచ్ అధ్యక్ష పదవి అపారమైన శక్తిని సమతుల్యం చేయలేకపోయింది. ఇది ప్రస్తుత రాజకీయ అస్థిరత, పొదుపు చర్యలు, సైనికీకరణ, పెరుగుతున్న తీవ్ర మితవాద పక్ష భావజాలానికి దారితీసింది. ఇప్పుడు తదుపరి అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, డజన్ల కొద్దీ ఇతర పార్టీ నాయకులతో పాటు అవినీతి ఆరోపణలపై దోషిగా తేలినప్పటికీ, చట్టపరమైన సాంకేతిక కారణాలతో పోటీ చేయడానికి అనుమతించబడిన ఆర్ఎన్ నాయకురాలు మెరైన్ లీ పెన్, ఇటీవలి అభిప్రాయ సేకరణలలో స్పష్టమైన ముందంజలో ఉన్నారు.

పిసిఎఫ్, లీ మ్యానిటే సంయుక్తంగా నిర్వహించిన 'ఫెట్ డి లీ మ్యానిటే' పాపులర్ ఫ్రంట్ చారిత్రక స్మృతులలోకి తిరిగి రావడం ద్వారా, కార్మిక వర్గ నాయకత్వం కింద వివిధ శక్తుల విస్తృత ఐక్యత ద్వారా మార్గాంతరాన్ని చూపింది.

ఈ ఉత్సవ ప్రాంగణమంతా వ్యాపారుల స్టాల్స్, దేశంలోని ప్రతి పిసిఎఫ్ ప్రాంతీయ శాఖ, పాపులర్ ఫ్రంట్ రాజకీయ మిత్రులతో పాటు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుల కోసం కేటాయించిన ఒక పెద్ద భాగంతో నిండిపోయింది. ఏంజెలా డేవిస్, నీనా సిమోన్, జోసెఫిన్ బేకర్‌ల పేరిట ఏర్పాటు చేసిన వేదికలపై అనేకమంది నల్లజాతి, ఎల్‌జిబిటిక్యూ+, కార్యకర్త కళాకారుల సంగీత ప్రదర్శనలు జరిగాయి. అదే సమయంలో, ఉత్సవ వీధులు, స్టాల్స్ తాజా ఆహారం, ఆకస్మిక కరోకే, నృత్య ప్రదర్శనలు, కార్నివాల్ ఆకర్షణలు, ఇంకా మరెన్నో వాటితో నిండిపోయాయి. ఫ్రెంచ్ చీజ్‌లు, సెనెగలీస్ పాలెట్యాస్సా, సూడానీస్ పప్పు రసం, లెక్కలేనన్ని ఇతర ప్రధాన వీధి ఆహారాల సువాసనలు గాలిలో తేలియాడాయి. వివిధ వాయిద్యాల, సంగీత సంప్రదాయాల శబ్దాలు గాలిలో మిళితమవుతుండగా, ఆకస్మిక ప్రదర్శనలు వాటిని జనసమూహాల గుండా తీసుకువెళ్ళాయి.

ఉత్సవాలు, రాజకీయాలు విడదీయరానివిగా మారాయి. పిసిఎఫ్ స్టాల్స్ పార్టీ కోసమే కాకుండా, వారి ఫెడరేషన్‌లలో జరుగుతున్న వివిధ సంఘీభావ ప్రయత్నాల కోసం కూడా నిధులు సేకరించాయి. ఫ్రాన్స్‌లోని అతిపెద్ద యూనియన్‌లలో ఒకటైన సిజిటి ప్రధాన కేంద్రంలో చర్చలు జరిపి, యూనియన్ సమాచారాన్ని పంపిణీ చేసింది. ఇది తరచుగా ఆహారం, పానీయాలు తీసుకువెళ్తున్న ఆసక్తిగల బాటసారులను ఆకర్షించింది. గాయకులు, నృత్యకారులు తమ ప్రదర్శనల మధ్య విరామాలలో నల్లజాతి, ట్రాన్స్‌జెండర్ ప్రజల జీవితాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు లేదా ప్రేక్షకుల మధ్య 'ఫ్రీ పాలస్తీనా' అనే నినాదాలు ప్రారంభించారు.

పాపులర్ ఫ్రంట్‌తో అనుబంధంగా ఉన్న అనేక లాభాపేక్షలేని, సామాజిక కార్యక్రమాల సంస్థలు కూడా హాజరయ్యాయి. వీటిలో ఎల్‌జిబిటిక్యూ+, పర్యావరణ న్యాయం, పౌర హక్కుల సంస్థలు కూడా ఉన్నాయి. కొంతమంది వాలంటీర్లు, ఇటీవల ఫ్రెంచ్ శాసనసభ ఆమోదించిన 'చంపే హక్కు' (రైట్ టు కిల్)చట్టాన్ని హైలైట్ చేస్తూ హాజరైన వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ చట్టం ప్రకారం, దేశవ్యాప్తంగా పోలీసులకు కాల్పులు జరిపేటప్పుడు పెక్కుస్థాయిలో విచక్షణాధికారం లభిస్తుంది. కోర్టులో వారిపై విచారణ చాలా వరకు తగ్గుతుంది.

మరికొందరు అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా క్యూబాకు మద్దతు ఇచ్చే మార్గాలతో కూడిన గ్రాఫిక్స్, స్థానిక ఆసుపత్రుల మూసివేత గురించిన సమాచారం, కొత్త దేశీయ వ్యవసాయ కార్యక్రమాలపై కరపత్రాలను పంచుకున్నారు.



ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్) జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్

పిసిఎఫ్ సభ్యుల్లో, ఉత్సవానికి హాజరైన వారిలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాలు – ఫ్రాన్స్‌లో పెరుగుతున్న సైనిక ఆధారిత ఆర్థిక వ్యవస్థ, అమెరికాపై ఆర్థికంగా ఆధారపడటం, ప్రపంచంలోని ఇతర దేశాలతో దాని సంబంధాలు.

ఫ్రాన్స్ ప్రస్తుతం 'డీ ఇండస్ట్రియలైజేషన్' (పరిశ్రమల మూసివేత) ప్రక్రియను ఎదుర్కొంటోంది. ఇందులో భాగంగా కొన్ని పరిశ్రమలు యూరోపియన్ యూనియన్ సరిహద్దుల ఆవలకి తరలించబడుతున్నాయి. అలాగే అంతర్జాతీయ గుత్తాధిపత్య సంస్థలకు అనుకూలంగా యూనియన్ పరిధిలోని ఉత్పత్తి వ్యవస్థలో మార్పులు చేస్తున్నారు.

అదే సమయంలో, దేశీయ పరిశ్రమలలో తగ్గుతున్న లాభాల రేట్లను పునరుద్ధరించే ప్రయత్నంలో మ్యాక్రాన్ ప్రభుత్వం కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడికి దిగింది. 2023లో తిరోగమన విధానాలతో కూడిన పెన్షన్ సంస్కరణలను బలవంతంగా ఆమోదించడంతో దేశవ్యాప్త సమ్మెలు జరిగి, లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. దీని అమలుకు సంబంధించిన కొన్ని అంశా లు తాత్కాలికంగా నిలిపివేయబడినప్పటికీ, కార్మికుల సామాజిక భద్రతలను పునరుద్ధరించడానికి, మెరుగుపరచడానికి ఫ్రాన్స్ కార్మిక సంఘాలు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి.

ఉత్సవం రెండవ రోజున రౌసెల్ ప్రసంగాన్ని వినడానికి 40,000 మందికి పైగా ప్రజలు 'ఏంజెలా డేవిస్ స్టేజ్' వద్ద ఉన్న మైదానంలో గుమిగూడారు. పార్టీ నాయకుల సమక్షం లో ఆయన మ్యాక్రాన్ ప్రభుత్వ సైనిక, ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించారు, ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలను జాతీయం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అలాగే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకు ముఖ్యంగా క్యూబా, పాలస్తీనాలకు అంతర్జాతీయ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.

పిసిఎఫ్ 40వ కాంగ్రెస్ రూపొందించిన ప్రధాన విధాన పత్రంలోని 'విజయాల కమ్యూనిజం' (communism of conquests) అనే సూత్రం ఆధారంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి రౌసెల్ నామినేట్ చేయబడ్డారు.ఆయన అభ్యర్థిత్వం పార్టీ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఇది పార్టీ సభ్యులు, శాఖలు, ఎన్నికైన ప్రతినిధులు, మిత్రపక్షాలను ఒక ఉమ్మడి వేదిక, లక్ష్యం వైపు సమీకరించింది. 2022లో ఆయన చేపట్టిన అధ్యక్ష పదవికి పోటీ చేసినపుడు 8,00,000కు పైగా ఓట్లు (2.3%)సాధించారు. 15 ఏళ్ల విరామం తర్వాత పార్టీ స్వతంత్రంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయటం అదే మొదటిసారి.

అయితే, అధ్యక్ష ఎన్నికల ప్రచారం మాత్రమే పిసిఎఫ్ ఏకైక లక్ష్యం కాదని రౌసెల్ స్పష్టం చేశారు. ఉత్సవ సమయంలోనూ, ఆ తర్వాతి రోజుల్లోనూ మ్యాక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని, దేశ ఇంధన రంగంపై పెరుగుతున్న ఒత్తిడి దృష్ట్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి రౌసెల్ ముఖ్య ఆకర్షణగా నిలిచినప్పటికీ, పలువురు ఇతర అధ్యక్ష అభ్యర్థులు, అలాగే తమ అభ్యర్థులను నిలబెట్టాలనుకుంటున్న పార్టీలు కూడా హాజరయ్యాయి. అధ్యక్ష పదవికి నాలుగోసారి పోటీ చేస్తున్న ఎల్ఎఫ్ఐ నాయకుడు జ్యా లిక్ మెల్షన్ ప్రారంభ రోజున తన ప్రసంగంతో భారీ జనసమూహాన్ని ఆకర్షించారు. ప్రస్తుతం మెల్షన్ ఇతర నయా ఉదారవాద అభ్యర్థుల కంటే స్వల్పంగా ముందంజలో ఉండి, పోల్స్‌లో లీపెన్ తర్వాత రెండవ స్థానంలో ఉన్నారు.

సెంటర్–లెఫ్ట్ అభ్యర్థుల ప్రైమరీని నిర్వహిస్తూ, పోల్స్‌లో రెండంకెల మద్దతు పొందుతున్న పిఎస్ పార్టీ కూడా ఈ ఉత్సవంలో పాల్గొంది. ఈ మూడు రోజుల పాటు ఇఇఎల్‌వి, చిన్న ట్రాట్స్కియిస్ట్ పార్టీల అధ్యక్ష అభ్యర్థులు కూడా హాజరయ్యారు.

ఇంత విస్తృత శ్రేణి రాజకీయ సంస్థల ఉనికి కొన్ని ఘర్షణలకు దారితీసింది. ఎల్ఎఫ్ఐకి చెందిన కొందరు కార్యకర్తలు పిఎస్ స్టాల్ బయట నిరసన తెలిపారు. మరికొందరు రౌసెల్, పిసిఎఫ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిని పిసిఎఫ్ సభ్యులు, కొందరు ముఖ్యమైన ఎల్ఎఫ్ఐ ప్రతినిధులు స్వయంగా ఖండించారు.

ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, పిసిఎఫ్, లీ మ్యానిటే, అనేక ప్రముఖ సంగీత బృందాలు ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యతా సందేశాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ కార్యక్రమాలు ఉత్సవం అంతటా అనేక సమయాల్లో లక్షలాది మందిని ఒకచోట చేర్చాయి. సంగీత కచేరీల సమయంలో, రూసెల్ చొక్కాలు, మెల్షన్ జెర్సీలు ధరించిన వేలాది మంది పాలస్తీనా, కనాకీ జెండాలను ఊపుతూ, 'సియామోటుట్టియాంటి ఫాసిస్టి!' (మేమంతా ఫాసిస్ట్ వ్యతిరేకులం!) అని నినాదాలు చేస్తూ ఏకమయ్యారు. ఉమ్మడి కార్మికవర్గ డిమాండ్లను ముందుకు తీసుకెళ్ల దం, ఫాసిస్ట్ మితవాదాన్ని ఓడించడం అనే సందేశంతో జరిగిన ముగింపు కార్యక్రమానికి, ఏంజెలా డేవిస్ వేదిక చుట్టూ లక్షలాది మంది తరలివచ్చారు.

చిన్న చిన్న సందర్భాలలో కూడా ఒక రకమైన ఆశాభావం వెల్లివిరిసింది. రౌసెల్ ప్రసంగిస్తున్నప్పుడు, తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ, ఉత్సాహపరుస్తుండగా, పిల్లలు గుంపు లో కలిసి ఆటలు ఆడుకుంటూ పరుగులు పెట్టారు. పైకెత్తిన పిడికిళ్లు, చిరునవ్వులు, కౌగిలింతలు, కరచాలనాల రూపంలో, ఈ సంఘీభావం దేశంలోని ఒక మూల నుంచి మరొక మూలకు, భాషలు, సరిహద్దులు, సముద్రాలను దాటి ప్రయాణించింది. పిసిఎఫ్, లీమ్యానిటే, సిజిటి, ఇతర ప్రగతిశీల శక్తులు వచ్చే ఏడాది ఎన్నికలు, ఆ తర్వాత కాలం వైపు చూస్తున్న తరుణంలో, కార్మికవర్గ ఐక్యత స్ఫూర్తి శాశ్వతంగా నిలిచి ఉంటుందని ఈ ఉత్సవం స్పష్టం చేసింది.

*(సౌజన్యం : పీపుల్స్ వరల్డ్)*





# దేశాన్ని మతం పేరుతో బిజెపి విభజిస్తోంది

● ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ సారధ్యంలోని బిజెపి ప్రభుత్వం భారతదేశాన్ని మతం పేరుతో విభజిస్తోందని, గాంధీ పరివార్ మాత్రం భారత ఐక్యతకు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళ రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని,వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళ వైపు ఎలా చూస్తారో, దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను ఒక సంకేతంగా చూడవచ్చని అభిప్రాయపడ్డారు. కేరళలో ప్రతిష్ఠాత్మకమైన 'ఆర్యదాన్ ముహమ్మద్2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్'పురస్కారాన్ని కేరళలోని నిలంబూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ చేతుల మీదుగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసపత్రం, జ్ఞాపికను సిఎంకు అందజేశారు. కేరళకు చెందిన కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సిఎం రేవంత్‌రెడ్డి దూర దృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువల పట్ల రేవంత్ రెడ్డి చూపుతున్న నిబద్ధతను కూడా అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు వెల్లడించింది. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2026 ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని, కేరళ నుంచి మొదలైన ఈ గాలి దేశమంతా తుఫానుగా మారాలని పిలుపునిచ్చారు. ఆర్యదాన్ ముహమ్మద్ తన జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేశారని గుర్తు చేశారు. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును తాను అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడే వరకు రాహుల్ గాంధీకి అండగా నిలవాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా, భూమి, భుక్తి, హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బిసిలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మకు సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని గుర్తుచేశారు. సమ్మక్క–సారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వివరించారు. సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని సిఎం తెలిపారు.

# విశ్వవేదికపై విరాజిల్లుతున్న రామప్ప దేవాలయం

● పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వెంకటపూర్/ములుగు :** కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే–2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లలగుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టిజిఎంఎస్‌కు చెందిన డి.శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్.శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.మనస్విని, ఎ.శ్రుతి, ఎం.పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రామప్పలో ఘనంగా హెరిటేజ్ వాక్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని డిజిటల్ అజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగాన్ని పునర్నిర్మించడం అనే ప్రధాన థీమ్‌తో నిర్వహించారు. రామప్ప ఆలయ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థులు, అధికారులు, పర్యాటకులు ఉత్సాహంగా హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు.




## సిఇసి పదవికి రాజీనామా చేయాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొంటున్నారన్నారు. బిజెపి,ఎన్‌డిఎ ప్రభుత్వ ఆధీనంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలుబొమ్మగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పౌరుల ఓటు హక్కును హరించే హక్కు ఎవరికీ లేదని, ఓటు హక్కు కల్పించే ఎన్నికల సంఘం 'సర్' పేరుతో పౌరుల ఓట్లను హరిస్తోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో ప్రగతిశీల వాదులు, వామపక్షవాదులు పాల్గొని, కేంద్రంలోని బిజెపి, ఎన్‌డిఎ ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగట్టాలన్నారు.

# 'ఎఐ'తో తెలంగాణ పర్యాటకానికి కొత్త రూపు

● శిల్పారామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

● హాజరుకానున్న సిఎం రేవంత్‌డ్డి, డిప్యూటీ సిఎం భట్టి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృత్రిమ మేధ (ఎఐ), డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుంటూ తెలంగాణ పర్యాటక రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ అజెండా–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 వేడుకలను శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించనున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 ఇతివృత్తం, పర్యాటక రంగంలో ఎఐ, డిజిటల్ సాంకేతికత వినియోగంపై ప్రజెంటేషన్లు నిర్వహించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్, పురావస్తు శాఖ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, ఆర్ట్ గ్యాలరీలు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నాయి. "ఎఐ అండ్ డిజిటల్ టెక్నాలజీ–ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం" అంశంపై తొలి ప్యానెల్ చర్చ జరగనుంది. అనంతరం విద్యార్థులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహిస్తారు. రెండో ప్యానెల్ చర్చలో ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం వంటి విభిన్న రంగాల్లో సాంకేతికతతో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవకాశాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదరనుంది.

## సామాజిక న్యాయానికి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అణచివేత, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని మంత్రి పేర్కొన్నారు. భూమి, భుక్తి, జీవన హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బిసిలు, వెనుకబడిన వర్గాలు, పేదలు, మహిళల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బిసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు గురుకులాలు, హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బిసి మహిళలు, యువతకు ఉపాధి, ఆర్థిక సాధికారత కల్పించే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని పొన్నం ప్రభాకర్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆరోపణలపై దర్యాప్తు జరపాలి

● ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసి పదవి నుంచి తొలగించాలని కోరారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం సిజెఐను తప్పించి వ్యవస్థను తన ఆధీనంలోకి తీసుకుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగిస్తున్నారని చామల ఆరోపించారు. ఫామ్6 ద్వారా ఓట్లను తొలగించి, తిరిగి ఓటు హక్కు కల్పించకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియపై కూడా దర్యాప్తు అవసరమన్నారు. హర్యానా ఎన్నికలకు సంబంధించిన సిసిటివి ఫుటేజీని రాహుల్ గాంధీ కోరినా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోని సిసిటివి ఫుటేజీని కనీసం 45 రోజులపాటు భద్రపరచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా బల్క్ ఓట్ల నమోదుతో పాటు ఫొటోగ్రాఫ్‌ల మార్పుపై ఆరోపణలు ఉన్నాయని, వీటిపైనా సమగ్ర విచారణ జరగాలని చామల కోరారు. సిఇసిని పదవి నుంచి తొలగించాలంటే పార్లమెంట్‌లో అభిశంసన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని చామల పేర్కొన్నారు.

# రాజకీయాలు పక్కన పెట్టి రైతుల కోసం ఆలోచించాలి

● బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునే విధంగా ఆన్ ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లను నడిపి, జలాశయాలను నింపాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపంనెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు శుక్రవారం లేఖ రాశారు. గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నప్పటికీ ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందని, నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులపైన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉండగా, మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టిఎంసిలు మాత్రమే ఉన్నదని, మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందని మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో 15 టిఎంసిలకు గాను కేవలం 6 టిఎంసిల నీళ్లే ఉన్నాయని, ఇక్కడికి కూడా ఆ నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుందని, రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదపడుతుందన్నారు. ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని మోటార్లను నడిపి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే అందుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్‌రావు ఆరోపించారు.


## రానున్న రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా రాగల రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల సహా పలు జిల్లాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. శని, ఆదివారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలతో పాటు ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని, మంగళవారం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు.

## ఎన్నికల్లో టిడబ్ల్యుయుకు కాంగ్రెస్ మద్దతు

● ఎన్నికల సమన్వయకర్తగా బొంతు రామ్మోహన్ నియామకం

● పార్టీ శ్రేణులు సహకరించాలని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు)కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎన్నికల్లో యూనియన్ విజయానికి పార్టీ శ్రేణులు సహకరించాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్, హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టిడబ్ల్యుయుకు మద్దతు ప్రకటిస్తూ పత్రాన్ని అందజేయడంతో పాటు ఎన్నికల సమన్వయకర్తగా టిపిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను నియమిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, తెలంగాణ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ (టిఎంయు) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమంలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో టిడబ్ల్యుయుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జలమండలి యూనియన్ ఎన్నికల్లో సమన్వయ బాధ్యతలు నిర్వహించి విజయాన్ని సాధించిన అనుభవంతో ఆర్‌టిసి ఎన్నికల్లోనూ సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన విధంగానే ఆర్‌టిసిలోనూ టిడబ్ల్యుయు విజయభేరి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడబ్ల్యుయుకు తెలంగాణ జన సమితి, సిఐటియు అనుబంధ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు శంకర్, గోవింద్, రాజలింగం, వి.కె.రెడ్డి, యాదయ్య, చంద్రయ్య, రామ్ చందర్, నారాయణ పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతును బలహీనపర్చే ప్రయత్నమా?

● ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఏమిటి?

● ఎంప్లాయీస్ యూనియన్‌ను అడ్డుకోవాలనే కక్షతో మరో సంఘానికి మద్దతా?

● కార్మిక సంఘాల స్వతంత్రతను దెబ్బతీస్తే తీవ్ర పరిణామాలు: ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలు రాజకీయ రంగు పులుముకుంటున్నాయా? కార్మికుల ప్రయోజనాల కోసం జరగాల్సిన ఎన్నికల్లో రాజకీయ జోక్యం పెరుగుతోందన్న ఆరోపణలు ఆర్‌టిసి వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఎంప్లాయీస్ యూనియన్‌ను ఎన్నికల్లో బలహీనపర్చాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు మద్దతు ఇస్తోందన్న ప్రచారంపై ఎంప్లాయీస్ యూనియన్ నేతలు తీవ్రంగా స్పందించారు. కార్మిక సంఘాల బలాబలాలను నిర్ణయించాల్సింది రాజకీయ పార్టీలు కాదని.. ఆర్‌టిసి కార్మికులేనని వారు స్పష్టం చేశారు. ఒక సంఘాన్ని గెలిపించేందుకు, మరో సంఘాన్ని ఓడించేందుకు ప్రభుత్వం లేదా అధికార పార్టీ ప్రయత్నిస్తే అది కార్మికుల ప్రజాస్వామ్య హక్కుల్లో జోక్యం చేసుకున్నట్లేనని హెచ్చరించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ సంఘం చరిత్రలో భాగమని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు తెలిపారు. విలీనం, వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బకాయిలు, పని పరిస్థితులు, కార్మిక సంక్షేమం వంటి అంశాల్లో రాజీపడకుండా పోరాడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే సంఘాన్ని బలహీనపరిస్తే రేపు కార్మికుల సమస్యలను ఎవరు ప్రశ్నిస్తారని వారు నిలదీశారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంఘం కన్నా.. కార్మికుల తరపున నిలబడి ప్రశ్నించే సంఘం అవసరమని పేర్కొన్నారు.

**డబ్బుతో గెలవలేరు.. హక్కులే ముఖ్యం..**

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలను సాధారణ రాజకీయ ఎన్నికల తరహాలో డబ్బులు వెదజల్లి ప్రభావితం చేసి గెలవాలని ఒక యూనియన్ ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే డబ్బు, ప్రలోభాలకు ఆర్‌టిసి కార్మికులు లొంగబోరని, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పనిచేసే సంఘానికే తమ ఓటు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

**కార్మికులే నిర్ణయించాలి.. రాజకీయ పార్టీలు కాదు..**

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏ యూనియన్‌కు మద్దతు ఇవ్వాలనే నిర్ణయం పూర్తిగా ఆర్‌టిసి కార్మికులదేనని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉండే సంఘాలను ప్రోత్సహించడం వల్ల భవిష్యత్‌లో కార్మిక సంఘాల స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల్లో రాజకీయ జోక్యం కొనసాగితే కార్మికులు నిశ్శబ్దంగా ఉండబోరని, తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




**ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక..**

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏ విధమైన ప్రత్యక్ష, పరోక్ష జోక్యానికైనా ప్రభుత్వం దూరంగా ఉండాలని ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. అధికార బలం, రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఒక సంఘానికి అనుకూల వాతావరణం కల్పించే ప్రయత్నాలు జరిగితే వాటిని కార్మికులు గమనిస్తారని హెచ్చరించింది. ఆర్‌టిసి కార్మికుల హక్కులతో చెలగాటమాడితే సహించేది లేదని, కార్మిక సంఘాల స్వతంత్రతను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని నాయకులు ప్రకటించారు.

**ఎన్నికలు.. కార్మికుల హక్కులపై తీర్పు..**

అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలను సాధారణ ఎన్నికలుగా చూడలేమని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యలను ఎవరు ప్రాతినిధ్యం వహించాలి? యాజమాన్యాన్ని ఎవరు ప్రశ్నించాలి? ఉద్యోగుల హక్కుల కోసం ఎవరు పోరాడాలి? అనే అంశాలపై కార్మికులు నిర్ణయం తీసుకునే ఎన్నికలుగా అభివర్ణించారు. కార్మికుల హక్కులను కాపాడటమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కార్మికుల పక్షాన నిలబడతామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా ఎన్నికల ప్రక్రియను పూర్తిగా స్వేచ్ఛ గా, పారదర్శకంగా నిర్వహించి కార్మికులు తమకు నచ్చిన సంఘాన్ని ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా ఎన్నుకునే పరిస్థితి కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక సంఘాన్ని గెలిపించడం.. మరో సంఘాన్ని ఓడించడం రాజకీయ పార్టీల పని కాదని, అది ఆర్‌టిసి కార్మికుల నిర్ణయమని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు తేల్చిచెప్పారు.

# భూసంబంధ దరఖాస్తులు పరిష్కరించాలి

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** భూసంబంధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. రీ సర్వే, భూ భారతి, సాదా బైనామా, తదితర రెవెన్యూ అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల ఇహసీల్దార్లతో కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి వేబెక్స్ ద్వారా సమావేశమై మాట్లాడారు. రెవెన్యూ అంశాలపై చర్చించడానికి ఈనెల 28న వనపర్తిలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన సమగ్ర రెవెన్యూ సమాచారంతో హాజరు కావాలన్నారు. భూ భారతి, సాదా బైనామా, తదితర దరఖాస్తులను పెండింగులో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. తిరస్కరించబడ్డ దరఖాస్తులకు తగిన కారణాలు చెబుతూ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని, లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించగా, రెండు గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయిందని మిగిలిన గ్రామాల్లోనూ ప్రక్రియ పూర్తిచేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సర్వే ఎడి నూక రాజు, ఆయా మండలాల తాహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వైఖరిని మార్చుకోవాలి

సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్ భీష్మ

**ప్రజాపక్షం/వంగూర్ :** ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వైఖరిని మార్చుకోవాలని డిండి చింతపల్లి సర్పంచ్, నాగర్‌కర్నూల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్‌భీష్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం మండల సర్వసభ సమావేశంలో జాజాల మహిళా సర్పంచ్ జిలకర కాశమ్మపై ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను ఖండిస్తూ, ఉన్నతస్థాయిలో ఉన్న ఎమ్మెల్యే ఇలా మాట్లాడడం చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీపతిరావు, కృష్ణయ్య, నారమ్మ, గోపిరెడ్డి, లక్ష్మమ్మ, జీవన్ నాయక్, టిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. సింగోటం గ్రామంలోని బీరం హర్షవర్ధన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ కుచ్చుళ్ల దామోదర్‌రెడ్డి, వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని, అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించారు.



# హైందవి అంతిమయాత్రలో మాజీ మంత్రి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక రామ్మోహన్ దంపతుల కుమార్తె హైందవి అంతిమయాత్రలో రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం నాడు జడ్చర్ల పట్టణంలోని పాలాది రామ్మోహన్ నివాసానికి వెళ్లిన ఆయన హైందవి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించి రామ్మోహన్ దంపతులను ఓదార్చారు. దేవా శ్రీకాంత్ పిట్టల మురలి, గిరి వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యాపార సంఘాల నేతలు, మహిళా సంఘాల నేతలు హైందవికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# మాజీ వార్డు సభ్యుడికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మున్సిపాలిటీ 9వ వార్డు మాలపేట కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యుడు మాల నాగేష్‌ను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్ సంబంధిత అనారోగ్య సమస్యతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన నాగేష్ ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి నాగేష్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపల్ చైర్మన్ సిఎం.సురేష్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వేమారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నాగన్న గౌడ్, కౌన్సిలర్లు శివ, డాక్టర్ కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు మౌలా పాల్గొన్నారు.

# ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రిలో టిజిపిఒఎ ప్రభుత్వ ఫార్మసీ ఆఫీసర్ల సంఘం తరపున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సిద్దప్ప మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఫార్మసీ ఆఫీసర్స్ సేవలు అత్యంత కీలకం రాష్ట్రంలో ఫార్మసీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.బాలగణేష్, ఫిజీషియన్ డాక్టర్ మేఘన, జనరల్ సర్జన్, తబిత గేట్, వన్ నర్సింగ్ సూపర్డెంట్, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు సూర్యకాంతరెడ్డి జి. తుల్జారాం, సులోచన దేవి, ఫార్మసీ ఆఫీసర్లు శ్రీధర్, కల్పన, శకుంతల, రిటైర్డ్ ఫార్మసీ ఆఫీసర్ బసవరాజ్, యాదగిరి, జూనియర్ అసిస్టెంట్, ప్రభుత్వ ఆసుపత్రి మక్తల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐడిఒసి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**ప్రజాపక్షం/నారాయణపేట :** నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐడిఒసి) భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్.ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న ఐడిఒసి భవనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఛాంబర్, మినిస్టర్ ఛాంబర్, మీటింగ్ హాల్‌లను పరిశీలించారు. మీటింగ్ హాల్‌లో ప్రొజెక్టర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సౌకర్యాలపై అధికారులను పలు సూచనలు చేశారు. అలాగే కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు అవసరమైన టీవి, ఇతర పరికరాల ఏర్పాట్లపై సంబంధిత అధికరులు కలెక్టర్‌కు వివరించారు. భవనం వెలుపల హార్టికల్చర్, గ్రీనరీ పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఐడిఒసి భవనంలో అన్ని అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చి, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఇఇ వెంకటరమణ, డిఇ రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ రీ సర్వే ప్రక్రియ పరిశీలన**

భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల ఆధునీకరణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఉట్కూర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి పోర్టల్ ద్వారా సర్వే మ్యాప్‌తో పాటు ప్రత్యేక భూధార్ నంబర్ ఆధారంగా శాశ్వత భూ హక్కుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. మొదటి విడతలో వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలోని 45 సర్వే నెంబర్ల పరిధిలో 646.39 ఎకరాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు వాస్తవంగా అనుభవిస్తున్న భూమి విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా సర్వే నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. తొలుత గ్రామం మొత్త సరిహద్దులను గుర్తించి, అనంతరం గ్రామ కంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, ప్రభుత్వ భూముల్లో రైతుల వారీగా ఉన్న పోషిషన్‌ను గుర్తిస్తామని చెప్పారు. ఆ తర్వాత పట్టా భూముల్లో రైతుల వారీగా సర్వే నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రీ సర్వే ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామ సభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని, అనంతరం గ్రామంలో టామ్ టామ్ ద్వారా సమాచారం అందించి నిర్ణీత ప్రకారం రీ సర్వే చేపడతామని తెలిపారు. రైతులు, ప్రజలు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, సర్వేయర్ జయశంకర్, ఇతర సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మినీ సబ్ స్టేషన్ ప్రారంభించిన మంత్రి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా మరో ముందడుగు పడింది. పట్టణంలో కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాటు చేసిన మినీ సబ్ స్టేషన్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. మక్తల్ పట్టణంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా మినీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం, వోల్టేజీ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.





# బాలికలకు ఆర్‌బిఎస్‌కె వైద్య బృందం కంటి పరీక్షలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌బిఎస్‌కె వైద్యులు డాక్టర్ హరీష్ మాట్లాడుతూ.. పాఠశాలలోని 16 మంది బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థినుల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారిణి అరుణ, ఎసిడిఎస్ సూపర్‌వైజర్ రమ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో భూముల రీ సర్వే, భూ భారతి, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా రీ సర్వే పురోగతి, పూర్తయిన పనులు, పెండింగులో ఉన్న పనులు, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రీ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలని, భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. భూ భారతి ద్వారా రైతులు, భూ యజమానులకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సర్వేయర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, సర్వే పూర్తయిన తర్వాత బౌండరీల వారీగా మ్యాపులు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్వో పాండు, డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, కలెక్టరేట్ ఎవో చంద్రశేఖర్, ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వయోవృద్ధుల, సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించాలి**

వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, భద్రత, హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఎల్డర్ గైడ్ అవగాహన పోస్టర్లను అదనపు కలెక్టర్ దేవసహాయం, డిఆర్వో పాండు, డిపిఒ శ్రీరాములు, పిడి డిఆర్డీవో చిన్న ఓబులేసుతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి సహాయం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య, సంరక్షణ, వృద్ధాశ్రామాల సామర్థ్య పెంపు, సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, తరాల మధ్య అనుబంధం, యాక్టివ్ ఏజింగ్ తదితర అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డీవో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీళ్లు, నిధుల విషయంలో పాలమూరుకు అన్యాయం

పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల

జెఎసి చైర్మన్ రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పాలమూరు జిల్లాకు దశాబ్దాలుగా నీళ్లు, నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల జెఎసి చైర్మన్ రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణానది సుమారు 300 కిలోమీటర్లు ప్రవహిస్తున్నా పాలమూరు రైతులు సాగునీటి కోసం ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి పాలమూరు భూములను సస్యశ్యామలం చేయాలని డిమాండు చేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ అనుమతులు లేని డిండి ప్రాజెక్టు పనులు ఎలా కొనసాగుతున్నాయని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయకుండా డిండి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాలమూరు రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగ్ ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 27 నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉల్పర బ్యారేజీ నుంచి కల్వకుర్తి వరకు నిర్వహించనున్న పాదయాత్రకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మేధావులు, యువత, విద్యార్థులు మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు బెకెం జనార్దన్, సదానందం గౌడ్, రిటైర్డ్ తహసీల్దార్ చెన్న కృష్ణయ్య, లింగస్వామి, బండెల రాంచంద్రారెడ్డి, కానుగుల జంగయ్య, అడ్వకేట్ వెంకట్ గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# తెల్లరాళ్లపల్లి తండాలో రూ.5.01లక్షలు పలికిన లడ్డూ

లడ్డూను కైవసం చేసుకున్న కేతావత్ వెంకటేష్

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండలంలోని తెల్లరాళ్లపల్లి తాండాలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రతిష్టించిన శ్రీ విఘ్నేశ్వరుని లడ్డూ వేలం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేలంలో తెల్లరాళ్లపల్లి తాండాకు చెందిన కేతావత్ వెంకటేష్ అత్యధికంగా రూ.5,01,000 (ఐదు లక్షల ఒక వెయ్యి రూపాయలు) వేలం పాడి స్వామి వారి పవిత్ర లడ్డూను కైవసం చేసుకున్నారు. కేతావత్ వెంకటేష్ తెల్లరాళ్లపల్లి తాండాకు చెందిన వ్యక్తి కాగా, ప్రస్తుతం హైదరాబాద్ ఇస్నాపూర్ మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. కౌన్సిలర్ గా ప్రజలకు సేవలందిస్తున్నారు. తన స్వంత గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది లడ్డూ వేలంలో పాల్గొని రూ.5.01లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా తండావాసులు, సేవాలాల్ సభ్యులు వేలం పాటలో లడ్డును దక్కించుకున్న కేతావాత్ వెంకటేష్‌ను శాలువాతో సన్మానించారు. లడ్డూ వేలం సందర్భంగా తాండా పెద్దలు, సేవాలాల్ యూత్ సభ్యులు, యువకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు

హౌసింగ్ ఎఇ వంశీ

**ప్రజాపక్షం/అయిజ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని హౌసింగ్ ఎఇ వంశీ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం అయిజ మున్సిపాలిటీలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఎఇ పరిశీలించి నిబంధనలపై పలు సూచనలు చేశారు. నిర్మించుకుంటున్న బేస్‌మెంట్ విస్తీర్ణం, స్లాబ్ విస్తీర్ణం పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు. లబ్దిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల్లోనే ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా ఈ సూచనలు చేసిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుడు ఎంత బేస్‌మెంట్ విస్తీర్ణాన్ని నిర్మిస్తే, ఆ బేస్‌మెంట్ విస్తీర్ణానికి 25% అదనంగా మాత్రమే స్లాబ్ విస్తీర్ణాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. స్లాబ్ విస్తీర్ణం బేస్‌మెంట్ విస్తీర్ణం కంటే గరిష్టంగా 25% మాత్రమే ఎక్కువగా ఉండాలని, అంతకంటే ఎక్కువ స్లాబ్ విస్తీర్ణం నిర్మించారదని సూచించారు. 400 చ.అ. ఉండాలని, 500చ.అ. బేస్‌మెంట్ విస్తీర్ణం ఉంటే గరిష్ట స్లాబ్ విస్తీర్ణం 625చ.అ. 600చ.అ. బేస్‌మెంట్ విస్తీర్ణం ఉంటే గరిష్ట స్లాబ్ విస్తీర్ణం 750చ.అ. మాత్రమే ఉండాలన్నారు.

అనుమతించబడిన పరిమితికి మించి స్లాబ్ విస్తీర్ణం నిర్మించినట్లయితే, సంబంధిత స్లాబ్ దశ బిల్, తదుపరి దశల బిల్లులు నిబంధనల ప్రకారం తిరస్కరించబడటంతో పాటు, మంజూరు రద్దు చేసే చర్యలు తీసుకోబడతాయని సూచించారు. స్లాబ్ వేసిన తర్వాత అదనపు పిల్లర్లు, అనధికార నిర్మాణం, అలాగే స్లాబ్ వేసిన అనంతరం అదనంగా పిల్లర్లు/కాలమ్స్ ఏర్పాటు చేసి ఇంటి విసీర్ణాన్ని పెంచడం అనధికార నిర్మాణంగా పరిగణించబడుతుందన్నారు. లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడడం వారి సొంత డబ్బును బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా చేయడం జరుగుతుందన్నారు.

ఇప్పటికే ఇల్లు మంజూరైనప్పటికీ ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాని ఇళ్లను సకాలంలో ప్రారంభించాలని, లేని ఎడల ఇళ్లను రద్దు చేస్తామన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీగా విధులు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**ప్రజాపక్షం/మక్తల్ :** గణేష్ నిమజ్జనం చేయు చెరువు దగ్గర జాగ్రత్తలు పాటించాలి మక్తల్‌లో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా బందోబస్తు విధులకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మక్తల్ రాయల్ ఫంక్షన్ హాల్‌లో భద్రతా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శోభాయాత్ర, నిమజ్జన మార్గాల్లో సిసి కెమెరాల నిఘాతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు సంయమనంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**చెరువు దగ్గర జాగ్రత్తలు పాటించాలి :**

అనంతరం మక్తల్ మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. నిమజ్జనం సమయంతో చిన్నపిల్లలు చెరువు వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్లను చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అంబులెన్స్, ఫైర్ సిబ్బందికి, గత ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ మద్యం విక్రయించే బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాల శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నల్లపు లింగయ్య, మక్తల్ సీఐ రామ్‌లాల్, ఎస్ఐ రాజు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన శోభాయాత్రలో హుషారెత్తించిన మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని సందడి చేశారు. భక్తులు, యువతతో కలిసి శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొంటూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులతో మంత్రి మమేకమయ్యారు. శోభాయాత్రలో భక్తుల ఉత్సాహాన్ని చూసి వారితో కలిసి సందడి చేశారు.

## పింఛన్లకు లంచం డిమాండ్

### ముగ్గురు ఉద్యోగుల పై వేటు

**ప్రజాపక్షం / సూర్యాపేట:** పదవీ విరమణ పొందిన తోటి ఉద్యోగిణి పింఛను ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ శుక్రవారం వేటు వేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. షెడ్యూల్ కులాల ( ఎస్ సి ) అభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగిణి గత మార్చి నెలలో పదవీ విరమణ పొందారు. అయితే ఆమెకు రావాల్సిన పెన్షన్ , ఇతర బెనిఫిట్స్ తాలూకు ఫైల్ (పెన్షన్ ప్రపోజల్) ఎప్పటికప్పుడు పై కార్యాలయానికి పంపించాల్సి ఉండగా.. గతంలో పని చేసిన అధికారిణితో పాటు సంబంధిత విభాగ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. ఆ శాఖకు చెందిన గతంలో పనిచేసిన సీనియర్ అధికారిణితో పాటు సీనియర్ అసిస్టెంట్ జి.రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, అటెండర్ బి.రాము పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. అడిగిన మొత్తం ఇస్తేనే ఫైలుపై సంతకాలు చేసి పైకి పంపుతామని చెప్పడంతో ఆ మొత్తం ఇచ్చేందుకు సదరు విశ్రాంత ఉద్యోగిని నిరాకరించడంతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదల్లేదు. దీనితో ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన సమగ్ర విచారణకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విచారణ లో ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని, విధుల్లో తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించారని తేల్చారు. విచారణ నివేదిక ఆధారంగా ముగ్గురిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు ఎవరైనా విధుల్లో అలసత్వం వహించినా, ప్రజలను లేదా విశ్రాంత ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ లంచాల కోసం వేధించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు.

## పన్నులు, చార్జీల పేరుతో సామాన్య ప్రజలపై మోయలేని భారాలు

### సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పన్నుల చార్జీల పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. యూపిఐపై విధించిన చార్జీల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల ముందు బిజెపి ధరలను నియంత్రిస్తామని పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారని, గడిచిన 12 సంవత్సరాలుగా పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు విపరీతంగా పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధిక భారాన్ని మోపారని విమర్శించారు. యుపిఐ చెల్లింపుల ద్వారా ఎటువంటి చార్జీలు విధించమని ఆనాడు తెలిపి ఒక ప్రణాళిక బద్ధంగానే ముందు ఉచితంగానే సేవలు అందిస్తామని ఆ తర్వాత విపరీతమైన చార్జీలు వసూలు చేయడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. ఇప్పటికే జిఎస్‌టి పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజల నుంచి కేంద్రం వసూలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, కొమర్రాజు వెంకట్, ఊదర వెంకన్న, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వజ్రపు వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాస్, బి. సైదా, నన్నెపంగ నగేష్, బెల్లంకొండ గణేష్, మాధవరెడ్డి, మైక్ వెంకన్న పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు

### రాష్ట్ర ఎస్‌టి, ఎస్‌సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** చదువుతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం చైర్మన్ బక్కి వెంకటయ్య కమిషన్ సభ్యులతో కలిసి మండల పరిధిలోని దంజిలాల్‌తండా గేటు వద్ద గల ఎస్టి గురుకుల పాఠశాలను సందర్శించారు. వంట గది, స్టోర్ రూం పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కూరగాయలు, వంటనూనె, పండ్లు, గుడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గల సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కంపౌండ్ వాల్, వాష్ రూం, బోర్ అవసరం అని విద్యార్థులు చైర్మన్‌కు తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబునాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన విద్యను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్సి, ఎస్టి కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, స్థానిక సంస్థల ఇంచార్జీ అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్థియాన్ మావి, డిటిడివో కమలాకర్‌రెడ్డి, ఆర్‌సివో శ్రీనివాసరావు, ఏసిఎంవో వెంకటేష్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టే ప్రయత్నం

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సెప్టెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ ఇంచార్జి భవ్యతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు బిఆర్ఎస్ పార్టీ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే పట్టభద్రులు గత పాలనను దృష్టిలో ఉంచుకుని తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజక వర్గం, ప్రతి మండలం, ప్రతి పట్టభద్రుడి వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జి సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, నవీన్ ఆచారి, కొత్త విద్యరెడ్డి, శ్రావ్యరెడ్డి పాల్గొన్నారు.

# పిఎసిఎస్‌లో రూ.23 లక్షల అక్రమాలు

### దొంగలను వదిలేది లేదు

### సర్వసభ్య సమావేశంలో సిఇఒను నిలదీసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### అవినీతిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే ఫిర్యాదు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో యూరియా బస్తాల అవినీతి వెలుగు చూసింది. శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పిఎసిఎస్‌లో జరిగిన రూ.23 లక్షల భారీ అవినీతి, అక్రమాలపై తీవ్రంగా మండిపడ్డారు. సొసైటీ పరిధిలో 450 బస్తాల యూరియా, 700 బస్తాల డీఏపీ అమ్మకాలకు సంబంధించిన రూ.23 లక్షల సొమ్ము బ్యాంకులో జమ కాకపోవడంపై ఎమ్మెల్యే నేరుగా సీఈవో ఆంజనేయులను సభలోనే నిలదీశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సేల్స్ పాయింట్స్ వద్ద ఈ అక్రమాలు జరిగాయని సీఈవో ఇచ్చిన వివరణపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎక్కడికి వెళ్లాయి ఈ రూ.23 లక్షలు? ఎందుకు బ్యాంకులో జమ చేయలేదు? ఏ ఊరికి, ఎంతమంది రైతులకు ఎరువుల బస్తాలు ఇచ్చారో కనీస జాబితా ఎందుకు నిర్వహించడం లేదు?' అని ప్రశ్నించారు. గత పాలకవర్గం చేసిన అక్రమాలను దాచిపెట్టే ప్రయత్నం చేయవద్దని, దొంగలను దాచకుండా వారి పేర్లు బహిర్గతం చేయాలని సీఈవోకు హితవు పలికారు. 'గతంలో జరిగిన అవినీతి వల్ల ప్రస్తుత పాలకవర్గానికి చెడ్డ పేరు వస్తోంది, వారి తప్పులకు మీరు బాధ్యులు కావద్దు' అని పేర్కొన్నారు. దీనికి సీఈవో జవాబిస్తూ... సొసైటీలో పనిచేస్తున్న అందరం కలిసి అమ్మామని, అందరమూ బాధ్యులమేనని, సంఘానికి నష్టం వాటిల్లకుండా ఆ డబ్బును బ్యాంకులో కడతామని సభ దృష్టికి తెచ్చారు.

**వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు :** పిఎసిఎస్‌లో జరిగిన ఈ భారీ కుంభకోణంపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే స్పందిస్తూ, వేదిక పైనుంచే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, నిజనిర్ధారణ కమిటీ ద్వారా బాధ్యులను కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నేను పక్కా రైతు బిడ్డను, రైతుల సొమ్ము రూపాయి కూడా పోనివ్వను. రైతుల కష్టార్జితాన్ని తిన్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు, వారి పొట్టలో చెయ్యి పెట్టి మరీ ఆ సొమ్మును కక్కిస్తాం' అని హెచ్చరించారు. డీసీసీబీ అధికారుల పర్యవేక్షణలో రెండు రోజుల్లో విచారణ పూర్తవుతుందని తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ చీర్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి గ్రామ వనరుల మ్యాప్ ద్వారా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో వీజీపీపీ గ్రామ సభల ద్వారా వీబీజీరామ్‌జీ పనుల గుర్తింపుపై జిల్లాలోని మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ గ్రామాల అభివృద్ధి ప్లాన్ తయారీ అమలు పై అవగాహన కార్యక్రమం లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, మానవ వనరులను గుర్తించి, వాటి ఆధారంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా వీబీజీరామ్‌జీ పథకం కింద 375 పనులకు 125 రోజుల పనులను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రణాళికలను ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం పనులను అమలు చేయాలన్నారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, నీటి సంరక్షణకు సంబంధించిన పనులను వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికలో ఎక్కువగా గుర్తించి అమలు చేయాలని తెలిపారు.ఫామ్ పాండ్, ఇంకుడు గుంతలు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ పిఎంఒ సరిత, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఆడిషనల్ డిఆర్‌డిఓ సురేష్, డిప్యూటీ సిఈఓ శ్రీనివాస్, ఏపీడీ నవీన్, జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, జిల్లా స్థాయి అధికారులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి


**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఎంఆర్ఐ స్కానింగ్,గుండె,న్యూరో సర్జరీ,కిడ్నీ,లివర్ సంబంధిత ప్రత్యేక వైద్య విభాగాలను ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో గంట సత్యానారాయణ అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ నల్లగొండ నియోజకవర్గ సమావేశంలో పబ్బు వీరస్వామి మాట్లాడారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు,ఆధునిక వైద్య పరికరాలు,నిపుణులైన వైద్యులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల వైద్యం కోసం హైదరాబాద్ కు వెళ్తున్న సందర్భంలో మార్గం మధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా నల్లగొండ పట్టణంలో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు దోటి అక్కయ్య, అంబాల నరసింహ, జోగు సురేందర్, పి.సుజాత, వీరయ్య, అన్నిమల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# ఇసుక పాలసీకి తూట్లు!

### ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి...!!

### అక్రమ రవాణాదారులకు అండగా అధికార పార్టీ నేతలు!!

### నెలవారీ మామూళ్ళతో సరిపెడుతున్న పోలీసులు?





**ప్రజాపక్షం/సూర్యాపేట :** అక్రమ ఇసుక రవాణాను అరికట్టి భవన నిర్మాణదారులకు సరసమైన ధరకు అందించడంతోపాటు ఖజానాకు ఆదాయం సమకూరేలా ప్రభుత్వం జిల్లాలో ఇసుక పాలసీని గత ఏడాది క్రితం అమల్లోకి తెచ్చింది. మన ఇసుక మన వాహనం పేరుతో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి అనుకున్న చోటుకే ఇసుకను సరఫరా చేయడం జరుగుతుంది. ఇసుకను రవాణా చేసేందుకు మైనింగ్ అధికారులు ట్రాక్టర్ యజమానుల నుండి దరఖాస్తులు స్వీకరించి రూ.20వేల డిపాజిట్‌తో అనుమతులు ఇవ్వడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇసుక పాలసీ ద్వారా ఇసుకను రవాణా చేసేందుకు దాదాపు 700కు పైగా వాహనాలు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ఇతర వాగులు ఎక్కువగా ఉండడంతో ఇసుక లభ్యత లభ్యత ఎక్కువగా ఉన్న తుంగతుర్తి నియోజక వర్గంలోని జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెం, నాగారం మండలంలోని పేరబోయినగూడెం, తిరుమలగిరి మండలంలోని తాటిపాముల, నూతనకల్ మద్దిరాల మండలాలలోని గుండ్లసింగారం వాగు, కోదాడ నియోజక వర్గంలోని అనంతగిరి మండలంలోని వాగుకు ఇసుక రవాణా చేసేందుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. అక్రమ ఇసుక రవాణాదారులు ఇసుక పాలసీకి తూట్లు పొడిచి ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. మైనింగ్ అధికారులు అనుమతి ఇచ్చిన ప్రాంతాల నుండి కాకుండా అనుమతులు లేని ఇసుక లభ్యమయ్యే ప్రాంతాల నుండి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సూర్యాపేట నియోజక వర్గం పెన్‌పహాడ్ మండలంలో ఉన్న నాగులపాటి అన్నారం, దోసపహాడు, సూర్యాపేట మండలంలోని కెటి అన్నారం, యండ్లపల్లి, రాయినిగూడెం, కాసరబాద, నేరేడుచర్ల మండలం చిల్లకల్, సోమారం, పాలకీడ మండల పరిధిలో ప్రవహిస్తున్న మూసీ పరివాహక ప్రాంతంలో ఇసుక నిల్వలు ఉన్నా అధికారులు మాత్రం ఇసుక లభ్యత తక్కువగా ఉందనే సాకుతో ఈ ప్రాంతాల్లో ఇసుక పాలసీని తీసుకురాలేదు. దీనితో అక్రమ ఇసుక రవాణాదారులకు అక్రమ ఆదాయ మార్గంగా మారింది. సూర్యాపేట, పెన్‌పహాడ్ మండలాల పరిధిలోని యండ్లపల్లి, రాయినిగూడెం, కాసరబాద, కెటిఅన్నారం, నాగులపాటి అన్నారం, దోసపహాడ్ ప్రాంతాల్లో అక్రమార్కులు మూసీలో నీరు ప్రవహిస్తున్నా ఇసుకను తోడుతూ తెప్పల సహాయంతో బయటకు తెస్తున్నారు. ఇలా సేకరించిన ఇసుకను ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున డంప్‌లు చేసి ఇసుక అవసరం ఉన్న వారికి సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో వేలాది ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు అడుగడుగునా కనపడుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ ఇసుక రవాణాదారులకు అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అధికారులు గుర్తించి పట్టుకోగానే తక్షణమే దానిని వదలాలని ఒత్తిడి తేవడంతో వదిలేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొంతమంది పోలీసు అధికారులు అక్రమ ఇసుక రవాణాదారులతో సెటిల్‌మెంట్ చేసుకొని నెలవారీ మామూళ్ళు తీసుకొని సరిపెడుతున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దాదాపు ఒక్కొక్క పోలీస్ స్టేషన్ పరిధిలో 60 నుండి 100 వరకు ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండగా ఒక్కొక్క దానికి రూ.15వేలు ఖరారు చేసుకొని వీటి వసూళ్ళకు ప్రత్యేక దఫేదారి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ అక్రమ ఇసుక రవాణాను అరికట్టి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## త్రిపురారం పిహెచ్‌సి భవనం ఖాళీ.. గ్రంథాలయంలోకి వైద్య సేవలు

### 'ప్రజాపక్షం' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/త్రిపురారం:** శిథిలావస్థకు చేరిన త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనం పరిస్థితిపై 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రచురించిన కథనంతో అధికార యంత్రాంగం కదిలింది.గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పిహెచ్‌సి భవనం పైకప్పు నుంచి పెద్ద ఎత్తున పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది,రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొన్న నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు.

**గ్రంథాలయంలోకి వైద్య సేవలు :** పిహెచ్‌సి భవనం పరిస్థితిని సంబంధిత అధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు ప్రస్తుత పిహెచ్‌సి భవనాన్ని వెంటనే ఖాళీ చేసి,మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనంలో వైద్య సేవలు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీడీవో విజయకుమారి,మండల వైద్యాధికారి డాక్టర్ వనితతో కలిసి సాగర్ రోడ్డులోని ఎంఆర్‌సీ కార్యాలయ సమీపంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు.ఇకపై అక్కడి నుంచే పిహెచ్‌సి వైద్య సేవలను కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పాత భవనంలో వైద్య సేవలు నిర్వహించాల్సిన పరిస్థితికి తాత్కాలికంగా పరిష్కారం లభించింది.

## కామ్రేడ్ నూకల జానకి సేవలు చిరస్మరణీయం

### రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఉపాధ్యాయురాలుగా, కామ్రేడ్‌గా, తెలంగాణ ఉద్యమకారిణిగా నూకల జానకి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని షాదిఖానాలో కామ్రేడ్ నూకల జానకి సంతాప సభను నిర్వహించారు. ఈ సంతాప సభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ సభ అధ్యక్షత వహించగా, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వక్కంతుల కోటేశ్వరరావు సంతాప సభను ఉద్దేశించి మాట్లాడారు. కామ్రేడ్ నూకల జానకి విద్యార్థి దశ నుండి విప్లవ విద్యార్థి భావాలను పునికి పుచ్చుకుని డిఎస్‌వోలో పని చేశారని అన్నారు. తోటి విప్లవ విద్యార్థి సంఘమైన పిడిఎస్‌యు అప్పటి జిల్లా నాయకులు నూకల నరేంద్రను ఆదర్శ కులాంతర, మతాంతర వివాహం చేసుకున్నారని గుర్తు చేశారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ అనారోగ్యంతో సుదీర్ఘకాలం బాధపడుతూనే తెలంగాణ ఉద్యమంలో తను ఉపాధ్యాయురాలిని అనే విషయం కూడా మరిచిపోయి వంటావార్పు, సకలజనుల సమ్మె అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల కరస్పాండెంట్ మేరెడ్డి ఎల్లారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు, వెంకటేశ్వర్లు, మేకల నాగేశ్వరరావు, సైదిరెడ్డి, పాండు, కెఎల్ఎన్‌రావు, కాకి అజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, పశ్య శ్రీనివాసరెడ్డి, బిక్షం, చందర్‌రావు పాల్గొన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో తాత్కాలిక ప్రాతిపదికన నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ వాచ్ వుమెన్1 పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు సెక్యూరిటీ ఏజెన్సీ శిక్షణ, హెడ్ కుక్1 పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పూర్తి స్థాయి వంట అనుభవం, అసిస్టెంట్ కుక్1 పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణతతో వంట అనుభవం ఉండాలని పేర్కొన్నారు.18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను 28వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కేజీబీవీ వలిగొండలో అందజేయాలని సూచించారు.

## మానవత్ తండాలో కత్తుల కలకలం...

### కడుపులో కత్తిపోటుతో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం మానవత్‌తండాలో గురువారం రాత్రి కత్తులు, కర్రలతో జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గణేష్ నిమజ్జనం అనంతరం కొందరు మద్యం సేవిస్తుండగా చిన్నపాటి వివాదం తలెత్తి ఇరువర్గాల మధ్య ఘర్షణగా మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలైనట్లు సమాచారం, ఘర్షణలో రమావత్ సందీప్‌పై కత్తితో దాడి జరగడంతో కడుపులో తీవ్ర గాయమైంది. గాయం తీవ్రంగా ఉండడం పరిస్థితి విషమించంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మరోవైపు రమావత్ కళ్యాణ్‌పై కర్రలతో దాడి జరగడంతో ఆయనకు కూడా గాయాలయ్యాయి. ఇరువర్గాల మధ్య ఒక్కసారిగా కత్తులు, కర్రలతో ఘర్షణ జరగడంతో తండాలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటనపై ఇరువర్గాలు చందంపేట పోలీసులకు ఫిర్యాదులు చేయగా రెండు వర్గాల ఫిర్యాదులు ఆధారంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, ఘటనలో పాల్గొన్న వ్యక్తులు, గాయపడిన వారి వివరాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



## రేడియల్ రోడ్డు భూములు రీసర్వే చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి



**ప్రజాపక్షం/షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని రేడియల్ రోడ్డు భూములను రీ సర్వే చేయాలని జిల్లా మంత్రి శ్రీధర్‌బాబును జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, షాబాద్ మండల రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ.. షాబాద్ మండల పరిధిలోని సంకె పల్లి గూడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, నిరు పేదల ఇండ్లు పోకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన జిల్లా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతతూ..షాబాద్ మండల రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్ర శేఖర్, చేవెళ్ల స్వామి, మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, సర్పంచ్ లావణ్య, మహేందర్ గౌడ్, రవీందర్ నాయక్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేసినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణ పరిధిలోని ఫరూక్‌నగర్, కొత్తూర్, నందిగామ, జిల్లేడు చౌదరిగూడ, కొందుర్గు, కేశంపేట్ మండలాల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.11కో ట్లా30లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు గ్రామానికి వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఏకాత్మమానవతావాద సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిన మహా దార్శనికుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని బిజెపి బిజెపి రంగారెడి జిల్లా మాజీ అధ్యక్షుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ బొక్క నర సింహారెడ్డి కొనియాడారు. శుక్రవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహానికి బొక్క నరసింహారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌ద యాళ్ ఉపాధ్యాయ ఆశయాలను నేటి తరానికి అందిస్తూ, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ కుమార్, స్థూల ప్రభాకర్, గడ్డం జగన్, గాజుల మధు, అమర్నాథ్ రెడ్డి, ఒంటేర్ నరసింహా రెడ్డి, కాశీరాం, సురేష్, సుద్దాల శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.

## రక్తదానానికి ముందుకు రావాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా యువత రక్తదానానికి ముందుకు రావాలని మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్ పిలుపి నిచ్చారు. బిఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని (డిపిఎస్) స్కూల్ సమీపంలో శుక్రవారం ఆజాద్ యూత్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సామాజిక కార్యకర్త చేపూరి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి 35 మంది స్థానిక యువత రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినా యక నవరాత్రి ఉత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో ఇటువంటి సామా జిక సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమం లో ఆజాద్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు, వెంకట్ అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

## జెడ్‌పి రోడ్డు గుంతలు పూడ్చాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం జెడ్‌పి రోడ్డులో బిఎన్‌రెడ్డి నగర్ నుంచి టికెఆర్ కమాన్ వరకు ఉన్న జెడ్‌పి రోడ్డుపై నెలల తరబడి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు చేరి కాలనీల నుంచి వచ్చే నీరు ఆ గోతుల్లో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే డిప్యూటీ కమిషనర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని శుక్రవారం బిజెపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచిపోవడం తో అవి కనిపంచక రాకపోకలు సాగించే ప్రజలు, ముఖ్యంగా ద్విచక్ర వాహ నాలపై ప్రయాణిస్తున్న మహిళలు, పురుషులు ప్రమాదాలకు గురవుతు న్నారు. కార్యక్రమంలో ఎరుకుల మల్లేష్ గౌడ్, బొగ్గుల మాధవరెడ్డి, అమ ర్నాథ్‌రెడ్డి వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటచారి, రాజవర్ధన్‌రెడ్డి, విజ యశ్రీ చౌదరి, లక్ష్మి కాంత్‌రెడ్డి, మణి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.















# ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం

### పటిష్ట బందోబస్తుతో ప్రభుత్వ ఏర్పాట్లు

ఏరియల్ వ్యూ ద్వారా నిమజ్జన ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, డిజిపి సి.వి.ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక అలా, నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేశ్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతోం దని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి, హైదరా బాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ పటిష్టమైన ఏర్పాట్లు చేప ట్టిందన్నారు. హైదరాబాద్ నగరంలోని నిమజ్జన ప్రాంతాలను శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరి యల్ వ్యూ ద్వారా పరిశీలించారు. సంబంధిత ఉన్నతాధి కారులతో కలిసి సుమారు గంటపాటు నిమజ్జన మార్గాలు, ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బేగం పేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డిజిపి సి.వి. ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, హైద రాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌లతో కలిసి మంత్రి వివరాలు వెల్లడించారు. గణేశ్ ఉత్సవాల 11వ రోజు నిమజ్జనం సందర్భంగా నగరంలోని నిర్దేశిత మార్గాలు, నిమజ్జన పాయింట్ల వద్ద వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నార న్నారు. నిమజ్జన ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగుతోందని, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు ప్రభుత్వానికి సహకరించి, నిమ జ్జనాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఖైరతా బాద్ మహాగణపతి నిమజ్జనం మధ్యాహ్నమే పూర్తయిం దని, బాలాపూర్ గణేశ్‌తో పాటు జంట నగరాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణేశ్ విగ్రహాల నిమ జ్జనం కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతోంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వంలోని అన్ని శాఖలను సమన్వయం చేస్తూ భక్తు లకు, ఉత్సవ నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. డిజిపి, జిహెచ్‌ఎంసి కమిషనర్, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు సమన్వయంతో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా, శనివారం ఉదయం లోపు నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలి పారు. ఎలాంటి ప్రమాదాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎం.జె.మార్కెట్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడినప్పటికీ, వెంటనే అధికా రులకు ఆదేశాలు జారీ చేసి, అన్ని శాఖల సమన్వ యంతో ట్రాఫిక్‌కు క్లియర్ చేసే చర్యలు చేపట్టామ న్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

## 10,300 విగ్రహాల నిమజ్జనం పూర్తి

### మిగిలిన వాటిపై నిరంతర పర్యవేక్షణ : సిపి సజ్జనర్



గణేశ్ నిమజ్జనోత్సవం తుది ఘట్టానికి చేరుకోవడంతో నగరంలో శోభాయాత్రలు, నిమజ్జన ప్రక్రియను హైదరాబాద్ పోలీసులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. శుక్ర వారం తెల్లవారేసరికి మిగిలిన విగ్రహాల నిమజ్జనాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి.వి.సజ్జనర్ తెలిపారు. బంజారాహి ల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిమజ్జన ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి సిసి టివి దృశ్యాలు, డ్రోన్ల ద్వారా శోభాయాత్ర మార్గాలు, ట్రాఫిక్ పరిస్థితి, నిమజ్జన ప్రక్రి యను సిపి పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సుమారు 10 వేల సిసిటివి కెమెరాలు, డ్రోన్లు, ప్రత్యేక నిఘా వాహనాల లైవ్ ఫీడ్స్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఖైరతాబాద్, బాలాపూర్ మహాగణ పతులతో పాటు పాతబస్తీ, రాజేంద్రనగర్, గోల్కొండ తదితర ప్రాంతాల నుంచి శోభాయాత్రలు ప్రశాంతంగా కొనసాగుతున్నా యని వెల్లడించారు. జియో ట్యాగింగ్ యాప్‌లో నమోదైన 14,850 విగ్రహాల్లో ఇప్పటికే సుమారు 10,300 విగ్రహాల నిమ జ్జనం పూర్తయిందని, మిగిలిన సుమారు 4,500 విగ్రహాల నిమ జ్జనాన్ని వేగంగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సిపి తెలిపారు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో 30కి పైగా భారీ క్రేన్లతో పాటు అదనపు క్రేన్లు, బేబీ పాండ్స్‌ను అందుబా టులో ఉంచినట్లు చెప్పారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో ఐజీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ట్రాఫిక్ మళ్లింపులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బందోబస్తులో పాల్గొంటున్న పోలీస్ సిబ్బందితో పాటు సేవలందిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను సిపి అభినందించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని, టిజి ఐసిసిసి డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, వారి బృందానికి సిపి సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు

## వందేమాతరం గీతాలాపన

**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయిగూడ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యాభారతి శిక్ష సంస్థాన్ న్యూఢిల్లీ ఆదే శాల మేరకు సామూహిక పూర్తి వందేమాతర గీతా లాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్య క్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ స్వామి మాట్లాడుతూ వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకమైందని వివరించారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి విద్యాపీఠం అధ్యక్షులు తక్కెళ్లపల్లి తిరుపతిరావు, ధూళిపాల కాశీవిశ్వనాథం, సరస్వతి విద్యాపీఠం జిల్లా ఉపాధ్యక్షులు జివిఎన్ శాస్త్రీ, మల్లిఖర్జున్‌రెడ్డి, సత్యనారాయణ, జనార్ధన్, ప్రధానాచార్యులు రాధిక, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బాలాపూర్ గణేష్ ఉత్సవాలు, లడ్డూ వేలానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎంఎల్‌ఎ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర, లడ్డూ వేలం పాట కార్యక్రమాల్లో సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా మాజీ జెడ్ పి చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు రాఘవరెడ్డి, శశిధర్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు జంగారెడ్డి,వంగేటి ప్రభాకర్‌రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు కొలను శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మాసబ్ చెరువు వద్ద జరుగు తున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారు లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనం తరం చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన కార్య క్రమాల్లో ఆయన స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన వేడుకల కోసం కోహెడ,ఇంజాపూర్,వనస్థలిపురం, హస్తినా పురం,మీర్‌పేట్,హయత్‌నగర్,ఎల్ బి నగర్,అబ్దుల్లాపూర్ మెట్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి గణనాథులు భారీ సంఖ్యలో మాసబ్ చెరువు వద్దకు తరలివస్తున్నారని తెలి పారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ప్రభుత్వం తరఫున అన్ని మౌలిక వస తులు,భారీ బందోబస్తు,ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని ఆయన స్పష్టం



చేశారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసు, రెవెన్యూ,మున్సిపల్ అధికారులకు సహకరిస్తూ, వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో విజ యవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

### ఎసిపి పరిశీలన

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టన శివారులోని బొబ్బిలి చెరువు దగ్గర వినాయకుల నిమజ్జనా నికి సర్వం సిద్ధం చేసినట్లు షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం బొబ్బిలి చెరువు దగ్గర పరిసర ప్రాంతాన్ని మున్సిపల్ చైర్మెన్ అగ్గనూర్ బస్వేశ్వర్, షాద్‌నగర్ పట్టణ సీతారాం తో కలిసి పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఏసీపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలోని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధ లతోని శాంతి భద్రతలను కాపాడుతూ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, శ్రీశైలం గౌడ్, విద్యుత్ శాఖ అధికా రులు వినోద్, జిపివొ జయమ్మ పాల్గొన్నారు.



## మన్సూరాబాద్‌లో అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, గణేష్ నిమజ్జనాన్ని తరలివస్తున్న భక్తులకు మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పేరాల శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర సహప్ర బారి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవిశంకర్, రామేశ్వర్, కృష్ణంరాజు, సుధీర్ కుమార్, శబరినాథ్, చిన్న యాదవ్, రాగూర్ తదితరులు పాల్గొన్నారు.



ఒక ప్రధాని జెన్‌జీకి ఓటుహక్కు కల్పిస్తే...

# మరో పిఎం లాక్కుంటున్నారు!

- మోదీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** ఎస్ఐఆర్ ప్రక్రియపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీని ఉద్దేశించి) జెన్‌జీకి ఓటు హక్కు ఇచ్చారని, మరొకరు (మోదీ) దానిని లాక్కోవాలని చూస్తున్నారని మండిపడింది. యువత ఆశలను, ఆకాంక్షలను దెబ్బతీసి వారికి భయపడే ప్రధాని నరేంద్ర మోదీ అని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'ఇది ఇద్దరు ప్రధానుల కథ. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీ) 1988 డిసెంబరులో జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను సవరించి ఓటు హక్కు కనీస వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. ఆయన యువతకు సాధికారత కల్పించిన ప్రధాని. మరో ప్రధాని (నరేంద్ర మోదీని ఉద్దేశించి) జెన్‌జీ ఓటర్లు నమోదు కాకుండా ఉండేందుకు 2024 నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలను (ఎస్ఎస్ఆర్) నిలిపివేశారు. ఈ ప్రధాని యువత ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశామని భయపడుతున్నారు. ఒక ప్రధాని జెన్‌జీకి ఓటు హక్కు ఇచ్చారు. మరొకరు అక్రమ మార్గాల ద్వారా ఆ ఓటు హక్కును లాక్కోవాలని నిశ్చయించుకున్నారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అంతకుముందు గురువారం కూడా నరేంద్ర మోదీపై జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవమానానికి గురైన ప్రధాని మోదీ జెన్‌జీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో లేకుండా చూసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. జెన్‌జీ వీధుల్లోకి వచ్చి మోదీని ఎగతాళి చేశారని అన్నారు. అందుకే వారిని ఓటరు జాబితాలో లేకుండా చేసేందుకు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ నియమించారని విమర్శించారు. ఏటా ఓటర్ల జాబితాను సవరించే ప్రత్యేక సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)ను నిలిపివేశారని అన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన జెన్‌జీ యువతను కొత్త ఓటర్లుగా చేర్చడానికి ఇదొక మార్గమని చెప్పారు. ఎస్ఎస్ఆర్‌ను పునఃప్రారంభించాలని మిగతా ఇద్దరు ఇసిలు గట్టిగా కోరుతున్నప్పటికీ, మోదీపై యువతలో అసంతృప్తి స్పష్టమైనప్పటి నుంచి గత రెండేళ్లుగా ఎలాంటి సవరణ జరగలేదని మండిపడ్డారు.

పేపర్ లీక్ కేసుల్లో నిందితుల స్థిర, చరాస్తుల జప్తు పిటిషన్‌పై...

# ఆరువారాల తర్వాత విచారణ

- సుప్రీంకోర్టు వెల్లడి



**న్యూఢిల్లీ :** పరీక్షాపత్రాల లీక్ కేసుల్లో నిందితులు, వారి కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులను జప్తు చేయాలని దాఖలైన పిటిషన్‌పై ఆరువారాల తర్వాత విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ఈ విషయం న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఆగస్టు 18న న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందనలను సుప్రీంకోర్టు కోరింది. మనందరం వాదనలు దాఖలు చేయాల్సి ఉంటుంది. కాబట్టి వాదనలను పూర్తి కానివ్వండి' అని కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభాటి శుక్రవారం ధర్మాసనానికి తెలిపారు. ఈ పిటిషన్‌లో అన్ని రాష్ట్రాలను కూడా ప్రతివాదులుగా చేర్చారని ఆమె వివరించారు. ప్రతివాదులు తమ కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం కోరినందున, ఈ విషయంపై విచారణను ఆరు వారాల తర్వాతకు వాయిదా వేయబడింది. ఆగస్టు 18న విచారణ సందర్భంగా, ప్రశ్నపత్రాల నిరోధక చట్టాలను కఠినతరం చేసే పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026 ఆమోదం పొందినందున, ప్రశ్నపత్రాల లీక్ కేసులలో కాలపరిమితితో కూడిన దర్యాప్తు, విచారణను నిర్ధారించే చర్యలను కోరుతూ తాను చేసిన అభ్యర్థనను ముందుకు తీసుకెళ్లడం లేదని ఉపాధ్యాయ్ సమర్పించారు. న్యాయవాది అశ్వినికుమార్ దూబే దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, నిందితులు, వారి కుటుంబ సభ్యుల మొత్తం ఆస్తిని అంచనా వేయడానికి చర్యలు తీసుకోవాలని, తదనుగుణంగా అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టంతో సహా చట్టాలలోని తగిన నిబంధనలను అమలు చేయాలని కూడా ఆదేశాలు కోరారు. 'భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించడానికి, పేపర్ లీక్‌లో శిక్ష ఏకకాలంలో కాకుండా, వరుసగా అమలు చేయాలని ఆదేశించి, ప్రకటించండి. ప్రత్యామ్నాయంగా, అంతర్జాతీయ పద్ధతులను పరిశీలించి, మూడు నెలల్లోగా పేపర్ లీక్‌పై ఒక నివేదికను తయారు చేయాలని లా కమిషన్‌ను ఆదేశించండి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. పేపర్ లీకులకు బాధ్యులైన వారిని నివారించడంలో, దర్యాప్తు చేయడంలో, ప్రాసిక్యూట్ చేయడంలో అధికారులు పదేపదే విఫలం అవడం, రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16, 19, 21 కింద విద్యార్థుల ప్రాథమిక హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడానికి దారితీసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పేపర్ లీక్‌లవల్ల విద్యార్థులు, వారి కుటుంబాలపై పడే తీవ్రమైన ప్రభావాన్ని ఈ పిటిషన్ ప్రధానంగా ప్రస్తావించింది. దీనివల్ల కలిగే మానసిక, శారీరక క్షోభ, విద్యా, ఉపాధి అవకాశాల నష్టం, చెల్లించని రుణాల వల్ల పెరిగిపోతున్న ఆర్థిక భారం, విదార్థుల ఆత్మహత్యల కేసులు పెరగడం వంటి అంశాలను ఎత్తి చూపింది.

# 'సర్'లో అక్రమాలపై ఆధారాలున్నాయ్

- దేశంలో 13 కోట్ల మంది పేర్లను తొలగించారు
- సాకులు చెప్పడం బిజెపి మానుకోవాలి : ప్రియాంక గాంధీ



**వయనాడ్:** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివాదం చెలరేగిన నేపథ్యంలో, కేరళలోని వయనాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ శుక్రవారం బిజెపిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ చేపట్టి దేశంలో 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారన్నారు. ఈ విషయంపై అధికార బిజెపి ఇచ్చిన వివరణలను ఆమె తోసిపుచ్చారు. ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేమని అన్నారు. 'క్షమించండి. ఇది చాలా పాతబడిన, బలహీనమైన వాదన. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న దానికి ఆధారాలు ఉన్నాయి. నా సోదరుడు చాలా విలేకరుల సమావేశాల్లో వాటిని చూపించారు. ప్రజల ముందు ఆ ఆధారాలను ఉంచారు. ఇప్పుడు ఆ విషయం స్పష్టమైంది. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలిగించారు. దీనిపై బిజెపి కుంటిసాకులు చెప్పడం మానేయాలి' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన జోక్యం చేసుకున్నా, అది ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన నేరం అవుతుంది. వారు (బిజెపి) మన ఎన్నికల్లో జోక్యం చేసుకుంటుంటే, వారి నాయకత్వం ఎన్నికల సంఘం చేత ఇలా చేయిస్తుంటే, అది దేశద్రోహ చర్య అవుతుంది. వారు ఈ విషయాన్ని గ్రహించాలి. అలాగే వారు ఆ బాధ్యతను తీసుకోవాలి. ఒకవేళ వారు ఎలా చేయకపోతే ఎందుకు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు. దేనికి వాళ్లు భయపడుతున్నారు?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతే కాదు ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పద్ధతి చాలా కాలంగా కొనసాగుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. 'వారు ఎన్నికలను రిగ్గింగ్ చేయడం మొదలు పెట్టిన ఎన్ని ఏళ్లు అయ్యింది? అని నిలదీశారు. ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె ఈ ఘాటు విమర్శలు చేయడం గమనార్హం.

# జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో గందరగోళం

- పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని తీర్మానం ప్రవేశపెట్టిన సిఎం ఒమర్ అబ్దుల్లా
- అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం



**శ్రీనగర్:** కేంద్రపాలిత ప్రాంతానికి పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష బిజెపి సభ్యులు వెలలోకి దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ శాసన సభ్యులు, బిజెపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యేలు తమ తమ సీట్లలోకి తిరిగి వెళ్లాలని స్పీకర్ అబ్దుల్ రహీం రథర్ చేసిన విజ్ఞప్తిని వారు పట్టించుకోకపోవడంతో, ఆయన సభను 30 నిమిషాల పాటు వాయిదా వేశారు. బిజెపికి చెందిన విక్రమ్ రంధావా గందరగోళం సృష్టించడంతో అతడిని మార్షలకు బయటకు పంపించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పుడు, జూన్ 2000లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వయంప్రతిపత్తి తీర్మానాన్ని ఈ తీర్మానంలో ప్రస్తావించడంతో బిజెపి ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ తీర్మానంలో '2000 జూన్ 26, 2024 నవంబర్ 6 తేదీలలో ఈ సభ ఆమోదించిన తీర్మానాలకు అదనంగా, జమ్ముకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే, అత్యవసరంగా పునరుద్ధరించాలని ఈ సభ భారత ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ తీర్మానాన్ని భారత ప్రభుత్వానికి పంపాలని తీర్మానిస్తోంది' అని ఉంది. ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్‌సిపి ప్రభుత్వం, 1953 ఆగస్టు 9కి ముందు ఉన్నటువంటి అధిక స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించాలని కోరుతూ 2000 జూన్ 26న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 2024 నవంబర్ 6న, ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ ఈ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టిన వెంటనే, అధికార పక్షం సభ్యులు బల్లలు చరుస్తూ దానికి స్వాగతం పలికారు. అయితే, 2000 నాటి తీర్మానాన్ని ప్రస్తావించడం బిజెపి సభ్యుల నుంచి నిరసనలకు దారితీసింది. సభలో స్వయంప్రతిపత్తి అంశంపై చర్చను అనుమతించము అని బిజెపి ఎమ్మెల్యే ఆర్.ఎస్. పఠానియా అన్నారు. సభలో గందరగోళం కొనసాగుతుండటంతో పలువురు ఎమ్మెల్యేలు ఒకరితో ఒకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు.

# అనుమానాలు నివృత్తి చేయాలి

- ఎన్నికల సంఘానికి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ విజ్ఞప్తి

**పాట్నా :** ఏ వ్యక్తి లేదా వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిందేనని ఎన్‌డిఎలో భాగస్వామ్య పక్షంగా ఉన్న లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం (ఇసి)లో విభేదాల వచ్చినట్లు వార్తల నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రజల మనసుల్లో ఏర్పడిన అనుమానాలను నివృత్తి చేయాలని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రభుత్వంలో ఒక భాగంగా ఉంటూ రాజ్యాంగబద్ధమైన సంస్థను సమర్థించాలనే ఉద్దేశం తనకు లేదని', అలాగే రాహుల్ గాంధీ వంటి ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలకు తాను పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. అయితే, 'ఒకవేళ ప్రజలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం ప్రారంభిస్తే, అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఎన్నికల సంఘం తన వివరణను మరింత గట్టిగా ప్రజల ముందు ఉంచాలని నేను భావిస్తున్నాను. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు చెప్పే వాటికి అది స్పందించాల్సిన అవసరం లేదు, కానీ ప్రజల మనసుల్లో ఉన్న అనుమానాలను మాత్రం తప్పక తొలగించాలి' అని అన్నారు. కాగా, ఎన్నికల సంఘాన్ని బిజెపి దూకుడుగా సమర్థిస్తుండగా, పాశ్వాన్ మాత్రం కొంత సంయమనంతో కూడిన స్పందనను వ్యక్తం చేయడం గమనార్హం. బిజెపి వైఖరి ప్రతిపక్షాలకు మరింత ఆగ్రహం తెప్పించింది. ఎన్డీయేలో కీలక భాగస్వామి అయిన బిజెపికి అనుకూలంగా ఉండేలా సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని వారు ఆరోపించేలా ఇది ప్రేరేపించింది. గత ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రారంభమై, ఆ తర్వాత దశలవారీగా దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ భారీ ప్రక్రియలో 10 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు జాబితాల నుండి తొలగించబడినట్లు సమాచారం.

ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై...

# భారత్–ఆస్ట్రేలియా కృషి చేస్తున్నాయ్

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్



**న్యూఢిల్లీ :** ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్–ఆస్ట్రేలియా ఒక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బిఐటి)పై పనిచేస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. శుక్రవారం ఆస్ట్రేలియాలో జరిగిన ఐసిఏఐ తొలి ఓషియానియా అంతర్జాతీయ సదస్సు–2026లో ప్రసంగిస్తూ, విద్య, కీలక ఖనిజాలు వంటి రంగాలలో ఇరు దేశాలు సహకారాన్ని పెంపొందించుకోవచ్చని మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈ రెండు దేశాలు 2022లో ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందాన్ని (ఇసిటిఏ) అమలు చేశాయి. ఇప్పుడు ఈ ఒప్పందం పరిధిని సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంగా (సిఇసిఏ) విస్తరించడానికి చర్చలు జరుపుతున్నాయి. 'ఇప్పుడు మేం చాలా సమతుల్యమైన, న్యాయమైన, సమానమైన, సమగ్రమైన ఆర్థిక సహకార ఒప్పందం దిశగా పనిచేయాలని నిర్ణయించుకున్నాం. ఇది మా సంబంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం కోసం కూడా మేం ఆస్ట్రేలియాతో కలిసి పనిచేస్తున్నాం' అని గోయల్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలు ఇతర దేశాలలోని పెట్టుబడులకు రక్షణ కల్పిస్తాయని, అవి ఇరువైపులా పెట్టుబడులను ప్రోత్సహించడంలో కూడా సహాయపడతాయని వివరించారు.'ఆస్ట్రేలియా, భారతదేశాలను ఒక విశ్వసనీయ భాగస్వామ్యంగా చూడాలని మేము చూస్తున్నాం. మనమిద్దరం ఒకరికొకరం పూరకంగా ఉంటాం.ఆస్ట్రేలియా వద్ద కీలకమైన ఖనిజాలు ఉన్నాయి. మనకు తయారీ, ప్రాసెసింగ్ రంగాలలో ఆశయాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు, మన యువ ప్రతిభ ఒకదానికొకటి పూరకంగా ఉంటాయి. ఆస్ట్రేలియా దీర్ఘకాలిక పెట్టుబడి, మన వృద్ధి కాంక్ష ఒకదానికొకటి తోడ్పడతాయి' అని పియూష్ గోయల్ చెప్పారు.'అనేక సేవా సంస్థలు, ముఖ్యంగా ఐటి కంపెనీలు ఎదుర్కొంటున్న సరిహద్దుల మధ్య పన్నుల సమస్యను కూడా మేము పరిష్కరించాం. వ్యాపారులు, పౌరులపై నిబంధనల పాటింపు భారాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా, ఒకరి నిబంధనలను మరొకరు గౌరవించడంపై కూడా మేం మరింతగా దృష్టి సారించాం' అని మంత్రి వెల్లడించారు.ఐసిఏఐ సభ్యులు కేవలం మూలధన సంరక్షకులుగా ఉండటం నుంచి ఆవిష్కరణలు, సుస్థిర సంస్థల రూపకర్తలుగా మారాలని, పునరుత్పాదకత ఇంధన సాంకేతికతలో కొత్త అవకాశాలను సృష్టించడానికి , కీలక ఖనిజాల విషయంలో ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోవడానికి భారత్–ఆస్ట్రేలియా రాయబారులుగా వ్యవహరించాలని కోరారు.

## ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం...
## లారీ ఢీకొని ఆరుగురు మృతి

**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. నేషనల్ హైవే30పై మార్కటోలా ఘాట్ వద్ద కబీర్‌ధామ్ జిల్లాకు చెందిన 'ధుమాల్' మ్యూజిక్ బ్యాండ సభ్యులు ప్రయాణిస్తున్న మినీ వాహనం మొరాయించడంతో వారు రోడ్డు పక్కన ఆగాయి ఇదే సమయంలో రాయ్‌పూర్ నుంచి జగ్దల్‌పూర్ వైపు గోధుమలతో వెళ్తున్న 16 చక్రాల భారీ లారీ దాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో సుమారు 30 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లబడిన మినీ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంపై పడిన గోధుమల బస్తాల కింద చిక్కుకుని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు ధమ్తరీ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఏడుగురు బాధితులను మెరుగైన వైద్యం కోసం రాయ్‌పూర్‌కు తరలించగా, ప్రమాదం తర్వాత లారీ డ్రైవర్ పరారయ్యాడు.

ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని భావిస్తే

# ప్రతిపక్ష పార్టీలు పోటీ చేయొద్దు


- సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సూచన
- తమ రాజకీయ అంతానికి దారితీస్తుందనే భయంతోనే పోటీ చేస్తున్నాయని ఆరోపణ



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) విషయంలో ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తాయన్న వార్తల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కూడా తీవ్రస్థాయిలో స్పందించింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు భావిస్తే, ఇకపై ఎన్నికలలో పాల్గొనడం మానుకోవాలని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుండడం వాస్తవమేనని, అలాంటి ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీలు పాల్గొనడం వల్ల అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భ్రమలు ప్రజల్లో కలుగుతున్నాయని దీప్కే చెప్పారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు పదే పదే ఆరోస్తున్నాయని, అలాంటప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడం దేనికని ప్రశ్నించారు. ఎన్నికలకు దూరంగా ఉండటం తమ రాజకీయ అంతానికి దారితీస్తుందనే భయంతోనే ప్రతిపక్ష పార్టీలు పాల్గొనడం కొనసాగిస్తున్నాయా సిజెపి వ్యవస్థాపకుడు ప్రశ్నించారు. ఓట్ల దొంగతనం, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపిలను ప్రలోభపెడుతుంటే, పార్టీలు చీలిపోతుంటే ఇకా ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారా అని నిలదీశారు. 'ఇది రాజకీయ మనుగడ కాదు. మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు మిమ్మల్ని బలహీనపరచగల, మీ పార్టీని చీల్చగల లేదా మీ ఎన్నికైన ప్రతినిధులను తీసివేయగల వ్యవస్థలో మీరు కేవలం జీవించి ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా మీరు ఎంతకాలం మనుగడ సాగించగలరు? అని దీప్కే ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు ముఖ్యమైన రాష్ట్రాల్లో రిగ్గింగ్ జరిగినప్పుడు మాత్రమే దాని గురించి మాట్లాడడం, ఇతర చోట్ల జరిగినప్పుడు మౌనంగా ఉండడం మంచిదికాదన్నారు. ఎన్నికలలో రిగ్గింగ్ జరుగుతుంటే, అది ఏ రాష్ట్రంలో లేదా ఏ పార్టీ ప్రభావితమైందనే దానితో సంబంధం లేకుండా స్పందించాలని దీప్కే సూచించారు. తమ రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజాస్వామ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. 'మీ సొంత రాజకీయ మనుగడ గురించి ఆలోచించే ముందు, దేశం గురించి, ప్రజాస్వామ్యం గురించి ఆలోచించండి. ఒక దృఢమైన వైఖరిని తీసుకోండి, మోసపూరిత ఎన్నికలలో పాల్గొనడం మానుకోండి' అని అన్నారు. 'ఫిక్స్‌డ్ మ్యాచ్‌లో లాగే, ప్రతీ క్యాచ్‌ను వదిలేయరు. కొన్ని క్యాచ్‌లు పడతారు, హోరాహోరీగా సాగుతున్నట్లు చూపించడానికి మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకు కూడా సాగదీయవచ్చు' అని ఆయన అన్నారు. 'అదే విధంగా, మీరు పోటీలో కొనసాగడానికి, నిజమైన పోటీ జరిగిందని ప్రజలు నమ్మేలా చేయడానికి సరిపడా కొన్ని విజయాలను మీకు అందిస్తారు. ఆ కొన్ని విజయాలే మిమ్మల్ని ఆటలో నిలబెట్టి, మొత్తం వ్యవహారాన్ని చట్టబద్ధంగా కనిపించేలా చేసే ముక్కలు' అని దీప్కే అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, తన డిమాండ్ నెరవేర్చకపోతే 'జంతర్ మంతర్ 2.0' ఆందోళన చేపడతామని సిజెపి వ్యవస్థాపకుడు గురువారం హెచ్చరించారు.

# యుపిఐ 'ఎండిఆర్'పై ఎలాంటి బాహ్య ఒత్తిడిలేదు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** రూ.2వేలు పైబడిన నిర్దిష్ట యుపిఐ లావాదేవీలపై 0.4శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండిఆర్) విధించాలన్న నిర్ణయం బాహ్య ఒత్తిడితో తీసుకున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలు 'పూర్తిగా నిరాధారమైనవి'అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ఇది చెల్లింపుల వ్యవస్థ తీసుకున్న వృత్తిపరమైన నిర్ణయమని ఆమె స్పష్ట ంచేశారు. శుక్రవారం ఆమె ఇక్కడ 'పిటిఐ'తో మాట్లాడుతూ ఈ నిర్ణయం పూర్తిగా వృత్తి పరమైనదని చెప్పారు. దీనిని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ), పేమెంట్ బ్యాంకులు, మర్చంట్ బ్యాంకులు సంయుక్తంగా తీసుకున్నాయని ప్రభుత్వం దీనిని బలవంతంగా రుద్దలేదని స్పష్టీకరించారు. ప్రభుత్వం విదేశీ ఒత్తిడులకు లొంగిపోయిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను నిర్మలా సీతారామన్ కొట్టిపారేశారు. ఎండిఆర్ పన్ను కాదని, దానివల్ల ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని మంత్రి తెలిపారు.యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యుపిఐ) ఎండిఆర్‌పై నిర్ణయం బాహ్య ఒత్తిడితో, ముఖ్యంగా అమెరికా ఒత్తిడితో తీసుకున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణల గురించి ఆమెను ప్రశ్నించగా, 'ఇది పూర్తిగా నిరాధారమైనది' అని 'నేను దీనిని పూర్తిగా ఖండిస్తున్నాను' అని నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. ప్రతిపక్షం విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా సమస్యల కోసం వెతుకుతూ ఆరోపణలు చేస్తోందని ఆర్థిక మంత్రి అన్నారు. ఇది వినియోగదారులపై విధించే పన్ను అని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తోసిపుచ్చుతూ సీతారామన్ ఇలా అన్నారు. 'ఇది పన్ను కాదు, సెస్ కాదు, ఇది సర్‌చార్జ్ కూడా కాదు. దీని వసూళ్లు భారత సంఘటిత నిధికి చేరడం లేదు' అని మంత్రి వివరించారు. వసూలు చేసిన మొత్తాన్ని యుపిఐ ఎకోసిస్టమ్‌లోని బ్యాంకులు, ఇతర సంస్థల మధ్య పంచుతారు. వసూలు చేసిన ఎండిఆర్‌లో 40శాతం కస్టమర్ల బ్యాంకులకు, 30శాతం గేట్‌వేలకు, 20శాతం యుపిఐ యాప్‌కు, మిగిలిన 10శాతం యుపిఐ యాప్ స్పాన్సరింగ్ బ్యాంక్‌కు వెళ్తుందని వివరించారు. అక్టోబరు 15నుంచి రూ.2,000 పైబడిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే యుపిఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండిఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని వినియోగదారులు కాకుండా వ్యాపారులే చెల్లించాలి. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఇది రూ.300కు పరిమితం చేయబడుతుంది. వ్యక్తుల మధ్య చెల్లింపులతో పాటు విస్తృతమైన రోజువారీ వ్యాపార చెల్లింపులలో అధిక శాతం ఉచితంగానే ఉంటాయి. యుపిఐ ప్లాట్‌ఫారమ్‌ను నిర్వహిస్తున్న ఎన్‌పిసిఐ, డిపాజిట్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను సృష్టించే లక్ష్యంతో సెప్టెంబరు 15న కొన్ని యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్‌నేఉ విధిస్తూ ఒక సర్క్యులర్ ను జారీ చేసింది.

ఢిల్లీలో ప్రముఖ నేతల

# 'సర్' వెరిఫికేషన్ పూర్తి

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో 'సర్' ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ, ఢిల్లీ సిఎం రేఖా గుప్తా, విదేశాంగ మంత్రి జైశంకర్ సహా ఇతర ప్రముఖుల వివరాలను క్షేత్రస్థాయిలో పత్రాల పరిశీలన అనంతరం ధ్రువీకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నోటీసులతో ఎవరి ఓటును కూడా తొలగించలేదని, వీళ్ల పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చడానికి రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు. నవంబర్ 4న ఓటర్ల తుది జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) సహా ఎన్నికల అధికారుల బృందాలు గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నోటీసులు అందుకున్న ఓవర్ల వివరాలు సేకరించారు. వారి నుంచి అభ్యంతరాలపై ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలను సేకరించి వివరాలను సరిపోల్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ప్రముఖులతోపాటుగా సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న అనేక మంది ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఈ అభ్యంతరాల స్వీకరణకు ఢిల్లీలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 605 మంది అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను (ఎఇఆర్‌ఒ) నియమించినట్లు అధికారులు వెల్లడించారు. 'నోటీసులు, దావా, అభ్యంతరాలను ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించేందుకు, ఇప్పటికే పనిచేస్తున్న 297 మంది ఎఇఆర్‌ఒలతో పాటు అదనంగా మరో 605 మంది ఎఇఆర్‌ఒలను నియమించాం' అని ఢిల్లీ సిఇఒ కార్యాలయం ఇప్పటికే ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఇసి ఆగస్టు 31న ముసాయిదా జాబితా ప్రచురించింది. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలో 97 లక్షల మందికి పైగా ఓటర్లు ఉండగా, అందులో సుమారు 33.13 లక్షల మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో న్యాయవ్యవస్థ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అత్యున్నత పదవులను కలిగి ఉన్నవారు, కళలు, సంస్కృతి, జర్నలిజం, క్రీడలు, ప్రజా సేవలు మొదలైన రంగాలకు చెందిన ప్రముఖుల పేర్లు లేకపోవడంతో వారికి అధికారులు నోటీసులు చేశారు. 2002 ఓటర్ల జాబితాతో వీళ్ల పేర్లు 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' అని పేర్కొంటూ, ఎన్నికల అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. అయితే ఈ జాబితాలో మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య పేర్లు ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రముఖులు కొత్త ఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్లే కావం గమనార్హం.

ST.PETER'S INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES (Autonomous)
VIDYANAGAR, HANUMAKONDA, TELANGANA – 506001
www.stpeters.co.in, Email: spipswgl@gmail.com, Mobile: 9000001196

**NOTIFICATION FOR ADMISSIONS UNDER "CATEGORY-B" - 2026-27**

Applications are invited from eligible candidates into the following courses under **"Category B"** seats for the academic year 2026-27.

| Course | Total Intake | "B" Category |
|---|---|---|
| M.Pharmacy – Pharmaceutics | 15 | 04 |
| M.Pharmacy – Pharmacy Practice | 15 | 04 |
| Pharm.D. (Post Bac) | 10 | 03 |
| B.Pharmacy | 100 | 30 |
| Pharm.D. | 30 | 09 |

Applications can be obtained from the college or downloaded from the college website. Filled in applications should be submitted on or before 25-09-2026. Eligibility & admission procedure is as per the guidelines issued by **Govt. of Telangana**.

*Correspondent*

# క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత బలోపేతం

- రష్యా పార్లమెంటరీ ఎన్నికల పూర్తి ఫలితాలు విడుదల



**మాస్కో:** రష్యా అధికారులు దేశంలో యుద్ధకాలంలో జరిగిన తొలి పార్లమెంటరీ ఎన్నికల పూర్తి ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు క్రెమ్లిన్ రాజకీయ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేశాయి. మూడు రోజుల పాటు జరిగిన పోలింగ్ ఆదివారం ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫలితాల ప్రకారం, క్రెమ్లిన్ ప్రధాన రాజకీయ మద్దతుదారైన 'యునైటెడ్ రష్యా పార్టీ' దిగువ సభ 'స్టేట్ డూమా'లో మూడు వంతులకు పైగా స్థానాలను గెలుచుకుంది. ఇది ఆ పార్టీకి రికార్డు స్థాయి విజయం. ఎన్నికల్లో ప్రతిపక్షానికి దాదాపు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. 11.1 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో దాదాపు 60 శాతం మంది ఓటు వేశారు. గత దశాబ్దానికి పైగా కాలంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఇదే అత్యధిక పోలింగ్. ఓటింగ్‌ను మూడు రోజులకు విస్తరించడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ ఓటింగ్‌ను అధికారులు అనుమతించారు. 2022లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడిని ప్రారంభించిన తర్వాత జరిగిన తొలి పార్లమెంటరీ ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. అదే ఏడాది రష్యా ఆక్రమించి, తన భూభాగంలో విలీనం చేసుకున్న ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాల ప్రజలను కూడా ఈ ఎన్నికల్లో ఓటర్లుగా చేర్చారు. 2014లో రష్యా విలీనం చేసుకున్న క్రిమియాలోనూ పోలింగ్ జరిగింది. ఈ ప్రాంతాల్లో జరిగిన ఓటింగ్ చట్టవిరుద్ధమని ఉక్రెయిన్ ఖండించింది. కాగా, క్రెమ్లిన్ విధానాలకు ప్రజల మద్దతును ఎన్నికల ఫలితాలు చూపిస్తున్నాయని పుతిన్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం అధిపతి ఎల్లా పాంఫిలోవా ప్రకారం, యునైటెడ్ రష్యా 450 డూమా స్థానాల్లో 349 గెలుచుకుంది. పార్టీలకు కేటాయించిన 225 స్థానాల్లో ఆ పార్టీకి దాదాపు 58 శాతం ఓట్లు వచ్చాయి. మిగిలిన 225 స్థానాల్లో 209 సింగిల్‌మెంబర్ నియోజకవర్గాలను కూడా గెలుచుకుంది. క్రెమ్లిన్‌కు అనుకూలంగా కీలక అంశాలపై ఓటు వేసే మరో చిన్న పార్టీలకు 97 స్థానాలు దక్కాయి. మరో నాలుగు స్థానాలను పార్టీ అనుబంధం లేకుండా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు గెలుచుకున్నారు. యుద్ధాన్ని బహిరంగంగా విమర్శించడానికి సాహసించిన ఏకైక సమాన రాజకీయ పార్టీగా ఉన్న ఉదారవాద 'యాబ్లోకో'ను గత నెలలో రష్యా సుప్రీంకోర్టు ఎన్నికల నుంచి నిషేధించింది. ఆ పార్టీ తరఫున కొద్ది మంది మాత్రమే సింగిల్‌మెంబర్ నియోజకవర్గాల్లో పోటీ చేశారు. కానీ, వారిలో ఎవరూ గెలవలేదు. కాగా, ఉక్రెయిన్ నిరంతర డ్రోన్ దాడుల మధ్య ఎన్నికలు జరిగాయి. ఆదివారం రాత్రి 1,110 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మాస్కో వైపు వస్తున్న 450 డ్రోన్లను కూల్చివేసినట్లు మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. రాజధానిపై ఇదే అతిపెద్ద డ్రోన్ దాడి అని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో చమురు శుద్ధి కర్మాగారం, నివాస భవనం దెబ్బతిన్నాయి. మాస్కో ప్రాంతంలో ముగ్గురు మరణించారు, 38 మంది గాయపడ్డారు. పోలింగ్ సమయంలో ఉక్రెయిన్ దాడుల్లో ఆరుగురు ఎన్నికల సిబ్బంది మరణించారని, కాల్పుల్లో 75 పోలింగ్ కేంద్రాలు పాక్షికంగా దెబ్బతినడం లేదా ధ్వంసం కావడం జరిగిందని పాంఫిలోవా తెలిపారు.

## నెతన్యాహు ప్రసంగం
# ఐరాసలో ప్రతినిధుల వాకౌట్



**ఐక్యరాజ్యసమితి:** అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తుండగానే వివిధ దేశాల ప్రతినిధులు సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీగా కనిపించాయి. కాగా, గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందన్న ఆరోపణలను నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. ఆ వార్తలను 'ఈ శతాబ్దంలోనే అతి పెద్ద అబద్ధం' అంటూ కొట్టిపారేశారు. సభ నుంచి వెళ్లిపోయిన ప్రతినిధులను 'నైతికంగా దిగజారిన వారు'గా అభివర్ణించారు. ఇలా వుంటే, అమెరికా వీసా నిరాకరించడంతో పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ముందుగా రికార్డు చేసిన వీడియో ద్వారా ఐరాసను ఉద్దేశించి ప్రసంగించారు. వరుసగా రెండో ఏడాది ఆయనకు వీసా లభించలేదు. 'మేము మా మాతృభూమిని విడిచిపెట్టం. నిర్బంధ వలసలను అంగీకరించం. మా ధరణిపై మా భవిష్యత్తును నిర్ణయించేందుకు ఎవరినీ అనుమతించం' అని అబ్బాస్ స్పష్టం చేశారు. గాజా శాంతి ఒప్పందం తదుపరి దశలను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. గాజా పునర్నిర్మాణానికి ఐదు నెలల్లో 2.45 బిలియన్ డాలర్లు ఖర్చు చేసే ప్రణాళికను ట్రంప్ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ పీస్ ప్రకటించిన తర్వాత హమాస్ ఈ ప్రకటన చేసింది. అయితే ఆయుధాల విరమణపై హమాస్ ఎలాంటి ప్రస్తావన చేయలేదు. ఇజ్రాయెల్ మాత్రం హమాస్ నిరాయుధీకరణ జరిగే వరకు పునర్నిర్మాణాన్ని అనుమతించబోమని చెబుతోంది. గాజా పునర్నిర్మాణానికి అవసరమని అంచనా వేసిన 71 బిలియన్ యూరోలలో ఇప్పటివరకు కేవలం ఒక బిలియన్ యూరోలు మాత్రమే సమీకరించారని యూరోపియన్ యూనియన్ ఉన్నతాధికారి తెలిపారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాలోని రియాద్, యన్బు ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు చేసినట్లు ప్రకటించారు. అయితే ఆ వాదనలను స్వతంత్రంగా ధ్రువీకరించలేకపోయినట్లు 'అసోసియేటెడ్ ప్రెస్' తెలిపింది. సౌదీ సైన్యం ఆరు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా, యెమెన్‌లో మానవతా సంక్షోభం మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో పౌరులకు అత్యవసర సహాయం వేగంగా అందించాలని ఐరాస కోరింది. ఆగస్టు ప్రారంభం నుంచి భూతల పోరాటాలు, ఫిరంగి దాడులు, వైమానిక దాడుల్లో కనీసం 125 మంది పౌరులు మరణించారని లేదా గాయపడ్డారని ఐరాస మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ తెలిపారు. హౌతీల నిర్బంధంలో ఉన్న 73 మంది ఐరాస సిబ్బందిని విడుదల చేయాలని కూడా ఆయన కోరారు.

**యూదులను ప్రమాదంలోకి నెడుతున్న మమ్దానీ వ్యాఖ్యలు**

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను విమర్శిస్తూ జోహ్రాన్ మమ్దానీ చేస్తున్న వ్యాఖ్యలు న్యూయార్క్‌లోని యూదులను ప్రమాదంలోకి నెడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరోపించారు. ఇజ్రాయెల్‌పై మమ్దానీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నెతన్యాహు అన్నారు. మమ్దానీని 'న్యూయార్క్ యాంటీ సెమిటిక్ మేయర్'గా అభివర్ణించిన నెతన్యాహు, తన ప్రసంగంలో కొంత సమయాన్ని న్యూయార్క్ మేయర్‌పై విమర్శలకు కేటాయించారు. మమ్దానీ గతంలో నెతన్యాహు న్యూయార్క్ వస్తే అరెస్టు చేయిస్తానని హెచ్చరించారు. 'మీరు ఈ నగరానికి మేయర్‌గా ఎన్నికైనప్పటి నుంచి చాలామంది యూదులు న్యూయార్క్‌లో తమకు భద్రత లేదని భావిస్తున్నారు' అని నెతన్యాహు అన్నారు. న్యూయార్క్ తొలి ముస్లిం మేయర్ అయిన మమ్దానీ చాలాకాలంగా గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. నెతన్యాహును 'యుద్ధ నేరస్థుడు'గా, 'పాలస్తీనా ప్రజలపై భయానక మారణహోమానికి' రూపకర్తగా ఆయన గతంలో అభివర్ణించారు. అయితే ఇజ్రాయెల్‌ను విమర్శించడం, పాలస్తీనా హక్కులకు మద్దతు ఇవ్వడం యూదు వ్యతిరేకత కాదని మమ్దానీ చెబుతున్నారు.

# జిన్‌పింగ్‌కు ట్రంప్ విందు—టెక్ దిగ్గజాల సందడి



**వాషింగ్టన్:** దౌత్యంలో అధికారిక చర్చలతో పాటు విందులో ఎలాంటి వంటకాలు వడ్డిస్తారు? అతిథులు ఎక్కడ కూర్చుంటారు,? వంటి అంశాలతోపాటు వారి వస్త్రధారణ, హావభావాలు కూడా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ గౌరవార్థం అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇచ్చిన 'స్టేట్ డిన్నర్'లో బిలియనీర్లు, వ్యాపార దిగ్గజాలు, వాషింగ్టన్‌లోని ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓపెన్ ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మన్ వైట్ హౌస్‌కు వస్తూ అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. ఎన్విడియా ఇసిఒ జెన్సన్ హువాంగ్ తాను సాధారణంగా ధరించే నల్లటి లెదర్ జాకెట్‌కు బదులుగా టక్సీడో వేసుకున్నారు. ఎల్వీఎంహెచ్ అధినేత బెర్నార్డ్ ఆర్నాల్ట్ కూడా విందుకు హాజరయ్యారు. విందు మెనూలో మొదట అడవి పుట్టగొడుగులు, తాజా మూలికలు, పాన్సెట్టాతో ఎల్లో స్క్వాష్ వెలూటే వడ్డించారు. ఆ తర్వాత నువ్వులతో పూతపూసిన 'సీ బాస్' చేపను బోక్ చాయ్, కాల్చిన వంకాయ, ప్రత్యేక సాస్‌తో అందించారు. డెజర్ట్‌గా వనిల్లా క్రీమ్యూ, పుల్లని చెర్రీ, వాల్నట్ ఫ్రాంగిన్‌తో పాటు వైట్‌హౌస్‌లో ఉత్పత్తి చేసిన తేనెతో తయారైన ప్రత్యేక ఐస్‌క్రీమ్ వడ్డించారు. విందులో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, టెస్లాస్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, గూగుల్‌కు చెందిన సుందర్ పిచాయ్, ఓపెన్ ఎఐ అధ్యక్షుడు గ్రెగ్ బ్రాక్మన్, డెల్ టెక్నాలజీస్ సిఇఒ మైఖేల్ డెల్ తదితర టెక్ దిగ్గజాలు సందడి చేశారు. జిన్‌పింగ్ ఈ ఏడాది మే మాసంలో, బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్స్'లో ట్రంప్‌కు అధికారిక 'స్టేట్ డిన్నర్' ఇచ్చారు. దానికి ప్రతిస్పందనగా ట్రంప్ వైట్‌హౌస్‌లో నిర్మిస్తున్న కొత్త బాల్‌రూమ్‌ను 'గ్రేట్ హాల్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్'గా అభివర్ణించారు. 2015లో జిన్‌పింగ్‌కు ఒబామా విందు ఇవ్వడాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. ఇలాంటి ఆర్భాటాలు తగవని విమర్శించారు. 'జిన్‌పింగ్ బృందాన్ని మెక్‌డొనాల్డ్‌కు తీసుకెళ్లి, అనంతరం చర్చలకు సిద్ధం కండి' అని అప్పట్లో వ్యాఖ్యానించారు. 2017లో జిన్‌పింగ్ తొలిసారి ట్రంప్‌ను కలిసినప్పుడు 'మార్‌ఎలాగో'లో సమావేశమయ్యారు. ఆ పర్యటన సందర్భంగా సిరియాపై అమెరికా క్షిపణి దాడి చేసిన విషయాన్ని జిన్‌పింగ్‌కు ట్రంప్ విందు సమయంలో చెప్పిన సంఘటనను అమెరికా మీడియా ప్రత్యేక కథనాలలో గుర్తుచేసుకుంది.

## జిన్‌పింగ్ పర్యటన ముగింపులో
# అమెరికా రాజ్యాంగం, హక్కుల పత్రాల సందర్శన

**వాషింగ్టన్:** మూడు రోజుల అమెరికా పర్యటన ముగింపులో భాగంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ నేషనల్ ఆర్కైవ్స్‌కు తీసుకెళ్లనున్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కమ్యూనిస్టు దేశాధినేతకు అమెరికా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిన కీలక పత్రాలను చూపించనున్నారు. నేషనల్ ఆర్కైవ్స్‌లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, రాజ్యాంగం, హక్కుల పత్రం భద్రపరిచారు. వాటిని సందర్శించిన అనంతరం, వాషింగ్టన్ నుంచి జిన్‌పింగ్ స్వదేశానికి బయలుదేరుతారు. సరైన సమయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ, భారత కాలమానం ప్రకారం ఆయన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా శనివారం తెల్లవారు జామునమ బయలుదేరతారని సమాచారం. 'అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో జిన్‌పింగ్ పర్యటన జరుగుతోంది. అమెరికా గర్వించదగిన చరిత్రలోని కొన్ని గొప్ప సంపదలను జిన్‌పింగ్‌కు చూపించాలనుకుంటున్నాను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నేషనల్ ఆర్కైవ్స్‌లో "ది అమెరికన్ స్టోరీ" పేరుతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమెరికా సాధించిన విజయాలు, పురోగతితో పాటు దేశ చరిత్రలోని చీకటి అధ్యాయాలను కూడా ఈ ప్రదర్శన చూపిస్తుంది. కాగా, ట్రంప్ ఓవల్ ఆఫీస్‌లో తాను దాచుకున్న 'అమెరికా స్వాతంత్ర్య ప్రకటన' ప్రతిని జిన్‌పింగ్‌కు చూపించారు. రెండు దేశాల చారిత్రక సంబంధాలకు సంబంధించిన వస్తువులను కూడా ఆయనకు చూపించాలని తాను కోరుకుంటున్నట్టు ట్రంప్ చెప్పారు. ఈ పర్యటనలో చివరి రోజున జిన్‌పింగ్ కార్యక్రమాలు వైట్‌హౌస్ నుంచి మొదలవుతాయి. చైనా అధ్యక్షుడు జీ, ఆయన భార్య పెంగ్ లియువాన్‌కు ట్రంప్, ఆయన భార్య మెలానియా ట్రంప్ టీ విందు ఇవ్వడంతో మొదలైన కార్యక్రమాలు సాయంత్రం వారి వీడ్కోలు వరకూ కొనసాగుతాయి. ఇలావుంటే, గురువారం ట్రంప్, జిన్‌పింగ్ సుమారు 90 నిమిషాల పాటు రహస్యంగా సమావేశమయ్యారు. మధ్యప్రాచ్యం, ఉక్రేన్, కొరియా ద్వీపకల్పం తదితర అంశాలపై చర్చించినట్లు చైనా ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఆ సమావేశానికి సంబంధించిన వివరాలను వైట్‌హౌస్ ఇంకా వెల్లడించలేదు.

## జిన్‌పింగ్—ట్రంప్ శిఖరాగ్ర భేటీ
(మొదటి పేజీ తరువాయి)

ఇది చూపిస్తోంది' అని బీజింగ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి జియాంగ్ జియ్యు 'అసోసియేటెడ్ ప్రెస్' (ఎపి)తో అన్నారు. చాలా మంది చైనీయులు, చైనా సామాజిక మాధ్యమాల్లో దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. అమెరికాతో చైనా సహకారాన్ని వారు ప్రశంసించారు. చైనా అధికారిక పత్రిక 'పీపుల్స్ డైలీ' తన మొదటి పేజీ మొత్తాన్ని జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు కేటాయించింది. జిన్‌పింగ్—ట్రంప్ సమావేశాలకు సంబంధించిన ఆరు ఫొటోలను ప్రచురించింది. చైనా సెర్చ్ ఇంజిన్ 'బైడూ'లో శుక్రవారం అత్యంత ప్రజాదరణ పొందిన మూడు అంశాల్లో ట్రంప్—జిన్‌పింగ్ చర్చలు ఒకటి. జిన్‌పింగ్ పాల్గొన్న స్టేట్ డిన్నర్, మిడ్‌ఆటమ్ ఫెస్టివల్ సందర్భంగా చైనా ప్రజలకు ఆయన పంపిన శుభాకాంక్షలు ఈ ప్రధానమైన అంశాల్లో ఉన్నాయి. వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, భద్రత వంటి అంశాల్లో ట్రంప్, జిన్‌పింగ్ పరస్పరం సానుకూలంగా వ్యవహరించినట్టు బీజింగ్ నివాసి షెన్ జుఓహాంగ్ వ్యాఖ్యానించారు. 'అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం లేదు, సైనిక ఘర్షణ కూడా లేదు. తైవాన్ విషయంలో కూడా తీవ్ర ఉద్రిక్తతకు బదులుగా మంచి దిశలో ముందుకు సాగుతున్నాం' అని షెన్ అన్నారు. 'ఇరు పక్షాలు సమస్యలను మరింత సమన్వయపూర్వకంగా పరిష్కరిస్తున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. కాగా, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా వ్యతిరేకించాలని ట్రంప్‌ను జిన్‌పింగ్ కోరారు. చైనా తన భూభాగంగా పేర్కొంటున్న తైవాన్ అంశాన్ని అమెరికా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ట్రంప్ వెంటనే తైవాన్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే తైవాన్‌కు అమెరికా ఆయుధ విక్రయాల అంశంపై చైనాతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన గతంలో పేర్కొన్నారు. మొత్తం మీద అమెరికా, చైనా అధ్యక్షుల మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశం ఓ సానుకూల సంకేతాన్ని పంపిందని, రెండు దేశాల సంబంధాలపై సానుకూల వాతావరణం నెలకొందని చైనా ప్రజలు భావిస్తున్నారు. 'పూర్తిగా మాట్లాడుకోకపోవడం అంటే ఇరువురు నేతలు మాట్లాడుకోవడం మంచిది. ఎన్నో సమస్యలకు ఏదో ఒక పరిష్కారం లభించవచ్చు' అన్న ధోరణి చైనీయుల్లో కనిపిస్తున్నదని ఎపి తన వార్తా కథనంలో పేర్కొంది.

**రానున్న ఐదేళ్లలో లక్ష మంది యువ అమెరికన్లను చైనా ఆహ్వానిస్తాం**
**చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన**

వచ్చే ఐదేళ్లలో పరస్పర మార్పిడి కార్యక్రమాలు, విద్య వంటి రంగాలలో భాగస్వామ్యం కోసం లక్ష మంది యువ అమెరికన్లను తమ దేశానికి ఆహ్వానిస్తామని, వైట్‌హౌస్‌లో విడుదల చేసిన ఒక ప్రటనలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తెలిపారు.

2023లో చైనా ఇలాంటి కార్యక్రమం కింద ఐదేళ్లలో 50 వేల మంది యువ అమెరికన్లను ఆహ్వానిస్తామని ప్రకటించింది. ఆ లక్ష్యాన్ని గడువు కంటే ముందుగానే ఈ ఏడాదిలోనే పూర్తిచేశారు. 'చైనా—అమెరికా సంబంధాలపై ప్రజల్లో ఆశ ఉంది. వాటి భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. వచ్చే ఐదేళ్లలో మార్పిడి, విద్య కోసం లక్ష మంది యువ అమెరికన్లను చైనాకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించడం నాకు సంతోషంగా ఉంది' అని జిన్‌పింగ్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో చైనా, అమెరికా ప్రజలు 'ఫాసిస్టు' దురాక్రమణకు వ్యతిరేకంగా భుజం భుజం కలిపి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తుచేశారు. 'చరిత్రలోని ఆ భాగాన్ని చైనా ప్రజలు ఎప్పుడూ మరచిపోలేదు. అమెరికా ప్రజలు కూడా మరచిపోలేదు' అని వ్యాఖ్యానించారు. జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలన్న చైనా లక్ష్యం, మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దాలన్న అమెరికా లక్ష్యం పరస్పర సహకారంతో, సాధించవచ్చని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, చారిత్రక బాధ్యతను ముందుకు తీసుకెళదామని ఆయన అమెరికాను కోరారు.

రెండు దేశాల ప్రజల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తూ, మెరుగైన ప్రపంచ నిర్మాణానికి కలిసి పనిచేద్దామని జిన్‌పింగ్ అన్నారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని ప్రస్తావించారు. భద్రత, సాంకేతికత, సూపర్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అంశాలను ప్రస్తావించిన ట్రంప్, ఈ రంగాల్లో తామిద్దరం తీసుకునే నిర్ణయాలు రాబోయే దశాబ్దాల్లో శాంతి, సుసంపన్నతకు దోహదపడగలవని అన్నారు. 'మనం ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెడుతున్నాం. చరిత్రలో ఎన్నో రంగాల్లో మనం కలిసి సాధించగలిగింది చాలా ఉందని నాకు నమ్మకం ఉంది' అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా, చైనా మధ్య ఏర్పడిన స్నేహాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. చైనాలో పోరాడేందుకు స్వచ్ఛందంగా వచ్చిన అమెరికా పైలట్లను, 'ఫ్లయింగ్ టైగర్స్' బృందాన్ని ట్రంప్ ప్రశంసించారు. చైనా ప్రజలతో అమెరికా మెరైన్స్‌కు ఏర్పడిన సంబంధం 'గంగ్ హో' అనే చైనీస్ పదబంధాన్ని అమెరికా మెరైన్స్‌తో ప్రాచుర్యంలోకి తెచ్చిందని ట్రంప్ చెప్పారు. చైనా భాషలో దాని అర్థం 'కలిసి పనిచేయడం' అని ఆయన పేర్కొన్నారు.

## విధించాలి
(మొదటి పేజీ తరువాయి)

మార్పులను ఈ పర్యవేక్షక సంస్థ సిఫార్సు చేసింది. ఇందులో భాగంగా, అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఎంపిల విషయంలో రాష్ట్రపతికి, ఎమ్మెల్యేల విషయంలో గవర్నర్లకు బదిలీ చేయాలని సూచించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఒక కాలపరిమితిని, అలాగే పార్టీ ఫిరాయించిన వారు తిరిగి ఎన్నికయ్యే వరకు ప్రభుత్వ పదవుల్లో కొనసాగకుండా ఆంక్షలు విధించాలని కూడా ఇది సూచించింది. కాగా, 2022—26లో జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికలను పరిగణనలోకి తీసుకున్న ఈ విశ్లేషణలో, 26 మంది లోక్‌సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు పార్టీలు మారినట్లు తేలింది. ఈ కేసులలో వ్యక్తిగత పార్టీ ఫిరాయింపులు, పార్టీ విలీనాలు, రాజీనామాల తర్వాత ఉప ఎన్నికలలో గెలవడం, అనర్హత తర్వాత ఉప ఎన్నికలో సీటు గెలవడం వంటివి ఉన్నాయని ఎడిఆర్ తెలిపింది. అత్యధికంగా 32 కేసులు నాగాలాండ్‌లో నమోదయ్యాయి, ఇవన్నీ ఎమ్మెల్యేలకు సంబంధించినవే. ఈ కేసులలో అధికభాగం అధికార నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి), నాగ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) మధ్య జరిగిన పునరేకీకరణకు సంబంధించినవే. ఎడిఆర్ విశ్లేషణలో, ఎన్‌డిఎఫ్ అత్యధిక సంఖ్యలో చట్టసభ సభ్యులను చేర్చుకున్న పార్టీగా నిలిచింది. మొత్తం మీద, పార్టీలు మారిన వారిలో మొదట ఎన్‌డిపిపి నుండి ఎన్నికైన 25 మంది శాసనసభ్యులు ఉండగా, 32 మంది శాసనసభ్యులు ఎన్‌పిఎఫ్‌లో చేరారు. పశ్చిమ బెంగాల్‌లో 20 కేసులు నమోదయ్యాయి, వీరందరూ లోక్‌సభ సభ్యులకు సంబంధించినవారే. ఈ 20 మంది కూడా మొదట ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి) టిక్కెట్లపై ఎన్నికై, ఆ తర్వాత నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లోకి మారారు. ఎన్‌సిపిఐలో విలీనమయ్యామని ఆ ఎంపిలు ప్రకటించగా, ఈ విషయం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ముందు ఉంది. తర్వాత తెలంగాణలో తొమ్మిది కేసులు నమోదయ్యాయి, వీరందరూ ఎమ్మెల్యేలకు సంబంధించినవారే. వీరిలో తొమ్మిది మంది భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నుండి ఎన్నికైన శాసనసభ్యులు కాగా, ఆ రాష్ట్రంలో అత్యధిక శాసనసభ్యులను పొందిన పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. గోవాలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి, వీరిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలోకి మారగా, పంజాబ్‌లో కూడా ఎనిమిది కేసులు నమోదయ్యాయి, వీరిలో ఆరుగురు రాజ్యసభ సభ్యులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. మహారాష్ట్రలో ఆరు కేసులు నమోదయ్యాయి, అన్నింటిలో శివసేన (ఉద్ధవ్ బాలా సాహెబ్ థాక్రే) నుండి ఎన్నికైన లోక్‌సభ సభ్యులు ఉన్నారు, వారు ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి మారారు. మేఘాలయలో ఆరు, మణిపూర్‌లో ఐదు ఎమ్మెల్యే కేసులు నమోదు కాగా, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్‌లలో నాలుగేసి చొప్పున నమోదయ్యాయి. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో రెండేసి కేసులు నమోదు కాగా, కర్ణాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లలో ఒక్కో కేసు నమోదైంది. ఢిల్లీలో ఒక రాజ్యసభ సభ్యుడు పార్టీ మారారు. పార్టీల స్థాయిలో చూస్తే, అత్యధికంగా 25 మంది ఎన్‌డిపిపిలో, ఆ తర్వాత 20 మంది ఎఐటిసిలో, 19 మంది కాంగ్రెస్‌లో పార్టీ మారారు. బిఆర్ఎస్‌లో తొమ్మిది, ఆప్, ఎన్‌సిపిలలో ఏడేసి చొప్పున, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)లో ఆరు, జెడియులో ఐదు, ఎన్‌పిపిలో నాలుగు మంది పార్టీ మారారు. మొత్తం 111 కేసులలో, ఎన్‌డిపిపి, ఎఐటిసి, కాంగ్రెస్‌లలో కలిపి 64 కేసులు, అంటే 58 శాతం నమోదయ్యాయి. కొన్ని రాష్ట్ర శాసనసభలలో ప్రభుత్వాలు పడిపోవడానికి ఇటీవలి ఫిరాయింపులు కూడా ఒక కారణమని ఎడిఆర్ పేర్కొంది.

## పునరుద్ధరించాలి
(మొదటి పేజీ తరువాయి)

విషయంలో తెలంగాణ రాష్ట్రం వెనక్కి తగ్గబోదని, కేంద్రంపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిలకు తుమ్మల నాగేశ్వర్ రావు శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1.29 లక్షల హెక్టార్లలో 88,621 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, వంట నూనెల దిగుమతి ఆధారితను తగ్గించి ఆత్మనిర్భరత సాధించాలన్న కేంద్ర పిలుపునకు స్పందించి, రైతులు తమ భూములను దీర్ఘకాలం సాగుకు కేటాయించి, భారీగా పెట్టుబడులు పెట్టారని గుర్తుచేశారు. ఒకవైపు 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్' ద్వారా సాగును ప్రోత్సహిస్తూ, మరోవైపు దిగుమతి చేసుకునే పామాయిల్ చౌకగా లభించేలా సుంకాన్ని తగ్గించడం దేశీయ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, ఇలాంటి ద్వంద్వ విధానాలు ఉండకూడదని సూచించారు. క్రూడ్ పామాయిల్ దిగుమతి వ్యయం తగ్గితే దేశీయ సిపిఒ ధరలపై ఒత్తిడి వచ్చి, చివరకు రైతులకు అందే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్‌ఎఫ్‌బి) ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

**జాతీయ లక్ష్యాలతో ముడిపడిన అంశం:**

ఆయిల్ పామ్ రైతుల సమస్యను కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా, దేశీయ వంట నూనెల ఉత్పత్తి, రైతుల ఆదాయం,జాతీయ లక్ష్యాలతో ముడిపడిన అంశంగా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోనూ పెద్ద సంఖ్యలో రైతులు ఉన్నందున, రైతుల ప్రయోజనాల కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి తుమ్మల కోరారు.వినియోగదారులకు ధరల్లో ఉపశమనం కల్పించాలనే ఉద్దేశాన్ని అర్థం చేసుకుంటున్నప్పటికీ, ఆ భారాన్ని దేశీయ రైతులపై మోపడం పరిష్కారం కాదని, రైతు వినియోగదారు ఇద్దరి ప్రయోజనాలను సమతుల్యం చేసే విధానం అవసరమని మంత్రి తుమ్మల సూచించారు.దీర్ఘకాలిక పంటల విషయంలో విధాన స్థిరత్వం ఎంతో ముఖ్యమని, తరచూ మార్పులు చేయడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తుందన్నారు.

## నిరసనలు
(మొదటి పేజీ తరువాయి)

కోల్‌కతా, జమ్ముకశ్మీర్ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి. కాగా, రౌస్ అవెన్యూలోని ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లి, ఆ తర్వాత నిర్వాచన్ సదన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. రాజధానిలోని జెజె క్లస్టర్లు, అనధికార కాలనీల నివాసితులపై ఈ సర్ ప్రక్రియ తీవ్ర ప్రభావం చూపిందని పార్టీ ఆరోపించింది. నిర్ణీత గడువులోగా ఎన్నికల కమిషన్ కోరిన పత్రాలను సమర్పించడంలో వీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడింది. ప్రతి ఎన్నికలోనూ బిజెపి 'ఓట్ల దొంగతనం'కు పాల్పడుతోందని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని సుమారు 1.45 కోట్ల మంది ఓటర్లలో 47.6 లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయని, అలాగే 31.6 లక్షల మంది ఓటర్లకు వివరాల సవరణ కోసం నోటీసులు జారీ చేశారని యాదవ్ పేర్కొన్నారు. వివరాల సవరణ కోసం అధికారులు కొందరు ప్రముఖుల ఇళ్లకు స్వయంగా వెళ్లారని, కానీ సాధారణ ఓటర్లు మాత్రం ఆ ప్రక్రియను స్వయంగా పూర్తి చేసుకోవాల్సి వచ్చిందని పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. తల్లిదండ్రుల వయసులో తేడాలు, స్పెల్లింగ్ తప్పులు, చిరునామాల్లో వ్యత్యాసాలు వంటివి కంప్యూటర్ ద్వారా రూపొందించిన డేటాలోని లోపాల వల్ల జరిగి ఉండవచ్చని, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా వీటిని సరిదిద్దాలని ఆయన అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ నిరసన నేపథ్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్, ఎన్నికల కమిషన్ కార్యాలయం బయట పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

**అసోంలో ఉద్రిక్తత**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగింపును డిమాండ చేస్తూ చేపట్టిన నిరసనలో భాగంగా, పోలీసు బారికేడ్లను దాటడానికి ప్రయత్నించిన పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పక్ష ఉపనేత, అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్, పలువురు సీనియర్ పార్టీ నాయకులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గొగోయ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తన రాష్ట్ర ప్రధాన కార్యాలయం 'రాజీవ్ భవన్' నుండి ర్యాలీని ప్రారంభించింది. సిఇసి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లాలని వారు యోచించారు. అయితే రాజీవ్ భవన్ సమీపంలో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. గొగోయ్‌తో సహా నిరసనకారులు వాటిని దాటడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఒక వీడియోలో గొగోయ్ మాట్లాడుతూ, నిరసన తెలపడం 'ప్రజాస్వామ్యయుత చర్య' అని, భారత ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి పట్ల తమ ఆందోళనను వ్యక్తం చేయడానికి సిఇఒ కార్యాలయానికి వెళ్లాలని అనుకున్నామని, కానీ పోలీసులు తమను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. తమను అదుపులోకి తీసుకోవడం ద్వారా తమ గొంతు నొక్కవచ్చని బిజెపి భావిస్తే, అది వారి పొరపాటేనన్నారు. ఇప్పుడు బిజెపి భయపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. కాగా, అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ నాయకులను బస్సులో 4వ అసోం పోలీస్ బెటాలియన్‌కు తరలిస్తుండగా, వారు బిజెపి, సిఇసికి వ్యతిరేకంగా 'బిజెపి గో బ్యాక్', 'జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి' వంటి నినాదాలు చేయడం వినిపించింది. గొగోయ్‌తో పాటు, అదుపులోకి తీసుకున్న వారిలో ఎఐసిసి కార్యదర్శి మనోజ్ చౌహాన్, సేవా దళ్ అధ్యక్షుడు దీప్ బయా న్, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి ఉదిత్ భాను దాస్‌తో పాటు పలువురు ఇతరులు ఉన్నారు.

## పిటిషన్
(మొదటి పేజీ తరువాయి)

చంద్ ఖురేషీ ద్వారా న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌లో పూర్తి ఎన్నికల సంఘం (ఇసి) ఆమోదం లేకుండానే, లేదా ఎన్నికల సంఘం మెజారిటీ అభిప్రాయానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నట్లయితే, అలాంటి నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధమని, ప్రధాన ఎన్నికల కమిషనర్ అధికార పరిధికి మించినవని, చెల్లనివని ప్రకటించాలని కోరారు. అవసరమైన ఏకాభిప్రాయం లేకుండా తీసుకున్నారని ఆరోపించబడిన నిర్ణయాలను సవాల్‌చేయడంతో పాటు, అధికార విధి నిర్వహణలో లోపానికి సంబంధించిన నిబంధనల కింద సిఇసి, ఇతర అధికారులపై క్రిమినల్ విచారణ ప్రారంభించాలని పిటిషనర్ కోరారు. 'ఏ విధమైన చట్టపరమైన, రాజ్యాంగపరమైన మినహాయింపు లేకుండా, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక సాధారణ నిందితుడిలాగే పోలీసు విచారణ, సాక్ష్యాధారాల సేకరణ, సాధారణ విచారణ ప్రక్రియలకు లోబడి చట్ట ప్రకారం నేరుగా, జవాబుదారీగా ఉంటారు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘం పేరుతో తీసుకున్నట్లు ఆరోపించబడిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లిఖితపూర్వక అభ్యంతరాలు నమోదు చేశారని ఒక నివేదిక వెల్లడించిన కొద్ది రోజులకే ఈ పిటిషన్ దాఖలు చేయబడింది. పిటిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం 2023లోని నిబంధనలను ముఖ్యంగా సెక్షన్ 18ను ఆధారంగా చేసుకున్నారు. ఈ సెక్షన్ ఎన్నికల సంఘం ద్వారా నిర్ణయం తీసుకునే అధికారాన్నిఅందిస్తూ, అభిప్రాయ భేదం ఉన్నప్పుడు మెజారిటీ అభిప్రాయమే చెల్లుబాటు అవుతుందని స్పష్ట ంచేసింది. ఇతర ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లకు సంబంధించిన అనేక నిర్ణయాలు తీసుకున్నారని, లేదా అమలు చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. ఓటర్లుగా నమోదు కోరుకునే ప్రజలు ఉపయోగించే ఫారం—6లో మార్పు చేయడం అనేది లేవనెత్తిన ప్రధాన సమస్యలలో ఒకటి. ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన చట్టబద్ధమైన సవరణ లేకుండా, ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్ ద్వారా పూర్వీకుల వివరాలు, మునుపటి ఎస్ఐఆర్‌తో అనుసంధానానికి సంబంధించిన నిబంధనను ప్రవేశపెట్టారని పిటిషనర్ ఆరోపించారు. 'పూర్తి కమిషన్ ఆమోదం లేకుండాఎన్నికల కమిషనర్ల మెజారిటీ అభిప్రాయాలకు విరుద్ధంగా సిఇసి జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన, ఆమోదించిన లేదా అమలు చేసిన అన్ని నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, అధికార పరిధికి మించినవిగా, ఆది నుంచి చెల్లనివిగా ప్రకటిస్తూ మాండమస్ రిట్ లేదా మరేదైనా తగిన రిట్, ఉత్తర్వు లేదా ఆదేశం జారీ చేయాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ మార్పును వ్యతిరేకించారని, చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా నిర్దేశిత ఫారమ్‌ను మార్చలేమని అభిప్రాయపడ్డారని పిటిషన్‌లో తెలిపారు.ఎన్నికల సంఘం డిజిటల్ వ్యవస్థలు నానాటికీ కేంద్రీకృతం అవుతున్నాయని,ఇది క్షేత్రస్థాయిలోని ఎన్నికల నమోదు అధికారులు, ఇతర అధికారుల చట్టబద్ధమైన అధికారాలను పరిమితం చేస్తోందని కూడా ఆరోపించింది. బహుళ సభ్యుల ఎనిక్నల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ 'సమానులలో ప్రథముడు' అని, ఇతర కమిషనర్ల కంటే ఆయనకు ఉన్నతమైన ఓటింగ్ అధికారం కానీ, వీటో అధికారం గానీ లేదని పిటిషనర్ వాదించారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని, అలాగే గోవాలోని 97మంది ఓటర్లను, అదేవిధంగా, ఇతర ప్రాంతాల వ్యక్తులను తిరిగి వారి స్థానాలకు చేర్చాలని పిటిషన్ కోరుతోంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి

### 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి - కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శన

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో రెండో పసిడి పతకం చేరింది. ప్రస్తుత సీజన్ షూటింగ్‌లో తొలి గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ ఈవెంట్ ఫైనల్‌లో భారత జోడీ బలమైన దక్షిణ కొరియా జోడిని ఓడించింది. ఈ క్రమంలో కమల్‌జీత్ సురుచి సింగ్ ద్వయం సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఫైనల్‌లో నాలుగు జట్లు గోల్డ్ మెడల్ పోటీలో నిలిచాయి.ఈ పోటీలో భారత ద్వయం 484.6 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఇక దక్షిణ కొరియా 478.0 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకోగా, ఇరాన్ 415.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఇండోనేసియా 349.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి పతకం లేకుండా వెనుదిరిగింది. అయితే భారత్ 484.6 పాయింట్ల స్కోరు సాధించడంతో ఆసియా రికార్డును కూడా నెలకొల్పింది. ఈ ఈవెంట్‌లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. గతంలో ఈ ఆసియా రికార్డు ఉజ్బెకిస్థాన్ పేరిట ఉండేది. ఆ దేశం ఇదే ఏడాది ఫిబ్రవరిలో 481.3 పాయింట్ల స్కోరును సాధించింది. ఇప్పుడు ఈ రికార్డు కమల్‌జీత్, సురుచి జోడీ బ్రేక్ చేసింది. ఈ ఫైనల్‌లో భారత జోడీ ఆద్యంతం టాప్‌లోనే కొనసాగింది. కమల్‌జీత్ సురుచి అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ జోడీ మొత్తం 58729X స్కోరు సాధించి, ఆసియా క్వాలిఫికేషన్‌లో రికార్డు నెలకొల్పింది. ఈ క్వాలిఫైయర్స్‌లో భారత్ అగ్రస్థానంలో నిలవగా, ఇరాన్ 58417X స్కోరుతో రెండో, దక్షిణ కొరియా 58223X స్కోరుతో మూడో స్థానాన్ని, ఇండోనేసియా 5804X స్కోరుతో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ నాలుగు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ప్రారంభంలో, ఒక్కో సిరీస్‌లో ఐదు షాట్‌ల చొప్పున మూడు సిరీస్‌లు జరిగాయి. 15 షాట్‌ల తర్వాత భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత, ప్రతి రెండు షాట్‌లకు ఒకసారి ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. 17వ షాట్ తర్వాత ఇండోనేసియా నిష్క్రమించడంతో, భారత్‌కు పతకం ఖాయమైంది. 19వ షాట్ తర్వాత ఇరాన్ నిష్క్రమించడంతో, భారత్‌కు కనీసం రజత పతకం ఖాయమైంది. ఇక చివరిదాకా అదే ప్రదర్శన కొనసాగించి కొరియాను కూడా ఓడించడంతో స్వర్ణం దక్కింది.




### పురుషుల 50 మీటర్ల రైఫిల్‌లో భారత్‌కు రజత పతకం

మరోవైపు, పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంక్ష్ పాటిల్, నీరజ్ కుమార్‌లతో కూడిన భారత త్రయం మెరుగైన ప్రదర్శన కనబరిచి భారత్‌కు మరో పతకం ఖాయం చేసింది. క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్లలో నిలకడను కనబరిచిన భారత షూటర్లు, రెండో స్థానాన్ని కైవసం చేసుకుని పోడియంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇక్కడ విశేషమేమిటంటే, ఆ విజయం సాధించిన కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, షూటింగ్‌లోభారత్ పసిడి పతకాన్ని గెలుచుకుంది.

## పోల్ వాల్ట్‌లో భారత్ నవశకం

### తొలి పతకంతో చరిత్ర సృష్టించిన బరానిక




ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో ఎన్నడూ ఆసియాడ్‌లో పతకం గెలవని పోల్ వాల్ట్‌లో అద్భుతం చేసిన భారత్ కాంస్యంతో మెరిసింది. తద్వారా ఈ ఆటలో మన దేశానికి మొట్ట మొదటి పతకం అందించిన అథ్లెట్‌గా బరానిక అవతరించిందీ 29 ఏళ్ల తమిళ వనిత. జపాన్‌లోని నగోయలో మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తున్నారు అథ్లెట్లు. ఒకరితర్వాత ఒకరు పోడియం మీద నిలుస్తూ యావత్ భారతావనిని పులకింపజేస్తున్నారు. మహిళల 10 వేల మీటర్ల పరుగులో నిన్న సీమా కుమారి 16 ఏళ్ల కరువు తీర్చుతూ పతకం ఒడిసిపట్టగా.. ఈసారి బరానిక ఎలంగోవన్ పోల్ వాల్ట్‌లో చరిత్ర లిఖించింది. ఆసియా క్రీడల్లో ఇప్పటివరకూ పోల్ వాల్ట్‌లో ఎవరూ సాధించిన ఘనత సొంతం చేసుకుంటూ పతకంతో మురిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో అబ్బురపరిచే విన్యాసం చేసింది బరానిక. ఒత్తిడిని జయించి.. గుండెనిండా ఆత్మవిశ్వాసంతో 4.15 మీటర్ల ఎత్తు దూకింది. దాంతో.. మూడో స్థానం ఖాయమవ్వగా.. ఈ విభాగంలో భారత్‌కు మొట్టమొదటి పతకం తెచ్చింది.

## షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ కంచుమోత



నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత షాట్‌పూటర్ మన్‌ప్రీత్ కౌర్ మెరిసింది. అంచనాలు నిలబెట్టుకున్న మన్‌ప్రీత్ కౌర్ మహిళల విభాగంలో కాంస్యం కొల్లగొట్టింది. శుక్రవారం ఫైనల్లో ఇనుప గుండును 17.17 మీటర్ల దూరం విసిరిన మన్‌ప్రీత్ కంచు మోత మోగించింది. తద్వారా ఆసియాడ్ మహిళల షాట్‌పుట్‌లో పతకం సాధించిన మూడో భారత మహిళగా చరిత్రకెక్కింది. అంతేకాదు.. ఈ విభాగంలో పతకం గెలిచిన మూడో భారత మహిళగా చరిత్ర లిఖించింది.

## మారథాన్‌లో మెరిసిన గుల్వీర్




జపాన్లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

## సైన్స్


# కణం ఒక యంత్రం

శాస్త్రంలో ఒక స్వయంబలపరిచే చక్రం పనిచేస్తుంటుంది. శాస్త్రవేత్తలు వాస్తవికతను వివరించేందుకు కొన్ని నమూనాలను ప్రతిపాదిస్తారు. ఆ నమూనాలను పరీక్షించేందుకు ప్రయోగ పద్ధతులు, పరికరాలను రూపొందిస్తారు. ఆ పరికరాలు ఏవిషయాలను కనుగొనగలమో నిర్ణయిస్తాయి. అదేసమయంలో మన నమూనాలు మొదట ఏ పరికరాలను రూపొందించాలో నిర్దేశిస్తాయి. ఒక సిద్ధాంత నమూనా చాలాకాలం ఉపయోగకరంగా ఉండవచ్చు. అయితే దాని ప్రాథమిక పరిమితులు బయటపడినప్పుడు దాన్ని పునఃపరిశీలించాల్సి వస్తుంది. కణాన్ని అర్థం చేసుకోవడంలో జీవశాస్త్రం ఇప్పుడు అలాంటి పునఃపరిశీలన చేయాల్సిన దశకు చేరుకుంది. 1961లో ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు ఫ్రాన్స్వా జాకబ్, జాక్వెస్ మోనో జన్యు వ్యక్తీకరణ సూత్రాలను వివరించినప్పుడు, జీవ అణువులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లోని 'షరతుతో కూడిన ప్రకటన' (కండిషనల్ స్టేట్‌మెంట్) మాదిరిగా పనిచేస్తాయని భావించారు. 1973లో భౌతిక శాస్త్రవేత్త చార్లెస్ హెచ్.బెన్నెట్, డిఎన్ఎ నమూనా ఆధారంగా మెసెంజర్ ఆర్ఎన్ఎ తయారు చేసే ఆర్ఎన్ఎ పోలీమెరేస్ అనే ప్రోటీన్‌ను ట్యూరింగ్ యంత్రంతో పోల్చాడు. కానీ ఒక కణాన్ని కంప్యూటర్‌తో సమానమని పోల్చడం పూర్తిగా అసంబద్ధం. ఆవిరిటర్బయిన్ వంటి యంత్రంలోని ప్రతిభాగాన్ని విడివిడిగా అధ్యయనం చేసి మొత్తం యంత్రాన్ని అర్థం చేసుకోవచ్చు. కణానికి ఆ పద్ధతి పూర్తిగా సరిపోదు. ఒక కణంలో కోట్లాది, బిలియన్ల కొద్దీ పరస్పరం ప్రభావితం చేసుకునే అణువులు ఉంటాయి. వాటి ప్రవర్తన పరిసర పరిస్థితులను బట్టి నిరంతరం మారుతుంది.



కణం ఒక యంత్రం అనే మానసిక నమూనా జీవశాస్త్రంలో ఉపయోగించిన పరికరాలు, పరిశోధనా పద్ధతులపైనా ప్రభావం చూపింది. ఉదాహరణకు ప్రోటీన్లు ఘనపదార్థాల కంటే ద్రవాల్లా ప్రవర్తిస్తాయి. కణంలో అవినిరంతరం కదులుతూ, కొద్దిగా భిన్నమైన డజన్ల నుంచి వందల ఆకృతులను స్వీకరిస్తాయి. కానీ మనం వాటి గురించి రూపొందించే స్థిరమైన చిత్రాలు వాటి వాస్తవ స్వభావాన్ని వక్రీకరించవచ్చు. జాన్‌కెండ్రూ మొదటిసారిగా ఒక ప్రోటీన్ యొక్క అణు నిర్మాణాన్ని వెల్లడించాడు. వేల్స్ నుంచి లభించిన మయోగ్లోబిన్ నమూనాలను సేకరించి, వాటిని స్ఫటికాలుగా మార్చి, ఎక్స్రే కిరణాలతో పరిశీలించి, వచ్చిన 'డిఫ్రాక్షన్' నమూనాల ఆధారంగా ప్రోటీన్‌కు ఒక స్థిరమైన త్రిమితీయ రూపాన్ని అందించాడు. ఆ చిత్రాలు శాస్త్రానికి అపారమైన ఉపయోగం చేశాయి. అయితే అవి కణంలోని ప్రోటీన్ యొక్క నిరంతర చలనశీలతను చూపించలేవు. ఒంటరిగా అణువులను అధ్యయనం చేయడం వల్ల కణం గురించి అసంపూర్ణ దృశ్యం ఏర్పడుతుంది. గతంలో జీవ అణువులను అవి సహజంగా ఉన్న పరిస్థితుల్లో, స్థలం మరియు కాలంతో పాటు అధ్యయనం చేయడానికి తగిన పద్ధతులు చాలాతక్కువగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. కొత్త సాంకేతికతలు కణాలను మనిషి నిర్మించిన యంత్రాల కంటే ఎంతో సంక్లిష్టమైన, చలనశీలమైన వ్యవస్థలుగా చూపిస్తున్నాయి. దీనికి 'ట్రాన్స్‌క్రిప్టోమిక్స్' ఒక మంచి ఉదాహరణ. ఈ పద్ధతి మెసెంజర్ ఆర్ఎన్ఎ పరిమాణాన్ని కొలుస్తుంది. సాధారణ ప్రయోగంలో కోట్లాది కణాలను పెంచి, ఒక నిర్దిష్ట సమయంలో వాటిని పగులగొట్టి, ఆర్ఎన్ఎను వెలికితీసి, డిఎన్ఎ కాపీలుగా మార్చి, ప్రతి క్రమం ఎంత ఉందో లెక్కిస్తారు. ఈ పద్ధతి పిండం అభివృద్ధిలో పనిచేసే జన్యువులను, సూక్ష్మ జీవుల్లో యాంటీబయాటిక్ నిరోధకతకు కారణమయ్యే జన్యువులను గుర్తించడంలో ఉపయోగపడింది. అయితే దీనికి రెండు ప్రధాన పరిమితులు ఉన్నాయి. కణాలను పగులగొట్టిన ఆ ఒక్క క్షణంలోని ఆర్ఎన్ఎ పరిమాణమే నమోదవుతుంది. కానీ కణాలు నిరంతరం జన్యువ్యక్తీకరణను పెంచుతూ, తగ్గిస్తూ ఉంటాయి. ఆ చలనశీలత కనిపించదు. రెండోది, కోట్లాది కణాల్లోని ఆర్ఎన్ఎ పరిమాణాలను విశ్లేషించి, సగటు పరిణామాలను ఖరారు చేస్తారు. దాంతో ఒక్కో కణం మధ్య తేడాలు కనుమరుగవుతాయి. ఫలితంగా ఆర్ఎన్ఎ పరిమాణం స్థిరంగా ఉన్నట్టుగా కనిపిస్తుంది. వాస్తవానికి ఒక కణం నుంచి మరొక కణానికి 'జీన్ఎక్స్‌ప్రెషన్' గణనీయంగా మారవచ్చు.

కణాల స్థూల అధ్యయనాన్ని అంధులు ఏనుగును తడిమి దాని స్వరూపాన్ని అంచనా వేసే కథతో పోల్చవచ్చు. ఒకడు తొండాన్ని తాకి దాన్ని మందమైన పాముగా భావిస్తాడు. మరొకడు చెవిని తాకి విసనకర్రగా చెబుతాడు. ఇంకొకడు కాలును తాకి చెట్టులా ఉందంటాడు. ప్రతి ఒక్కరి పరిశీలనలో కొంత నిజం ఉన్నప్పటికీ, మొత్తం ఏనుగును ఎవరూ చూడలేదు. కణాన్ని విడివిడిగా భాగాలుగా అధ్యయనం చేయడం కూడా ఇలాంటిదే. సంపూర్ణ దృశ్యం వచ్చినప్పుడే వాస్తవ అవగాహన ఏర్పడుతుంది. కొత్త పద్ధతులు ఇప్పుడు డిఎన్ఎ, ఆర్ఎన్ఎ ప్రోటీన్లను వాటి సహజ సందర్భాల్లో పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. డిఎన్ఎ విషయంలో మానవ జన్యుక్రమంలోని సుమారు 3.2 బిలియన్ డిఎన్ఎ అక్షరాలను గుర్తించేందుకు హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్టు ప్రారంభమైంది. 2003లో దాని మొదటి ముసాయిదా వెలువడింది. అయినప్పటికీ డిఎన్ఎ సీక్వెన్స్ అంటే అక్షరాల వరుస మాత్రమే. ఆ అక్షరాలకు అర్థం ఎలా వస్తుందన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాలంటే డిఎన్ఎ భౌతిక నిర్మాణాన్ని కూడా చూడాలి. హెచ్ఐసి వంటి విధానాలు డిఎన్ఎలోని క్రోమోజోమ్ భాగాలు త్రిమితీయ ప్రదేశంలో ఎలా ముడుచుకుని, పరస్పరం ఎలా తాకుతాయో వెల్లడించాయి. కొన్ని కేన్సర్లు, అభివృద్ధి సంబంధిత రుగ్మతలు జన్యు



వులు సరిగ్గా ముడుచుకోకపోవడం వల్ల కూడా ఏర్పడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే డిఎన్ఎ అర్థాన్ని దాని రసాయనక్రమం మాత్రమే నిర్ణయించదు. దాని త్రిమితీయ అమరిక కూడా కీలకమే. ఆర్ఎన్ఎ విషయంలో 'సింగిల్‌సెల్ ట్రాన్స్‌క్రిప్టోమిక్స్' ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది కోట్లాది కణాల సగటు కాకుండా ఒక్కో కణంలోని ఆర్ఎన్ఎను విడిగా కొలుస్తుంది. అయితే ఇది కూడా ఒక నిర్దిష్ట సమయంలోని స్థితినే చూపిస్తుంది. 2019లో స్విట్జర్లాండ్‌లోని పరిశోధకులు 'లైవ్‌సెక్' అనే పద్ధతిని అభివృద్ధి చేశారు. కణాన్ని విడగొట్టకుండానే, దాని నుంచి అతి స్వల్ప పరిమాణంలో ఆర్ఎన్ఎను తీసుకుని విశ్లేషించే విధానాన్ని కనుగొన్నా రు. అదే కణం నుంచి మళ్లీ మళ్లీ నమూనాలు తీసుకోవడం ద్వారా కాలక్రమంలో ఆర్ఎన్ఎ ఎలా మారుతుందో గమనించవచ్చు. మానవ రోగనిరోధక వ్యవస్థలోని 'మాక్రోఫేజెస్'ను అధ్యయనం చేసినప్పుడు, ప్రతి కణం బ్యాక్టీరియా సంకేతానికి ఒకే విధంగా స్పందించదని, కణ జీవచక్రంలోని దశను బట్టి స్పందన మారుతుందని ఈ పద్ధతి చూపించింది.

# జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులు జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి అని, అతడిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేవిధంగా వ్యవహరించిన జ్ఞానేష్ కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి బిజెపికి అనుకూలంగా వ్యవహరించి ఫలితాలను తారుమారు చేసిన జ్ఞానేష్ కుమార్ దేశ ఎన్నికల చరిత్రకు తీరని కలంకాన్ని తీసుకువచ్చారన్నారు. బిజెపి మూడవ సారి గెలుపు కోసం అడ్డదారులు తొక్కిందని ఆది నుంచి ఆరోపిస్తున్నట్లుగానే ఎన్నికల కమిషన్ ఏర్పాటులో కొత్త నిబంధనలను తీసుకువచ్చిందన్నారు. 2004 పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో పాటు జ్ఞానేష్ కుమార్ ఎన్నికల సంఘం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉన్న భారత్‌లో ఇవిఎంల ద్వారా ఫలితాన్ని మార్చివేశారని ప్రజల అభిప్రాయం ప్రస్ఫూటం కాలేదన్నారు. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని దేశ వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా పన్నులు విధిస్తుందని గతంలో జిఎస్‌టి పేరుతో దోపిడీ చేసిన ప్రభుత్వం యుపిఐ ఛార్జీల ద్వారా ప్రజల నడ్డివిరిచేందుకు ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు. బిజెపి దేశ ప్రజల పక్షాన కాకుండా కార్పొరేట్ల పక్షాన పాలన చేస్తుందని అతి కొద్ది మంది కోసమే మోదీ ప్రధానిగా వ్యవహరిస్తున్నారన్నారు. మోదీ 12 ఏళ్ల పాలనలో పేద, సామాన్య ప్రజలకు అనుకూలంగా ఒక చట్టం తేకపోగా అనుకూలంగా ఉన్న చట్టాలను మార్పు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. గడిచిన కొన్ని రోజులుగా భూ సమస్యలు ముఖ్యంగా 22ఎ పై రాష్ట్రం అట్టుడుకుతుందని ఆయన తెలిపారు. భూ సమస్యకు నిర్దిష్ట పరిష్కారం చూపాలని మూడు ప్రధాన పార్టీలు అయినా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పరస్పర ఆరోపణల నడుమ ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత దూషణ బీషణలు ఎజెండాపైకి వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏఒక్క హామీని సరైన రీతిలో అమలు చేయలేదని, ముఖ్యంగా పింఛన్లు, ఇందిరమ్మ భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.




# కార్మిక హక్కులు హరిస్తున్న మోదీ సర్కార్

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బందరపు వెంకటేశం




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కేంద్రంలోని మోదీ సర్కార్ నూతన చట్టాలు, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులు హరిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బందరపు వెంకటేశం ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఎఐటియుసి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారి భువనగిరికి వచ్చిన బందారపు వెంకటేశంకు ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమాన్ని కాపాడేందుకు ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, కార్మిక హక్కులకు భంగం కలిగించే చర్యలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని వెంకటేశం పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలు, యాజమాన్యాలపై నిరంతరం ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎఐటియుసిని మరింత బలోపేతం చేసేందుకు ముందుకు సాగాలని నాయకులకు సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బందారపు వెంకటేశంకు జిల్లా నాయకులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో ఎఐటియుసి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఐటియుసి యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, కోశాధికారి సామల శోభన్ బాబు, నాయకులు తిరుమలేష్, శ్రీనివాస్, పిన్నం జగన్, లింగాల నరసింహా, పర్వతాలు, రాములు, అశోక్, రమేష్, రవి, కృష్ణ, వెంకటేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.




## భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 27 నుండి 30 వరకు జరిగే భగత్‌సింగ్ 119వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బిక్షపతి, అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ఎఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ఎ.స్టాలిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ మత చాందసవాద విధానాలు, సామ్రాజ్యవాద దోపిడీ పాలసీపై పోరాటం చేసేందుకు యువతరం షహీద్ భగత్‌సింగ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతరాల వ్యవస్థను ధ్వంసం చేస్తూ, సమాజ మార్పు కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తాటికంటి మమత, గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు తదితరులు పాల్గొన్నారు.




### వ్యవసాయానికి రోజుకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించి..

# ఎండుతున్న పంటలను కాపాడాలి

### సిపిఐ నేత పల్లా నర్సింహారెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎండుతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం రోజుకు కనీసం 16 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ ఎడిఇ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్ద ఎత్తున జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఒకవైపు ఎల్‌నిఒ ప్రభావం, మరోవైపు విద్యుత్ కొరత రోజుకు 7 నుండి 9 గంటల వరకు మాత్రమే కరెంటు ఇస్తున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించి నీటిని ఆదాచేసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపి ఉంటే ప్రస్తుతం రైతులకు ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యవసాయానికి అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరయాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని, మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదని, పంటల సాగుకు అవసరమైన నీరు, విద్యుత్ అందించి వ్యవసాయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దేశంలోని అనేక ప్రాంతాలలో ఎల్‌నిఒ ప్రభావం ఉన్నప్పటికి తెలంగాణలో రైతులు పంటలు సాగు చేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడడం ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపానికి నిదర్శనమన్నారు. వ్యవసాయానికి రోజుకు కనీసం 16 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయాలు లేకుండా నిరంతర సరఫరా చేయాలన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రత్యేక పరిహారం ప్యాకేజీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షభావ పరిస్థితులలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. ప్రజల కోసం అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి విద్యుత్ కొనుగోలు చేయాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకటయ్య, వెంకటయ్య, జయరాములు, విజేందర్ రెడ్డి, శైలేష్, రామస్వామి, రంగారెడ్డి, నాయకులు రామాంజనేయులు, అంజల్‌రావు, ఆంజనేయులు, నవీన్, వినయ్, దేవీలాల్, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.




## విద్యా వ్యవస్థపై పాలకుల నిర్లక్ష్యం

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/బోడుప్పల్(హైదరాబాద్) :** విద్యా వ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, అన్నారు. శుక్రవారం బోడుప్పల్ సర్కిల్‌లో జరిగిన ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప్పల్ డిపో వద్ద ఉన్న ది వ్యూ ఫంక్షన్ హాలు ప్రాంగణంలో జరిగిన మహాసభల్లో అరుణపతాకాన్ని సిపిఐ మేడ్చల్ కార్యదర్శి ఉమా మహేష్ఉ అవిష్కరించారు. మహాసభలో పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాలను వివరించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లల్లో వసతుల లేమి, నిరుద్యోగం వంటి అంశాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించాలన్నారు. విద్య ప్రతి పేద విద్యార్థికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారించే వరకు విద్యార్థి నాయకులు విశ్రమించొద్దన్నారు. మహాసభలో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నబాబు, ఎండి అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు శ్రీకాంత్, బద్రి, సద్గురు చారి, శివమణి, ప్రణవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





## డ్రగ్స్ నియంత్రణలో దేశానికి రాష్ట్రం ఆదర్శం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారని డిజిపి సి.వి.ఆనంద్ అన్నారు. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన 10 కీలక అంశాల్లో తెలంగాణ పోలీసులు ఆరింటిలో అత్యుత్తమ పనితీరు కనబరిచారని తెలిపారు. శుక్రవారం డిజిపి కార్యాలయంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన పనితీరును సమీక్షించారు. డ్రగ్స్ కేసుల్లో అరెస్టుల విషయంలో తెలంగాణ జాతీయ సగటు కంటే ముందుందని అధికారులు వివరించారు. దేశవ్యాప్తంగా ఒక్కో కేసుకు సగటున 1.3 మంది అరెస్టు అవుతుండగా, తెలంగాణలో ఈ సంఖ్య 3.7గా ఉందన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాతో సంబంధం ఉన్న ఆస్తుల స్వాధీనంలోనూ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఈగల్ ఫోర్స్ దర్యాప్తు విస్తరించింది. థాయిలాండ్, గోవా, ముంబయి తదితర ప్రాంతాల్లో ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ విక్రయించే నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టి 500 కిలోలకు పైగా డ్రగ్స్‌కు సంబంధించిన 15కు పైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తు, అరెస్టులు, ఆస్తుల స్వాధీనం, అంతర్జాతీయ దర్యాప్తు, డార్క్‌వెబ్ విశ్లేషణ, భారీగా డ్రగ్స్ స్వాధీనం వంటి ఆరు అంశాల్లో తెలంగాణ ముందంజలో ఉందని డిజిపి పేర్కొన్నారు. మిగిలిన అంశాల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు.యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. నషాముక్తి తెలంగాణ–నషాముక్తి భారత్ లక్ష్యంతో సమష్టిగా పనిచేద్దాం. డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలపాలి అని సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు.

## బాధ్యతారాహిత్యంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు : కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, దేశ ప్రధాని, హోంమంత్రులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ఆయన మానసిక అసహనానికి నిదర్శనమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. వరుస ఓటములతో మతిస్థిమితం కోల్పోయిన రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లుతున్నారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాల్సింది పోయి, కాంగ్రెస్ నాయకత్వం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణలో గెలిచిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకోవడమే నిజమైన 'ఓట్ చోరీ' అని విమర్శించారు. ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు, ఈవిఎంలు, చివరకు దేశాన్ని కాపాడే సాయుధ బలగాలను కూడా విశ్వసించని రాహుల్ గాంధీ అసలు ఎవరిని నమ్ముతారని ప్రశ్నించారు.

## తూవూంబా మేయర్‌తో రాంచందర్ రావు భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు శుక్రవారం ఉదయం తూవూంబా మేయర్ జెఫ్ మెక్‌డోనాల్డ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే సి.హెచ్.మల్లారెడ్డి కూడా రాంచందర్ రావుతో పాటు పాల్గొన్నారు. స్థానిక భారతీయ సామాజిక వర్గ నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తూవూంబా నగర అభివృద్ధి, అక్కడ పెరుగుతున్న భారతీయ సామాజిక వర్గం, నగర సామాజిక, ఆర్థిక రంగాల్లో భారతీయుల పాత్రపై నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. మేయర్‌తో పాటు స్థానిక భారతీయ సమాజం చూపిన ఆదరణపై రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య నెలకొన్న బలమైన ప్రజల మధ్య సంబంధాలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నేరస్తుడికి శిక్ష పడినప్పుడే పోలీసులకు అసలైన ఆనందం అని పెద్దపల్లి డిసిపి భూక్య రాంరెడ్డి పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి పెద్దపల్లి ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధించడం పోలీసుల పకడ్బందీ దర్యాప్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. 2024 జూన్ 13 రాత్రి జరిగిన ఈ దారుణ ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఇంటి వద్ద ఉన్న బాలికను నిందితుడు బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ఎసిపి గజ్జి కృష్ణ నేతృత్వంలోని దర్యాప్తు బృందం సిసిటివి ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా సేకరించింది. ప్రతి ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించి నేరాన్ని సందేహాతీతంగా రుజువు చేసింది. దర్యాప్తులో సమర్పించిన పక్కా ఆధారాలను పరిశీలించిన పెద్దపల్లి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.స్వప్నరాణి నిందితుడికి జీవిత ఖైదు, రూ.28 వేల జరిమానా విధించారు. అలాగే బాధిత బాలిక కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు.

## సిద్దిపేటలో నిందితుడికి 20 ఏళ్లు శిక్ష

**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలికను కిడ్నాప్, పోక్సో కేసులోని నిందితుడు కొమ్ముగళ్ల బాలకృష్ణ(35) అనే వ్యక్తికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో జనవరి 27, 2018న కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేయడమైనది. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు వాదనలు వినిపించగా, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ పి.మహేందర్ రెడ్డి, సాక్షాలు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ బాపురెడ్డి, భరోసా ఇన్చార్జ్ అధికారి ఇన్‌స్పెక్టర్ బి.దుర్గా, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం న్యాయమూర్తి వై.జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల శిక్షతో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రశ్మి పెరుమాళ్ అభినందించారు. సమాజంలో మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, నేరస్థులకు శిక్ష పడేలా చేయడంలో రాజీ పడబోమని ఈ సందర్భంగా సిపి స్పష్టం చేశారు.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

- డిజిపి సి.వి.ఆనంద్
- రాష్ట్రవ్యాప్తంగా 1.24 లక్షల విగ్రహాలు నమోదు.. 88 వేల నిమజ్జనాలు పూర్తి
- హైదరాబాద్‌లో 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు
- శనివారం ఉదయం 10.30 గంటల్లోపు పూర్తి చేసేలా చర్యలు
- ఉత్సవాల్లో 13 మంది మృతి, 26 మందికి గాయాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణనాథుడి నిమజ్జనాలతో తెలంగాణ భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా సాగుతున్నాయని డిజిపి సి.వి. ఆనంద్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సమైక్యత, సోదరభావంతో ఉత్సవాలను నిర్వహించారని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు కొనసాగడం తెలంగాణ ప్రజల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ పోర్టల్‌లో 1.24 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని డిజిపి తెలిపారు. గతేడాది 1.15 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని, ఈసారి సంఖ్య మరింత పెరిగిందన్నారు. ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలే పోర్టల్‌లో నమోదయ్యాయని, అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, ఇతర వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు విగ్రహాలు ఉండే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని డిజిపి వెల్లడించారు. మిగిలిన విగ్రహాల నిమజ్జనాన్ని శనివారం ఉదయం నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు ఒకేసారి నిమజ్జన ప్రాంతాలకు తరలిరావడంతో కొంత ఆలస్యం జరుగుతోందన్నారు. శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ నగరంలో శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని డీజీపీ తెలిపారు. దీంతో నిమజ్జన ప్రక్రియ కూడా కొంత ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తున్నందున ప్రక్రియకు సమయం పడుతోందని వివరించారు. హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ సిపి, జిహెచ్‌ఎంసి కమిషనర్, కలెక్టర్ తదితర అధికారులతో కలిసి ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల పరిధి విస్తరించడంతో ఆయా ప్రాంతాల నుంచి విగ్రహాల తరలింపునకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గిస్తూ నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**అదనపు బలగాల మోహరింపు..**
శాంతిభద్రతల పరిరక్షణ కోసం టిజిఎస్‌పి, ఆర్‌ఎఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఆక్టోపస్ బలగాలను రంగంలోకి దించినట్లు డిజిపి తెలిపారు. డిజిపి రిజర్వ్ నుంచి ఐదు కంపెనీలను కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో భారీగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రాల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. క్రేన్లు, ఇతర అత్యవసర సేవలను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

**ఉత్సవాల్లో 13 మంది మృతి.. 26 మందికి గాయాలు..**
గణేష్ ఉత్సవాల సందర్భంగా గత పది రోజుల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డిజిపి ఆవేదన వ్యక్తం చేశారు. నిమజ్జన విధుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన కొత్తగూడెం ఎస్సై వెంకన్న మృతి తీవ్రంగా బాధించిందన్నారు. సైబరాబాద్ పరిధిలోని పటాన్‌చెరులో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఖైరతాబాద్‌లో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఒకరు మృతి చెందగా, నిర్మల్‌లో గుండెపోటుతో మరొకరు మృతి చెందినట్లు తెలిపారు. డిజె శబ్దాల కారణంగా కూడా కొందరు మృతి చెందినట్లు వెల్లడించారు. ఉత్సవాలు, నిమజ్జనాల సందర్భంగా జరిగిన ప్రమాదాల్లో మొత్తం 26 మంది గాయపడగా, మల్కాజిగిరిలో 17 మంది గాయపడ్డారని డిజిపి తెలిపారు. ప్రజలు శబ్ద కాలుష్యాన్ని తగ్గించి, నిబంధనలు పాటించాలని సూచించారు. శనివారం ఉదయం 10.30 గంటల్లోపు నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

# వెల్ఫేర్ స్కీమ్ పేరుతో బంగారం దోపిడీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెల్ఫేర్ సంస్థ, సభ్యత్వం, ఉచిత ఇఎంఐ పేరుతో బంగారం డిపాజిట్ చేయించుకుని కోట్ల విలువైన ఆస్తులు, బంగారు ఆభరణాలు, నగదు వసూలు చేసి తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మొత్తం 680 గ్రాముల బంగారం విలువ సుమారు రూ.53.04 లక్షలు కాగా, అదనంగా రూ.35 లక్షలు, ఫ్లాట్ రిజిస్ట్రేషన్ పేరుతో మరో రూ.10 లక్షలు, ఇంటీరియర్స్ కోసం సుమారు రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు బాధితురాలు ఆరోపించింది. తన కుమారుడు వసీమ్ ఖాన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో గ్రేస్ దావినా గంజి, జాన్ సుధీర్ గంజి, నళిని తనకు పరిచయమయ్యారని, మహిళలు, బాలికల సంక్షేమ సంస్థలతో సంబంధాలున్నట్లు చెప్పి తన నమ్మకాన్ని పొందారని ఆమె ఆరోపించారు. తనకు ఫ్లాట్ ఇప్పిస్తామని, అందుకు 450 గ్రాముల బంగారాన్ని ఫిక్సడ డిపాజిట్‌గా, అనంతరం నెలకు సుమారు 230 నుంచి 250 గ్రాముల బంగారాన్ని డిపాజిట్ చేయాలని, 15 నుంచి 18 రోజుల్లో తిరిగి ఇస్తామని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో జనవరి 2025లో 450 గ్రాములు, తొలి విడతగా మరో 230 గ్రాములు కలిపి మొత్తం 680 గ్రాముల బంగారాన్ని గ్రేస్ దావినా గంజికి అప్పగించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లాట్ తాళాలు ఫిబ్రవరి 4న తనకు అందాయని, మరుసటి రోజే తన కుమారుడు మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో కూడా నిందితులు తమను నమ్మించారని ఆరోపించారు. ఫ్లాట్‌లో ఇంటీరియర్స్, ఫర్నిచర్ కోసం సుమారు రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు షబానా పేర్కొన్నారు. అనంతరం 680 గ్రాముల బంగారాన్ని విడిపించేందుకు రూ.35 లక్షలు అవసరమని చెప్పడంతో వివిధ దశల్లో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.2 లక్షల నగదు, రూ.8 లక్షలు ఆన్‌లైన్ బదిలీ చేసినట్లు తెలిపారు. అదనంగా ఫ్లాట్ ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ఛార్జీల పేరుతో మరో రూ.10 లక్షలు గ్రేస్ దావినా గంజి ఖాతాకు బదిలీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుల చేతుల్లో ఇలాంటి బాధితులు చాలా మంది ఉన్నారని సమాచారం. సిసిఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్యులు, నర్సులతో పాటు ఫార్మసిస్టులు ఆరోగ్య రంగంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన మందులు అందించడంలో, సరైన మోతాదులో మందుల వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల సేవలు అమూల్యమైనవన్నారు. ''ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ'' సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫార్మసిస్టులతో కలిసి శుక్రవారం కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫార్మసిస్టులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ వృత్తిని మరింత బలోపేతం చేస్తున్నామని, నాణ్యమైన మందుల లభ్యతను మెరుగుపర్చేందుకు, ఫార్మసీ విద్యను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతంలో భాగంగా ఆసుపత్రుల్లో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల లోని మెడికల్ స్టోర్లలో ఫార్మసిస్టుల నియామకాలను దశల వారిగా భర్తీ చేస్తున్నామన్నారు.

# రేపు ఎస్‌టియు 80 వసంతాల ఉత్సవాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) ఏర్పడి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27న '80 వసంతాల వైభవోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్కలతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పలువురు ఎమ్మెల్యేలు, విద్యాశాఖ అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1946లో ఆవిర్భవించిన ఎస్‌టియు, భారతదేశంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘంగా ప్రత్యేక చరిత్రను కలిగి ఉందని వారు గుర్తుచేశారు. ఎనిమిది దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం సంఘం నిరంతరం కృషి చేస్తూ, అనేక ఉద్యమాలు మరియు కార్యక్రమాలకు నాయకత్వం వహించిందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల, ఉపాధ్యాయుల వృత్తిపరమైన గౌరవం, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో సంఘం తనదైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 80 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, భవిష్యత్లో ఉపాధ్యాయుల సంక్షేమం మరియు విద్యారంగ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా ఈ వేడుకల్లో చర్చించనున్నట్లు తెలిపారు. వైభవోత్సవ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, సంఘ నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని, సుమారు 10,000 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

## పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం



**వాజేడు :** ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ బొగత జలపాతం గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్ర ఉధృతితో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో జలపాతం నిండుకుండలా మారి ఉగ్రరూపం దాల్చింది. పచ్చని అటవీ అందాల నడుమ కొండకోనల నుంచి నురగలు కక్కుతూ ఐరావతాన్ని తలపించేలా పడుతున్న జలధారలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భారీ ప్రవాహం కారణంగా, వరద నీరు ప్రమాదకర స్థాయిలో ఉండటంతో అటవీశాఖ మరియు పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యాటకులు ఎవరూ నీటిలోకి దిగవద్దని, జాగ్రత్తలు పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణలోనే రెండో అతిపెద్ద జలపాతంగా పేరుగాంచిన ఈ 'తెలంగాణ నయాగరా' అందాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.

# హనుమకొండ వడ్డేపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

అగ్నికి ఆహుతైన సరస్వతి ఎంటర్ ప్రైజెస్ ,సుమారు రూ.4కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో వడ్డేపల్లి జవహర్ నగర్ క్రాస్ వద్ద భూక్య బద్రు నాయక్‌కు సంబంధి ంచిన సరస్వతి ఎంటర్ ప్రైజెస్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది.అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుంచి అగ్ని పొరలు బయటికి వచ్చి ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది అధికారి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి నుంచి ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులో తెచ్చే ప్రయత్నం చే స్తున్నారు. విషయం తెలుసుకున్న సుబేదారి సర్కిల్ ఇన్‌స్పెక్ట ర్ రంజిత్ కుమార్ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపులో వచ్చేలా చేస్తున్నారు.దాదాపు నాలుగు కోట్ల ఆస్తినట్టం జరిగినట్టు అంచనా సామాన్య గిరిజన కుటు ంబం నుంచి మారుమూల తండా నుంచి వచ్చిన భూక్య బద్రు నాయక్ వ్యాపారం ఒక్కసారిగా కుప్ప కూలిపోవడంతో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు అందరూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ నేత ఆంగోత్ వినోద్ లోక్ నాయక్, మాజీ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్, కాకతీయ యూనివర్సిటీ జెఎసి నేత రాజు నాయక్ వెంటనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ విచారణ చేసి తక్షణమే ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బద్రునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# 'నిర్మల్'లో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా!

- అధికారుల ఉదాసీనతతో పక్కదారి పడుతున్న సహజ వనరులు
- జాతీయ రహదారి పక్కనే ఉన్న చిట్యాల వాగులో పేట్రేగి పోతున్న మాఫియా



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ప్రభుత్వం ఎంతగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో నియమావళి కాగితాలకే పరిమితమవుతోంది. జిల్లా కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్యాల వాగు ఇ సుక అక్రమార్కులకు కాసుల వర్షం కురిపించే కామధేనువుగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు వాగులోకి దిగి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తోడేస్తున్నాయి.

**కళ్లెదుటే దోపిడీ – కరువైన పర్యవేక్షణ :** ఏకంగా జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఈ అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతున్నప్పటికీ, సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణించే ప్రధాన రహదారి పక్కనే ఈ ఘాతుకం సాగుతున్నా చూసీచూడనట్లు ఉండటం వెనుక భారీ స్థాయిలో మామూళ్లు నడుస్తున్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారుల ఈ ఉదాసీనతను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు లక్షలాది రూపాయల అక్రమ సంపాదనను ఆర్జిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గ్రామాల వారీగా అక్రమ డంపింగ్ కేంద్రాలుఇసుక మాఫియా కేవలం వాగుల నుండి ఇసుకను తోడటంతోనే ఆగడం లేదు. అధికారుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి, అలాగే భవిష్యత్తులో కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయించడానికి పరిసర గ్రామాలను అక్రమ నిల్వ కేంద్రాలుగా (డంపింగ్ యార్డులుగా) మార్చేశారు. చిట్యాల వాగు నుంచి ఇసుకను తరలించి మంజులాపూర్ చివరి ప్రాంతం, తాంసి, జఫ్లాపూర్, వెంగపేట్, ఆలూర్ వంటి గ్రామాల్లో పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారు. పగటిపూట రహస్యంగా నిల్వ చేసి, రాత్రి వేళల్లో అనుకూల సమయం చూసుకుని వినియోగదారులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.10 వేల వరకు వసూలు :** సొంతంగా ఒక చిన్న ఇల్లు నిర్మించుకోవాలని భావించే సామాన్య గృహ నిర్మాణదారులు, పేద ప్రజలు ఇసుక దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అవకాశంగా భావిస్తున్న అక్రమార్కులు సాధారణ ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని విపరీతంగా దోపిడీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో తక్కువ ధరకు లభించాల్సిన ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.8,000 నుంచి రూ. 10,000 వరకు విక్రయిస్తూ అడ్డగోలు లాభాలు గడిస్తున్నారు. రేటు ఎందుకు ఎక్కువ అని అడిగితే మాకు పైస్థాయి వరకు ఖర్చులు ఉంటాయి అని సమాధానం ఇస్తూ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు.

**పర్యావరణానికి విఘాతం – అధికారుల స్పందన కరువు :** వాగుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తుండటం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు వట్టిపోతుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే చిట్యాల వాగుతో పాటు మంజులాపూర్, తాంసి, జఫ్లాపూర్, వెంగపేట్, ఆలూర్ గ్రామాల్లో ఉన్న అక్ర మ డంపింగ్‌లపై దాడులు చేసి ఇసుకను సీజ్ చేయాలని, ఇసుక మాఫియాపై కఠినమైన పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని నిర్మల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## చెరువులను సందర్శించిన ఎంఎంసి కమిషనర్


**ప్రజాపక్షం/చర్లపల్లి:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, గణేష్ నిమజ్జన ఏర్పాట్లనులో భాగంగా కాప్రా, చర్లపల్లి చెరువులను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాఫీగా, సురక్షితంగా జరిగేలా చూడాలని అన్నిశాఖల అధికారులు, సిబ్బందికి ఆదేశించారు.నిమజ్జన వేడుకలు ప్రశాతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయలన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీంద్రసాగర్, డిఇ బాల కృష్ణ,ఎఇలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రశాంత వాతావరణంలో గణపతి నిమజ్జన కార్యక్రమాలు

### కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రశాంతత వాతావరణంలో గణపతి నిమజ్జన ఉత్సవాలను జరుపుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ ప్రగతినగర్‌లో రెండవ డివిజన్ మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రులను పూర్తి చేసుకున్న అనంతరం శుక్రవా రం గణపతి హోమం, కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు జోరుగా జరిగాయి. అనంతరం గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. నిజ్జనానికి ముందుగా గణపతి లడ్డూ వేలం వేయకుండా యాబై రూపాయల టిక్కెట్‌ని ఏర్పాటు చేసి డ్రాని తీశారు. అదృష్టవంతులైన వారికి యాబై రూపాయల టిక్కెట్ ద్వారా గణపతి లడ్డూని దక్కించుకునే అదృష్టాన్ని మాజీ కార్పొరేటర్ దివాకర్ కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి విచ్చేసి గణపతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, మత సామరస్యానికి ప్రతీకలు పండుగలని, కాలనీలు, బస్తీలలో పండుగలను కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. ఆ గణపతి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, పెద్దఎత్తున మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## 28న రైతు సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రైతు సేవా సహకార సంఘం 50వ స్వర్ణోత్సవాల సందర్భంగా 46వ సర్వసభ్య సమావేశానికి రంగం సిద్ధమైంది. ఈనెల 28న ఉదయం 11 గంటలకు ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్స్‌లో సమావేశం నిర్వమించనున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటి శాఖ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరు కానున్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ హైదరాబాద్ జోనల్ హెడ్ సీజీఎం ఆర్ సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా సహకార అధికారి జి.శ్రీనివాస్ పాల్గొననున్నారు.సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు మేనేజింగ్ డైరెక్టర్ ఇ.రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సమావేవానికి హాజరు కావాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్,సీజీఎం సత్యనారాయణను బ్యాంక్ చైర్మన్ సింగిరెడ్డి రామ్‌రెడ్డి, డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డిలు కలిసి ఆహ్వానించారు.

## ఘనంగా వపన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రముఖ నటుడు, ఏపి డిప్యూటీ సిఎం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగారం డివిజన్ పరిధిలో బిజెపి నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సురేష్, పోతంశెల్లి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్ పటేల్, సంపత్ యాదవ్, అనూష, వెంకటేష్, మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు బాలంపేట విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/దౌల్తాబాద్:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల పరిధిలోని బాలంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయి అంథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వెంకటేష్‌నాయక్ రాష్ట్ర స్థాయి అథ్లేటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పిడి మల్లేశ్, ఉపాధ్యాయ బృందం అభినందించి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట స్థాయిలో కూడా విద్యార్థి మంచిప్రతిభ కనబరచి పాఠశాలకు మండలానికి మంచి పేరు తీసురావాలని ఆకాంక్షించారు.

# ‘సర్’ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### రాష్ట ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా,పూర్తి పారదర్శకంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని రాష్ట ఎన్నికల అధికారి పి.సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికరి కలెక్టర్ దీపక్‌తివారిలతో కలిసి ఆలంపల్లి,169,170,శివరెడ్డి పేట్ 133, 134 పోలింగ్ స్టేషన్లను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పరిశీలించాలి, ఓటర్లు సరి అయిన ధృవపత్రాలు సమర్పించనిచో ఆర్‌ఐ ద్వారా పంచనామా చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఎన్ని నోటీసులు జారీ చేశారు. ఇంకా చేయాల్సినవి ఎన్ని బిఎల్ ఒలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకర్గాలకు సంబంధించి ఇఆర్‌ఒలు,తహసీలార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడు తూ ఓటర్లు వివరాల పరిశీలన,పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్, నోమ్యాపింగ్ అనోమలిష్ వంటి కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిఇఒ సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరు పేరు కూడా జాబితానుండి తొలిపోకుండా తగు జాగ్రతాలు తీసుకోవాలని,అదే సమయంలో అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీలు , చిరునామా మార్పులు,తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న వాటిని నిర్దేశించిన గడువులోగా నమోదు చేయాలన్నారు. ప్రతి బూత్ స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను బాధ్యతాయుతంగా పరిశీలించాలని తెలిపారు. సర్ ప్రక్రియల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్ , డిఎస్‌పి అంజయ్య, డిఆర్‌ఓ స్వర్ణలత ,ఆర్‌డిఓ వాసుచంద్ర, వికారాబాద్, పరిగి,కొడంగల్ మున్సిపల్ కమిషన్లు ,తహసీల్దార్లు సంబంధిత ఎన్నికల అధికారులు, అధికారులు పాల్గొన్నా రు.

**ప్రతీ పౌరుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి**

**రాష్ట్రవ్యాప్తంగా 60శాతం నోటీసుల పంపిణీ**

**తాండూరు:** ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రత్యేక



సమగ్ర సవరణ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారుల పనితీరును ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తాండూరు పట్టణం లోని పాతమున్సిపల్, ఎంపిటి హాల్, గౌతాపూర్ ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను సిఇఒ సందర్శించారు. ఆయా కేంద్రాలలో బిఎల్‌ఒలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు, నోటీసుల పంపిణీ, ధృవీకరణ పత్రాల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లకు సంబంధించి సుమారు 60శాతం నోటీసులు అందజేశామని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం 72శాతం నోటీసుల పంపిణీ పూర్తి చేశారని వెల్లడించారు. నోటీసులు అందు కున్న ఓటర్లు అందులో పేర్కొన్న వివరాల ప్రకారం అవసరమైన సంబంధిత ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. నమోదు చేసుకోవాడానికి వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని సిఇఒ వివరించారు. ఆ ప్రాంతాలలో బిఎల్‌ఒల సహకారంతో కూడా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటి కే అందించిన నోటీసులపై క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, బిఎల్‌ఎఒలు విధులు ఎలా నిర్వహిస్తున్నారు విషయాన్ని తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచ్చిన్ బస్వరాజ్, తాండూరు ఆర్డిఒ అనిత, తహసీల్దార్ తారాసింగ్, డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాంకీ డంపింగ్ యార్డ్ విషవాయువులకు మరొకరి మృతి

### జవహర్ నగర్ పోరాట కమిటీ ఆగ్రహం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డ్ వెదజల్లుతున్న విషవాయువుల వల్ల శ్వాసకోశ సమస్యతో గబ్బిలాలపేట వైఎస్ఆర్ నగర్ నివాసి బొల్లం కృష్ణ (37) నిన్న రాత్రి మృతి చెందారు. ఆయన మరణం సహజమైనది కాదని, అది ముమ్మాటికీ రాంకీ డంపింగ్ యార్డ్ చేసిన పరోక్ష హత్యేనని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు బొల్లం కృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ వల్ల గాలి, పర్యావరణం తీవ్రంగా కాలుష్యమయమై చుట్టుపక్కల కాలనీల ప్రజలు తీవ్ర శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. 37 ఏళ్ల వయస్సులోనే కృష్ణ చనిపోవడం వల్ల ఆయన కుటుంబం తీవ్ర దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నాలుగు నెలలుగా డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి అసహజ మరణాలు, పరోక్ష హత్యలను వెంటనే అరికట్టాలని హెచ్చరించారు.

**నాయకుల ప్రధాన డిమాండ్లు**

మృతుడు బొల్లం కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే తగిన ఆర్థిక సహాయం అందించాలి. మరణానికి కారణమైన రాంకీ డంపింగ్ యార్డ్ యాజమాన్యంపై హత్య నేరం కింద చట్టపరంగా కేసు నమోదు చేయాలి. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే అక్కడ నుండి తొలగించాలి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి, ప్రజా కళామండలి జాన్,



సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానం దం, టియుసిఐ నాయకుడు బి.ప్రవీణ్, ఐఎఫ్‌టియు నాయకుడు శివ బాబు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు మల్లేష్, స్థానిక కార్పొరేటర్ సుబ్రహ్మణ్యం, చైతన్య మహిళా సంఘం నాయకులు జయ, శ్రీదేవి, అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ సునీత, నంద మూరి నగర్ వ్యవస్థాపకులు చింతల యాదగిరి, శారద తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకత్వ చెక్‌డ్యామ్ పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

**ప్రజాపక్షం/నవాబుపేట్:** మండలంలోని అక్నాపూర్ గ్రామంలో పెద్దకత్వ చెక్‌డ్యామ్ సమస్యపై ఇటీవల ప్రజాపక్షం పత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఇరిగేషన్ డిఇ వెంకట్ రమణ, ఎఇ వెంకటేశ్వర్లు చెక్‌డ్యామ్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌డ్యామ్ పరిస్థితిని పరిశీలించడంతో పాటు, నీటి నిల్వ, గేట్ల ఏర్పాటు, గతంలో చేపట్టిన పనుల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గతంలో మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా చెక్‌డ్యామ్ వద్ద పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం నీరు బయటకు వెళ్లే గేట్ల వద్ద కొన్ని సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గేట్లు ఏర్పాటు చేయలేకపోవడానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. చెక్‌డ్యామ్‌కు సంబంధించి ఇంకా చేపట్టాల్సిన పనులు, అవసరమైన మరమ్మతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అలాగే చెక్‌డ్యామ్‌కు అవసరమైన పనులకు త్వరలోనే అంచనాలు (ఎస్టిమేట్లు) రూపొందించి, నిధులు మంజూరైన అనంతరం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



ప్రజాపక్షం ఎఫెక్ట్

చెక్‌డ్యామ్ సమస్యను పరిశీలించేందుకు అధికారులు గ్రామానికి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి, చెక్‌డ్యామ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులకు, గ్రామ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ‘సర్’ అవకతవకల సూత్రధారి సిఇసి దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకల నిర్ణయాలకు బాధ్యుడైన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు డిమాండ్ చేసారు. శుక్రవారం మల్కాజిగిరిలో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను ధగ్గం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరిట అర్హులైన ఓటర్లను పెద్ద సంఖ్యలో తొలగించటం ద్వారా ప్రజల్లో అయోమయం ఏర్పడిందని, దీనికంతా కారణం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకొన్న ఏకపక్ష నిర్ణయాలే అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే 2.31లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలన్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలన్నారు.

## చిట్టిగిద్ద గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

### రోడ్ల అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు : ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చిట్టిగిద్ద గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందిస్తున్న స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యకు గ్రామ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని చిట్టిగిద్ద గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు అన్నారు. గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కాలే యాదయ్య అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. చిట్టిగిద్ద గ్రామంలో రోడ్ల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మండలంలోని ప్రతి గ్రామానికి లింక్ రోడ్ల సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. చిట్టిగిద్ద గ్రామంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావును సూచించారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉన్నప్పటికీ, ఎన్నికలు పూర్తయిన తర్వాత గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నా రు. గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు, ఏఎంసి చేర్మెన్ రాథోడ్ గీతా సింగ్, రాం రెడ్డి, ఉప సర్పంచ్ అనసూజా రంగయ్య గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## హోరెత్తిన నిమజ్జనాలు

### ప్రత్యేక పూజల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ ఉప్పల్/ బోడుప్పల్ :** గత 11 రోజులుగా వాడవాడలా ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో పూజలందుకొన్న విభిన్న రూపాల్లో వెలసిన వినాయక ప్రతిమలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మరింత ఉత్సాహంగా భక్తులు శోభాయాత్ర, డప్పు వాయిద్యాలు, నాట్యాల కోలాహలంతో భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేసారు. తెల్లవారుజాము నుండే ఆయా ప్రాంతాల్లో ఉన్న వినాయక మండపాల వద్దకు చేరిన స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేయగా నిర్వాహకులు వివిధ అలంకరణలతో కూడిన చిన్నపాటి వాహనాల నుండి భారీ వాహనాల్లో నిమజ్జన ప్రాంతాలకు వినాయకుడిని తీసుకెళ్లే ఏర్పాట్లలో మునిగిపోయారు. వాడవాడలా జై బోలో గణేష్ మహరాజ్‌కీ, గణపతి బప్ప మోరియా. అగిలే బరస్తు జల్ది ఆజా, చిట్టెలుకా కాగయ్ లడ్డు లేకే బాగ్గయా అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర తరలిన నిమజ్జన యాత్రలో పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు మహిళలు,యువతీ యువకులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నాట్యమాడుతూ పాల్గొన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నేతలు,బస్తీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు మండపాలతో పాటు శోభాయాత్రలో పాల్గొని మరింత ఉత్సాహం కలిగించారు.పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.మల్కాజిగిరి, సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థలు,జలమండలి, పోలీసు, విద్యుత్,వైద్య తదితర విభాగాలు సమన్వయంతో చెరువులు, కుంటలు,ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనుల వద్ద ఏర్పాట్లు చేసారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర దారి పొడుగునా వెళుతున్న వినాయకులకు అడుగడుగునా పెద్ద సంఖ్యలో చేరిన భక్తులు నీరాజనాలు పలికారు. హబ్సిగూడలోని నవకర్ గోల్డ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కల్సి ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, బిఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి లు ప్రత్యేక పూజలు చేసారు.

## జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరణ



**ప్రజాపక్షం/ధారూర్:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా దివ్య అవార్డును స్వీకరించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని ధారుర్ మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, నైతిక విలువల పెంపొందింపుతో పాటు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని అధికారులు అభినందించారు. ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ ఈ గుర్తింపు తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందు కు భవిష్యత్తులోనూ మరింత అంకితభావంతో పని చేస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డుకు ఎంపిక చేసిన అధికారులకు, సహచర ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పండిత్‌దీన్ దయాల్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం /బొంరాస్‌పేట్ :** కొడంగల్ నియోజకవర్గ బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో పండిత్ దీన్ దయాల్ 110వ జన్మదినం కార్యక్రమం బిజెపి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మోర్చ మండల అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ పండిత్ దీన్ దయాల్ ను గుర్తు చేసుకోవడం గొప్పవిషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి జగదీశ్వర్ సాగర్ , బాబయ్య, సతీష్, అంజి, శివానందం, మల్లేశ్‌యాదవ్, రాజునాయక్, దశరథ్ నాయక్, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## తాత్కాలిక డిఎసిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం /పరిగి :** పట్టణంలోని నూతన తాత్కాలిక డిఎస్‌పి కార్యాలయాన్ని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్థానికి నాయకులతో, ప్రజాప్రతినిధులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డిఎస్‌పిశ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐలు మోహన్‌కృష్ణ ,భరత్‌రెడ్డి రామెఫ్‌కుమార్, వసంతజదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు కమల్, పార్థసారథి, రామకృష్ణారెడ్డి, వెంకటరాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పై అవగాహన హోరు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** యాంటీబయోటిక్స్ దుర్వినియోగంతో పెరుగుతున్న ఔషధ నిరోధకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ప్రపంచ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ,పోస్టర్ ప్రదర్శన కార్టూన్ పోటీ,ప్రశ్నావళి,వీధి నాటకం నిర్వహించారు.చౌదరిగూడ నుంచి ప్రతాపసింగారం ఎక్స్‌రెడ్ వరకు జరిగిన ర్యాలీని డాక్టర్ బి.వసుధ భక్షి,డాక్టర్ చిన్నాల కృష్ణ మోహన్ ప్రాంభించారు.సీఎస్ఐఆర్,ఐఐసీటీ సాంకేతిక అధికారి నెనావత్ రమేష్ విద్యార్థులకు యాంటీబయోటిక్స్ బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కల్పించారు.కార్యక్రమాల్లో 116 మంది విద్యార్థులు పాల్గొన్నారు.డాక్టర్ జి.బాబా శంకర్‌రావు,డాక్టర్ పి.నవీన్,బి.తిరుపతి,డాక్టర్ జె.రాజేందర్,రాజీవ్ కుమార్,అజ్మత్ ఫర్హానా,ఎన్ మౌనిక,ఎ.దివ్య,కె.సునంద్, రాముడు, అకీఫ్, సయాద్ నిర్వహణలో పాల్గొన్నారు.



'నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్‌లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది.

రీల్




## 'శివ ట్రాన్స్' సాంగ్ రిలీజ్

హాయ్ జాయ్ కమర్షియల్స్ బ్యానర్‌పై డా.చింతాడ హేమారావు నిర్మాతగా, వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ 'చకోర'. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను ర్యాప్ బీట్‌తో ప్రిన్స్ హెన్రీ ఎనర్జిటిక్ గా కంపోజ్ చేశారు. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యాన్ని అందించారు. రితేష్ రావ్ పాడారు. 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను ప్రమోషనల్ సాంగ్‌గా రూపొందించారు. వైజాగ్ బీచ్‌లో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో ఈ పాటను కలర్ ఫుల్‌గా తెరకెక్కించారు. ర్యాప్ బీట్‌తో శివుడిని స్తుతిస్తూ పాట డిజైన్ చేయడం కొత్త ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. ఈ పాటలో మూవీ టీమ్ మెంబర్స్ పాల్గొనడం విశేషం. శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, ఆకెళ్ళ గోపాల కృష్ణ, వంగపండు,వంశీ, సుమంత్, భాను, సూర్య మాకిరెడ్డి, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : లాలం కన్నాజీ, పాటలు : రామ జోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ యాక్షన్ కొరియోగ్రఫీ రామ్ కిషన్, ప్రొడక్షన్ డిజైనర్ రామ్ చరణ్ తేజ్ లాభాని, డీవోపీ రుప్ప గోపీకృష్ణ, ఎడిటర్ : మార్తాండ కె వెంకటేష్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రిన్స్ హెన్రీ, నిర్మాత డా. చింతాడ హేమారావు, రచన, దర్శకత్వం మంగా శ్రీనివాస్.

## నిజ జీవిత ప్రేమ కథ 'జాన్'




ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న 'జాన్' ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతూ, ప్రేమ, అనుబంధం, తోడుగా నిలిచే బంధం చుట్టూ సాగే కథను పరిచయం చేస్తోంది.ఆర్యన్ గౌర రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆర్యన్ గౌర, మోనిషా మోహన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. రావు రమేష్, బాబా భాస్కర్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వీల్‌చైర్‌లో కూర్చున్న మోనిషా వెనుక ఆర్యన్ నిలబడి, వీల్‌చైర్ హ్యాండిల్స్‌పై చేతులు ఉంచి కనిపిస్తున్నారు. మోనిషా చిరునవ్వు, అందమైన ప్రకృతి నేపథ్యం, అలాగే ఫరెవర్ అనే పదం పోస్టర్‌కు మరింత ఎమోషనల్ టచ్‌ను అందిస్తున్నాయి. వీల్‌చైర్‌ను టైటిల్ డిజైన్‌లో క్రియేటివ్‌గా భాగం చేయడం ఫస్ట్ లుక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక పోస్టర్‌లో కనిపించే క్యూట్ డాగ్ కూడా తనదైన శైలిలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రానికి మూడు సార్లు నేషనల్ అవార్డ్ విజేత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అమరన్ చిత్రానికి ఇటీవల అందుకున్న నేషనల్ అవార్డ్‌తో ఆయన మూడు నేషనల్ అవార్డులను సొంతం చేసుకున్నారు. గతంలో సూరరై పోట్రు, వాతి చిత్రాలకు కూడా ఆయన నేషనల్ అవార్డులు అందుకున్నారు. లక్ష్మీ నరసింహా మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'జాన్' చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది తెరకెక్కుతోంది. ప్రేమ, అనుబంధం, జీవిత ప్రయాణంలో ఒకరికొకరు తోడుగా నిలిచే భావోద్వేగాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది.

## సై ఫై థ్రిల్లర్‌గా 'కిల్లర్'



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్లర్' సినిమా అక్టోబర్ 30న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓవర్సీస్ లో 'కిల్లర్' మూవీ గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ 'కిల్లర్' సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్ రష్యా వంటి దేశాల్లో విడుదల చేయబోతోంది. జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ , మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ ఆశీర్వాద్, సుమన్ జీవ, ఆర్ట్ డైరెక్షన్ మణి, యాక్షన్ కొరియోగ్రఫీ రాజ్ కుమార్ గంగపుత్ర, లైన్ ప్రొడ్యూసర్స్ దశరథ మాధవ్, సీతారామారావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డిఎస్ బాష.

## 'జార్జ్ క్రిష్' హీరోయిన్‌గా మానస వారణాసి

నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్‌లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ బ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న కటౌట్ ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ'తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి.. 'జార్జ్ క్రిష్'లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కెవి గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో భాగం కాగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.



## భిన్సాలీ గొప్ప దర్శకుడు : అలియాభట్




రణబీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన తర్వాత సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న 'లవ్ అండ్ వార్' చిత్రంలో అలియా భట్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అలియా ఇంతకుముందెన్నడూ కనిపించని గ్లామరస్ లుక్‌లో మెరిసింది. ఈ సినిమాలో సంజయ్ లీలా భన్సాలీ తన గత చిత్రాలకు భిన్నమైన ఆధునిక ప్రపంచాన్ని చూపించబోతున్నారు. మేకర్స్ సోషల్ మీడియాలో అలియా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన ఈ పోస్టర్‌లో అలియా స్లిట్ స్కర్ట్, ప్రత్యేకమైన హెడ్‌పీస్‌తో కుర్చీలో కూర్చుని కనిపించింది. ఆమె లుక్, స్టైలింగ్, హావభావాలు రెట్రో ఫీల్‌ను అందిస్తున్నాయి. ఈ పాత్రలో అలియా పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపించనుందని పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్'లో రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 21న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సంజయ్ లీల బన్సాలి అద్భుతమైన దర్శకుడని ఈ సందర్భంగా అలియా భట్ కొనియాడారు.

## అంతుచిక్కని నిజం 'పూజా మేరీ జాన్'




ప్రతి కథ కూడా సులభంగా అందరికీ అర్థమయ్యేలా ఉండదు. కొన్ని కథలు మనలను అసౌకర్యానికి గురిచేస్తాయి.. మనం సహజంగా అంగీకరించే విషయాలను కూడా ఆ కథలు ప్రశ్నించేలా చేస్తాయి.. చూడకూడదనుకునే నిజాలను ఎదుర్కొనేలా మనలను సిద్ధం చేస్తాయి. అలాంటి కథే 'పూజా మేరీ జాన్'. నవ్‌జోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. మ్యాడాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన 'పూజా మేరీ జాన్' అక్టోబర్ 2న హిందీ జీ5లో ప్రీమియర్ కానుంది. పూజా అనే అమ్మాయి చుట్టూ కలవరపరిచే ఘటనల నేపథ్యంలో సాగుతుంది. తిరస్కరణ, వ్యామోహం, నిజాన్ని అంగీకరించటం, అసలు ఏం జరిగిందనే నిజం వంటి అంశాలపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతుందీ చిత్రం. ఈ సందర్భంగా నటి మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ 'మొదటి నుంచే పూజ పాత్ర నన్ను ఎంతగానో ఆకర్షించింది. నటిగా నాలోని విభిన్న కోణాలను ఆవిష్కరించుకునే అవకాశం ఈ పాత్రతో కుదురుతుందని, కొత్తదనాన్ని చూపించగలనని అనిపించింది. లోతైన, ఎన్నో భావోద్వేగ కోణాలు ఉన్న పాత్ర. పాత్ర చుట్టూ ఉన్న సంక్లిష్టత కారణంగా నన్ను సినిమా నన్ను ఆకట్టుకుంది. నటించే సందర్భంలో ఎన్నో రకాల భావోద్వేగాలను పలికించాల్సి వచ్చింది అని అన్నారు.

# ఐరాసపై అసంతృప్తి

### భారత విదేశాంగ మంత్రి జైశంకర్

**న్యూయార్క్ :** ఐక్యరాజ్యసమితి సంస్కరణలు జరగకపోవడంపై అంతర్జాతీయ సమాజంలో అసంతృప్తి పెరుగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సంస్కరణలను వ్యతిరేకిస్తున్న దేశాలు ఐరాసను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, సంస్థ పట్ల నిజమైన ఆసక్తి లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఐరాస సంస్కరణలపై చర్చ ప్రతి ఏడాది జరుగుతున్నప్పటికీ, ఇప్పుడు ఆ డిమాండ్ మరింత బలపడుతోందని జైశంకర్ చెప్పారు. సంస్కరణలపై అర్థవంతమైన చర్చ జరగాలంటే ముందుగా చర్చించేందుకు ఒక లిఖితపూర్వక ప్రతిపాదన ఉండాలని స్పష్టం చేశారు. ఏకాభిప్రాయంతో సంస్కరణ సాధ్యం కాదని, అభిప్రాయాలను చర్చించిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా ఐరాస మారాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా భద్రతా మండలి ప్రస్తుత భౌగోళిక, రాజకీయ వాస్తవాలను ప్రతిబింబించడం లేదని భారత్ చాలాకాలంగా వాదిస్తోంది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెష్ కూడా భద్రతా మండలి సంస్కరణలకు పిలుపునిచ్చారు.



**ఐరాస సర్వసభ్య సమావేశం హైలైట్స్**

ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వసభ్య సమావేశాల్లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, పాలస్తీనా నేత మహ్మూద్ అబ్బాస్ ప్రసంగాలు ప్రధానంగా నిలిచాయి. అమెరికా వీసా నిరాకరించడంతో అబ్బాస్ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయారు. కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా విదేశీ పర్యటనలు చేయకుండా దేశంలోని నేరాలు, హింసపై దృష్టి పెట్టాలన్న ఎన్నికల హామీ మేరకు న్యూయార్క్ రాలేదు. ఆయన తరఫున ఉపాధ్యక్షుడు జోస్ మాన్యుయెల్ రెస్ట్రెపో ప్రసంగించారు.బొలీవియా అధ్యక్షుడు రోడ్రిగో పాజ్ పెరీరా దేశంలో రాజకీయ సంక్షోభాలు, అవినీతి ఆరోపణలు, ఇంధన కొరత మధ్య తన ప్రభుత్వ విధానాలను సమర్థించుకున్నారు. సోషలిజం ప్రజల ఆకలి తీర్చదని చెబుతూ, మార్పు కోసం ప్రజలు తనను ఎన్నుకున్నారని అన్నారు. ఘనా అధ్యక్షుడు జాన్ మహామా మానవ నాగరికతలో ఏ దేశాన్నీ నిర్మూలించకూడదని వ్యాఖ్యానించారు. అట్లాంటిక్ బానిస వాణిజ్య నేరాలను గుర్తించే తీర్మానానికి మద్దతిచ్చిన 123 దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా, న్యూయార్క్‌లో చలి పెరగడంతో ఐరాస ప్రధాన కార్యాలయంలోని మీడియా సమావేశ మందిరం అత్యంత చల్లగా ఉందని జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.పరాగ్వే అధ్యక్షుడు శాంటియాగో పెనా తైవాన్‌కు తమ దేశ మద్దతును పునరుద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో పెనా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో జరిగే పరిణామాలు సెమీకండక్టర్ల సరఫరాతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని అన్నారు.

## రూ.39 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)



ఏటా వేలంలో పాల్గొనే భక్తుల సంఖ్యతో పాటు ధర పరంగానూ మైలురాళ్లను దాటుకుంటూ వస్తోంది. పంటలు బాగా పండటానికి,వ్యాపారాల్లో శుభాలు కలగడానికి ఈ లడ్డూ ప్రసాదం దివ్యౌషధంగా భావిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీ ఏడాదీ కొత్త రికార్డులు నమోదవుతూ వస్తున్నాయి. ఈ సారి సాధించిన రూ.39 లక్షల చారిత్రాత్మక మార్కు భాగ్యనగర్ గణేష్ ఉత్సవాల చరిత్రలోనే ఒక కొత్త రికార్డుగా నిలిచింది. లడ్డూను గెలుచుకున్న సామ ప్రణీత్ రెడ్డి దంపతులకు ఉత్సవ సమితి సభ్యులు, ఊరేగింపులో పాల్గొన్న వేలాది మంది భక్తులు ఘనంగా అభినందనలు తెలిపారు.ప్రతిష్ఠాత్మక బాలాపూర్ లడ్డూ దక్కడం తమ కుటుంబానికి లభించిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రణీత్ రెడ్డి వెల్లడించారు. గణేష్ లడ్డూ వేలానికి బాలాపూర్ కొత్త గ్లామర్ తీసుకు వచ్చింది. తరవాత అంత కంటే ఎక్కువ ధరలతో లడ్డూలను ఇతర సొసైటీలు, కాలనీల్లో పాడుకునేవారు ఉన్నారు. అయితే బాలాపూర్ లడ్డూ ప్రత్యేకత మాత్రం ఎప్పుడూ హైలెట్ అవుతూనే ఉంటుంది.

## మళ్లి రా!

(మొదటి పేజీ తరువాయి)



చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, ఎం.జె.మార్కెట్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుని క్రేన్ నెంబర్12 వద్ద నిమజ్జనం పూర్తి చేసుకుంది. పటిష్ఠ బందోబస్తు, పకడ్బందీ ఏర్పాట్లు నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. 4 కమిషనరేట్లకు చెందిన 45 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. నగర వ్యాప్తంగా 10 వేల సిసిటివి కెమెరాలు, 24 డ్రోన్‌లు, హైరైజ్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచారు. శుక్రవారం ప్రార్థనలు, నిమజ్జన ఊరేగింపు ఒకే రోజు రావడంతో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించి, బాంబ్ స్క్వాడ్ తనిఖీలతో కట్టుదిట్టమైన భద్రతను నిర్వహించారు. నగరవ్యాప్తంగా 141 నిమజ్జన కేంద్రాలలో 275 క్రేన్‌లను అందుబాటులో ఉంచగా, ఒక్క హుస్సేన్‌సాగర్ వద్దనే 12 క్రేన్‌ల ద్వారా నిమజ్జనాలు కొనసాగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టడంతో భాగ్యనగర వినాయక నిమజ్జన ఘట్టం అత్యంత శోభాయమానంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయింది.

## జాతీయ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)



నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్టేట్స్, యుటిస్ స్కిల్ సెక్రటరీస్ ఫర్ ప్రగతి రివ్యూలో వెల్లడైంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో, శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పర్యవేక్షణలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పిఎం సేతులో భాగంగా ఎంపికైన పారిశ్రామిక క్లస్టర్లలో నాలుగు యాంకర్ ఇండస్ట్రీ పార్ట్నర్స్ కోసం ప్రత్యేక ప్రయోజన సంస్థలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడ్చల్ క్లస్టర్‌కు జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఓల్డ్ సిటీ క్లస్టర్‌కు అపోలో మెడికల్స్ లిమిటెడ్, పటాన్‌చెరు క్లస్టర్‌కు శ్రీ సిద్ధార్థ ఇన్ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్, సంగారెడ్డి క్లస్టర్‌కు న్యూలాండ్ ఫౌండేషన్ యాంకర్ ఇండస్ట్రీ పార్ట్నర్‌గా ఉన్నాయి. పరిశ్రమల భాగస్వామ్యంతో ఐటిఐల్లో ఆధునిక సాంకేతికతలకు అనుగుణంగా శిక్షణ అందించి, అప్రెంటిస్‌షిప్, ఆన్ దిజాబ్ ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేస్తున్నారు.

**అప్రెంటిస్‌షిప్‌లో 92 శాతానికి పైగా ప్లేస్‌మెంట్..**

అప్రెంటిస్‌షిప్ ఆధారిత ఉపాధిలో తెలంగాణ 92 శాతానికి పైగా ప్లేస్‌మెంట్ రేషియో నమోదు చేసినట్లు సమీక్షలో వెల్లడైంది. పరిశ్రమలకు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను ముందుగానే గుర్తించి యువతకు శిక్షణ ఇవ్వడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అలాగే దేశీయ ఉపాధితోపాటు విదేశీ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా టామ్‌కామ్ ద్వారా యువతకు విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం రాష్ట్రవ్యాప్తంగా జర్మన్ భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మందమర్రి, కొడంగల్‌లో ఉచిత జర్మన్ భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నర్సులు, నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఐటిఐల ఆధునీకరణ, కొత్త టెక్నాలజీలపై శిక్షణ, పరిశ్రమల భాగస్వామ్యం, అప్రెంటిస్‌షిప్‌తో ప్రాక్టికల్ అనుభవం కల్పించడంతోపాటు రాబోయే స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. యువతకు నైపుణ్యాలు.. పరిశ్రమలకు నిపుణులైన మానవ వనరులు.. దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com